శనివారం
29•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 245
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## ఎక్కడి గోదారమ్మ.. ఎక్కడి 'కొండ'పోచమ్మ

**అక్కడెక్కడో అట్టడుగున, తెలంగాణ సరిహద్దున, సముద్రమట్టానికి కేవలం వంద మీటర్ల లోపునే పారే గోదావరి నది! అక్కడికి అల్లంత దూరాన, అంతెత్తున సముద్రమట్టానికి ఆరువందల పైచిలుకు మీటర్ల ఎగువన వెలిసిన కొండపోచమ్మసాగర్!**

'నీరు పల్లమెరుగు' అన్న నిత్యోక్తిని తిరగరాస్తూ తెలంగాణలో గోదావరి పైకి, పైపైకి ప్రవహిస్తూ వస్తున్నది. త్వరలోనే అది అర కిలోమీటరు ఎగువకు ఎగిరి దుంకి కొండపోచమ్మసాగర్‌లో నిండనున్నది!

అలనాడు భగీరథుడి తపస్సుతో ఆకాశగంగ దివి నుంచి భువికి దిగి వస్తే, ఇప్పుడు కేసీఆర్ తపనతో గోదారి గంగ భువి నుంచి మీదికి ఎగసివస్తున్నది. ఎన్నో ఏండ్లుగా ఎండుతున్న పొలాలను తన చల్లనిచూపుల తడితో తరింపజేసేందుకు తరలివస్తున్నది.

**శక్తిమంతుడైన శంభుని శిరంపై గంగమ్మ విశ్రమిస్తే, శక్తి స్వరూపిణి కొండపోచమ్మ సిగలో గోదారమ్మ సేదదీరనున్నది! తెలంగాణలో గోదావరి బేసిన్‌లో కొండపోచమ్మసాగరే అత్యంత ఎత్తయిన ప్రాంతం. ఇక్కడికి నీళ్లు చేరాయంటే.. రాష్ట్రంలో ఏ మూలకైనా సులభంగా గ్రావిటీతో నీళ్లను పంపవచ్చు! తెలంగాణలో ఇక ప్రతి చెరువూ పుష్కరఘట్టమే. తెలంగాణ నేల తల్లికి ఇక ప్రతిరోజూ పుష్కరస్నానమే!**

నది.. సాగరంలో కలువడం ప్రకృతి సహజం. కానీ నది రాకకోసం 'సాగర్'లు అవతరించడం నేటిసందర్భం. పడావుపడిన భూములను పచ్చటి పంటచేలుగా మార్చేందుకు ఉరికివస్తున్న గోదావరికి ప్రజలు సాదరస్వాగతం పలుకుతున్నారు. కొండపోచమ్మసాగర్ నిర్మాణంతో నిర్వాసితులైన మూడు గ్రామాల ప్రజలు శుక్రవారం స్వచ్ఛందంగా తమ ఊళ్లను ఖాళీచేశారు. తరాల అనుబంధాలకు వీడ్కోలు పలికారు. ప్రభుత్వం కట్టించిన కొత్త ఇండ్లలోకి సంతోషంగా, సామూహికంగా గృహప్రవేశం చేశారు. అరమరికలు లేకుండా అధికారులతో కలిసి సహపంక్తి భోజనంచేసి, తమ గ్రామాలను అధికారికంగా వారికి అప్పగించారు.

**ఊరు చిన్నదే కావచ్చు. కానీ వారిది పెద్దమనసు. తమ ఆవేదన కన్నా అందరి ఆనందమే ముఖ్యమనుకున్న పెద్ద మనుషులు వారు. వారి త్యాగాన్ని ఎలా కొలువగలం? ఏమని మరువగలం?!**



కొండపోచమ్మ రిజర్వాయర్

# కొండకెగిసే గోదారమ్మ



శుక్రవారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికిబొల్లారంలోని ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో సామూహిక గృహప్రవేశాల అనంతరం ఆనందం వ్యక్తంచేస్తున్న కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబం




ముంపు బాధితులు ఆర్‌అండ్‌ఆర్‌కాలనీకి తరలిపోవడంతో నిర్మానుష్యంగా తానేదార్‌పల్లి తండా



కొత్తగా నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో గృహప్రవేశం సందర్భంగా వంటచేసుకుంటున్న కుటుంబం

## త్వరలో పోచమ్మసాగర్‌కు గోదావరి జలాలు

### మరో అద్భుతం ముంగిట కాళేశ్వరం ప్రాజెక్టు

**అత్యంత ఎత్తున జలాశయం.. మల్లన్నసాగర్‌ను దాటుకొని రానున్న గోదావరి జలాలు**

**త్వరలో అన్నపూర్ణ జలాశయానికి ఎత్తిపోత.. సాకారమవుతున్న కేసీఆర్ జలసంకల్పం**

## స్వచ్ఛందంగా ఇండ్లు ఖాళీచేసిన ముంపు బాధితులు

- చుట్టాలు, దోస్తుల నడుమ గ్రామ దేవతలకు పూజలు
- ఆర్‌అండ్ ఆర్ కాలనీలో తానేదారుపల్లి, మామిడ్యాల, తానేదారుపల్లి తండాల్లోని 351 కుటుంబాల సామూహిక గృహప్రవేశాలు
- 64 మంది పూజారులతో పూజలు
- అధికారులతో సహపంక్తి భోజనం

### సర్కారుకు రుణపడి ఉంటం



మా త్యాగాన్ని యాదిపెట్టుకొని సర్కారు.. సదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు కూడా ఇప్పించింది. భూములు పోతయన్నప్పుడు ఆగమైపోతమనుకున్నం. కానీ అధికారులు మా వెంటే ఉండి ధైర్యం చెప్పిండ్రు. మమ్ముల ముందుకు నడుపుతున్నరు. సర్కారు ఇచ్చిన ఇండ్లు మంచిగున్నయి. మేమందరం నిజంగా సర్కారుకు రుణపడి ఉంటం.

రాచకొండ నాగేశ్-పుష్ప, మామిడ్యాల భూనిర్వాసితులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

'తలాపున పారుతుంది గోదారి.. మా చేను, మా చెలక ఎడారి..' అనే ఉద్యమ గీతాన్ని పూర్తిగా మార్చేసిన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టం సాక్షాత్కారానికి ముహూర్తం సమీపించింది. తలాపున పారుతున్న గంగమ్మను ఒడిసిపట్టి.. దాదాపు పది దశల్లో ఎత్తిపోసి.. తెలంగాణలోనే గరిష్ఠ ఎత్తున ఉన్న కొండపోచమ్మ సాగర్‌కు తరలించే ప్రక్రియ త్వరలో ప్రారంభంకానున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ జలసంకల్పంలో భాగంగా ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతున్న కాళేశ్వరం ఎత్తిపోతలతో ఫిబ్రవరిలోనూ అనేక చెరువులు నిండుకుండల్లా మారాయి. గోదావరి నదీగర్భం నుంచి 200 మీటర్లకుపైగా ఎత్తున ఉన్న శ్రీరాజరాజేశ్వర జలాశయంలోకి ఇప్పటికే నీటిని తరలిస్తున్నారు. అక్కడినుంచి మరో 300 మీటర్లకుపైగా ఎత్తున్న కొండపోచమ్మలోకి ఎత్తిపోసేందుకు రంగం సిద్ధమవుతున్నది. దీంతో త్వరలోనే తెలంగాణ గడ్డపై గోదావరి బేసిన్‌లో అత్యధిక ఎత్తున కాళేశ్వరం జలాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ఉన్న ఎత్తిపోతల పథకాల్లో గరిష్ఠస్థాయిని అధిగమించడం మరో విశేషం కానున్నది. ఈ క్రమంలోనే కొండపోచమ్మ ముంపు గ్రామాలైన తానేదారుపల్లి, మామిడ్యాల, తానేదారుపల్లి తండాలకు చెందిన 351 కుటుంబాలు ఇండ్లను ఖాళీచేసి తున్కిబొల్లారంలో నిర్మించిన ఆర్‌అండ్ ఆర్ కాలనీలో చుట్టాలు, దోస్తుల నడుమ శుక్రవారం సామూహిక గృహప్రవేశాలుచేశాయి.

సమగ్ర కథనం 4వ పేజీలో

## అసెంబ్లీ సీట్లు మాకెందుకు పెంచరు?

- ఒకే దేశం - ఒకే చట్టం నినాదం ఏమైంది?
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని నిలదీసిన రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్‌చైర్మన్ బీ వినోద్‌కుమార్

2

## ఉద్యోగులకు షాక్!

- పీఎఫ్ డిపాజిట్లపై తగ్గనున్న వడ్డీరేట్లు
- 8.5 శాతానికి కుదించాలని ఈపీఎఫ్‌వో యోచన

8

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 55.00 | రిటైల్ లైవ్ | 77.00 |
| డ్రెస్‌డ్ | 112.00 | స్కిన్‌లెస్ | 127.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 316.00 | రంగారెడ్డి | 316.00 |
| మెదక్ | 316.00 | కరీంనగర్ | 319.00 |
| వరంగల్ | 319.00 | డజన్ ధర | 60.00 |



**అజ్మీర్ దర్గా ఉత్సవాలకు గిలాఫ్**

అజ్మీర్ దర్గా ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రం తరపున సమర్పించే గిలాఫ్‌కు శుక్రవారం ప్రగతిభవన్‌లో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, మైనార్టీ కమిషన్ చైర్మన్ కమ్రుద్దీన్ ఖాద్రి, మక్కామసీదు ఇమామ్ హఫీజ్ మహ్మద్ ఉస్మాన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ తదితరులు

# పవర్‌ఫుల్ డిమాండ్

- తెలంగాణలో 13,168 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్
- ఉమ్మడి ఏపీలో గరిష్ఠ డిమాండ్ 13,162 మెగావాట్లే
- తలసరి వినియోగంలోనూ 1,896 యూనిట్లతో రికార్డు
- విద్యుత్ వాడకంలో దేశంలో రాష్ట్రానికి రెండోస్థానం
- సొంత రాష్ట్రంలో 43 లక్షలు పెరిగిన కనెక్షన్లు
- అయినా కోత, లోటు లేకుండా విద్యుత్ సరఫరా

| తలసరి విద్యుత్ వినియోగం | |
|---|---|
| దేశవ్యాప్తంగా | 1,181 యూనిట్లు |
| తెలంగాణలో | 1,896 యూనిట్లు |



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ విద్యుత్‌శాఖ చరిత్రను తిరగరాసింది. గతమెన్నడూ ఎరుగని విధంగా రాష్ట్రంలో శుక్రవారం ఉదయం 7.52 గంటలకు 13,168 మెగావాట్ల అత్యధిక విద్యుత్ డిమాండ్‌తో సరికొత్త రికార్డును సృష్టించింది. తలసరి విద్యుత్ వినియోగంలోనూ మరో ఘనతను సాధించింది. చరిత్రలో తొలిసారి దేశవ్యాప్త సగటును మించి తెలంగాణలో వినియోగం నమోదయింది. ఇంత పెద్దఎత్తున విద్యుత్ డిమాండ్ ఏర్పడినాఎక్కడా కోత, లోటు లేకుండా విద్యుత్ సంస్థలు విద్యుత్ సరఫరా చేయగలిగాయి.

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిమాండ్‌ను దాటి రికార్డు**

23 జిల్లాలు కలిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మొదటిసారిగా 2014 మార్చి 23న 13,162 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్

మిగతా 2వ పేజీలో

## మార్కెట్లకు వైరస్

# కల్లోలం

**సెన్సెక్స్ 1,448, నిఫ్టీ 431 పాయింట్ల పతనం**

**ఆవిరైన రూ.5.45 లక్షల కోట్ల సంపద.. చరిత్రలో రెండో అతిపెద్ద పతనం**

**కుప్పకూలిన ప్రపంచ మార్కెట్లు**

**సంపన్నులకూ తప్పని కరోనా కాటు**

బ్లాక్ ఫ్రైడే



**కరోనా వైరస్** మరిన్ని దేశాలకు విస్తరిస్తున్నదన్న వార్తలతో శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కకావికలమయ్యాయి. దేశీయ స్టాక్ మార్కెట్లలో సెన్సెక్స్ 1,448, పాయింట్లు, నిఫ్టీ 431 పాయింట్ల భారీ నష్టాన్ని మూటగట్టుకొని చరిత్రలో రెండో అతిపెద్ద పతనానికి లోనయ్యాయి. అనేక సూచీలు ఘోరంగా నష్టపోవడంతో ఒక్కరోజులోనే రూ.5.45 లక్షల కోట్ల మదుపరుల సంపద హారతికర్పూరంలా కరిగిపోయింది. సంపన్నులను సైతం కరోనా బలంగా కాటేసింది. గత వారంరోజుల్లో ఈ వైరస్ ధాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఏకంగా రూ.36,100 కోట్ల సంపదను కోల్పోగా.. కుమారమంగళం బిర్లా రూ.6,300 కోట్లు, అజీమ్‌ప్రేమ్‌జీ రూ.6,200 కోట్లు, గౌతమ్ అదానీ రూ.3,500 కోట్లు, టాటాగ్రూప్ సంస్థలు రూ.41,930 కోట్ల నష్టాన్ని చవిచూశాయి.

8




ఏపీలోని పాడేరు పాఠశాలలో, నర్సీపట్నంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, గణేశ్

## గ్రీన్‌చాలెంజ్‌లో ఏపీ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎంపీ సంతోష్‌కుమార్ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన గ్రీన్‌చాలెంజ్ జోరందుకుంటున్నది. గ్రీన్ ఇండియా చాలెంజ్, రోజావనం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారంనాడు ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేశ్, భాగ్యలక్ష్మి తమ నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో మొక్కలు నాటారు. నర్సీపట్నం ఎమ్మెల్యే గణేశ్ తన నియోజకవర్గానికి చెందిన పెద్దబొడ్డేపల్లి గ్రామంలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో మూడు మొక్కలునాటారు. పాడేరులోని కస్తూర్బా పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రీన్‌చాలెంజ్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్న ఎంపీ సంతోష్‌కుమార్‌తోపాటు రోజావనం చేపట్టిన నగరి ఎమ్మెల్యే రోజాను ప్రత్యేకంగా అభినందించారు.

## చెట్లపై వేటు.. 54 వేల జరిమానా

- 40 చెట్లకు బదులుగా 80 మొక్కలు పెంచాలి
- గేటెడ్ కమ్యూనిటీకి అటవీశాఖ ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పచ్చదనం పరిరక్షణ పట్ల అటవీశాఖ కఠినంగా వ్యవహరిస్తున్నది. పచ్చనిచెట్లను నరికివేసేవారికి భారీగా జరిమానాలు వడ్డిస్తున్నది. తాజాగా హైదరాబాద్, కూకట్‌పల్లిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీపై తీవ్రచర్యలు చేపట్టింది. అనుమతిలేకుండా 40చెట్లను నేలకూల్చిన ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్(గార్డెనియా) గేటెడ్ కమ్యూనిటీ సొసైటీకి అటవీశాఖ అధికారులు రూ.54వేల జరిమానా విధించారు. కూల్చిన చెట్లకు రెండింతలు మొక్కలునాటాలని ఆదేశించారు. గేటెడ్ కమ్యూనిటీలో చెట్లను నరుకుతున్నారన్న సమాచారం అందుకున్న మేడ్చల్ డివిజన్ అటవీ అధికారి సుధాకర్‌రెడ్డి కాలనీలో పరిస్థితులను పరిశీలించారు. అనుమతి లేకుండాచెట్లను నరికివేయడాన్ని చూసి కాలనీవాసులపై వాటర్ ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్(వాల్టా)–2002 చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నారు. వారికి రూ. 53,900జరిమానా విధించడంతోపాటు నష్టపరిహారంగా 80 మొక్కలను వెంటనే నాటాలని ఆదేశించారు.




చలాను రశీదు



## యూనివర్సిటీలకు పాలకమండళ్లు

**నియామక ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు పాలకమండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్: ఈసీ) సభ్యులను నియమించింది. ఉస్మానియా, మహాత్మా గాంధీ, పాలమూరు, తెలంగాణ, శాతవాహన, జేఎన్ఏఎఫ్ఏ యూనివర్సిటీలవారీగా శుక్రవారం వేర్వేరు జీవోలు జారీచేసింది. పాలకమండలి సభ్యుల్లో ఐదుగురు ఎక్స్‌అఫీషియో, నలుగురు ప్రముఖులతో కలిపి మొత్తం తొమ్మిది మందిని నియమించింది. సభ్యుల నియామకాల్లో అన్నివర్గాలకు ప్రాతినిధ్యం కల్పించారని ప్రొఫెసర్లు అభిప్రాయపడ్డారు. పాలకవర్గాల వివరాలకు www.ntnews.com వెబ్‌సైట్‌లో చూడండి.

## విచారణ కమిషన్ నేపథ్యంలో పిటిషన్ స్వీకరించలేం

**దిశ నిందితుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దిశ నిందితుల కుటుంబాలు దాఖలుచేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని, పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని నిందితుల కుటుంబాలు పిటిషన్ వేశాయి. ఈ కేసు విచారణకు కమిషన్ వేశామని, పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాబ్డే స్పష్టం చేశారు. విచారణ కమిషన్‌ను కలిసి వివరించే స్వతంత్రత ఇస్తున్నామని తెలిపారు. న్యాయం జరగలేదని భావిస్తే మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని చెప్పారు. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

## ఎంఎంటీఎస్ పనులతో పలు రైళ్ల రద్దు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మౌలాలి–ఘట్‌కేసర్ మధ్య జరుగుతున్న ఎంఎంటీఎస్ ఫేజ్–2 పనుల కారణంగా పలు రైళ్లు రద్దుచేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ప్రకటించింది. ఫలక్‌నుమా–భువనగిరి మెము, ఫలక్‌నుమా–జనగామ, హైదరాబాద్–వరంగల్, రేపల్లె–సికింద్రాబాద్ ప్యాసింజర్, సికింద్రాబాద్–మణుగూరు ప్యాసింజర్ రైళ్లను మార్చి 11న రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నది. బల్లార్షా–సికింద్రాబాద్, సికింద్రాబాద్–గుంతకల్లు రైళ్లను సికింద్రాబాద్–ఖాజీపేట మధ్య పాక్షికంగా, నాగపూర్–వార్ధా–నాగపూర్ సెక్షన్‌లో పనుల కారణంగా వచ్చేనెల 31న అజ్నీ– ఖాజీపేట రైలును రద్దు చేస్తున్నట్టు తెలిపింది. జక్లైర్–మక్తల్ మధ్య నిర్వహణ పనుల వల్ల వచ్చేనెల 4న మహబూబ్‌నగర్–జక్లైర్ రైలును రద్దుచేసినట్టు చెప్పింది.

### ముహూర్తం



సూర్యోదయం: 6.35 గంటలకు



సూర్యాస్తమయం: 6.15 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం పంచమి ఉదయం 9.10 వరకు, తదుపరి షష్ఠి,
నక్షత్రం: భరణి రోజంతా,
అమృతఘడియలు: లేవు,
రాహుకాలం: ఉదయం 9.30 నుంచి 10.58 వరకు,
దుర్ముహూర్తం: ఉదయం 6.35 నుంచి 8.08 వరకు,
వర్జ్యం: ఉదయం 5.50 నుంచి 7.37 వరకు.

# సీఎం ఇంట్లో రోజూ చికెన్!

- ఎవరూ అనారోగ్యం పాలు కాలేదు
- చికెన్, గుడ్లపై దుష్ప్రచారాలే
- త్వరలోనే తెలంగాణ పౌల్ట్రీ పాలసీ
- చికెన్, ఎగ్‌మేళాలో మంత్రి కేటీఆర్



పీపుల్స్‌ప్లాజాలోని చికెన్, ఎగ్ మేళాలో చికెన్ తింటున్న మంత్రులు కేటీఆర్, ఈటల, తలసాని, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ :** 'నేను ముఖ్యమంత్రిగారి ఇంట్లోనే ఉంటున్నా. మా ఇంట్లో పిల్లలతోసహా మేమంతా ప్రతిరోజు చికెన్, గుడ్లు తింటున్నాం. ముఖ్యమంత్రిగారింట్లో ఎవరూ అనారోగ్యంబారిన పడలేదు. మరి మీకెందుకు దిగులు? చికెన్ వల్ల కరోనా వ్యాధి వ్యాపిస్తుందన్నది శుద్ధ అబద్ధం' అని రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. చికెన్, కోడిగుడ్లపై జరుగుతున్న దుష్ప్రచారాలు, అపోహలను నమ్మొద్దని ప్రజలను కోరారు. ఇప్పటివరకు చికెన్, గుడ్ల వల్ల ఏ ఒక్కరికి ఆరోగ్య సమస్య తలెత్తలేదని, జరుగుతున్న ప్రచారమంతా అవాస్తవమేనని ఆయన కొట్టిపారేశారు. ఆలిండియా పౌల్ట్రీ డెవలప్‌మెంట్ అండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్, తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో చికెన్, ఎగ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ సహచర మంత్రులు ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వీ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి చికెన్, కోడిగుడ్లు ఆరగించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ చాలా చౌకగా, అత్యంత పోషకవిలువలతో దొరికే ఏకైక పౌష్టికాహారం చికెన్ మాత్రమేనని చెప్పారు. కరోనా వార్తలతో పౌల్ట్రీ రంగం సంక్షోభంలోకి వెళ్లిందని అంటూ, రైతులు ఒడిదుడుకులను తట్టుకోవాలిగాని, తల్లడిల్లొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. తెలంగాణలో పౌల్ట్రీరంగాన్ని అభివృద్ధి చేసేందుకు దేశంలోనే అద్భుతమైన పాలసీ తీసుకొస్తామని కేటీఆర్ చెప్పారు. ఇప్పటికే సబ్‌కమిటీ కసరత్తు చేస్తున్నదని తెలిపారు. తాము తీసుకొచ్చే పౌల్ట్రీపాలసీ దేశానికే మార్గదర్శకంగా ఉండగలదని ధీమా వ్యక్తంచేశారు.

### ఒక్క కేసూ నమోదుకాలేదు

తెలంగాణలో ఒక్క కరోనా కేసు కూడా నమోదుకాలేదని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జీవన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సురేందర్, పశుసంవర్ధకశాఖ సంచాలకులు లక్ష్మారెడ్డి, తెలంగాణ పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, సమాఖ్య ప్రతినిధులు రాంరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రాజు, మధుసూదన్‌రావు, రమేశ్, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సినీనటి రశ్మిక మందన, బిత్తిరి సత్తి, శివజ్యోతి సైతం హాజరై చికెన్‌ను ఆరగించి పాటలు పాడి సందడిచేశారు.



'వరల్డ్ రేర్ డిసీజెస్ డే' కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

## గ్రామాలకు సంచార ల్యాబ్‌లు

- కొత్తగా 42 వ్యాధి నిర్ధారణ కేంద్రాలు
- వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వైద్యరంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారనుందని, వ్యాధులు వచ్చాక చికిత్స చేయడంకంటే వ్యాధులే రాకుండా అడ్డుకట్టవేసే దిశగా నివారణ చర్యలను ముమ్మరం చేసిందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన 'వరల్డ్ రేర్ డిసీజెస్ డే' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్బన్ హెల్త్ సెంటర్లను,135 వ్యాధినిర్ధారణ కేంద్రాలను ఏర్పాటుచేశామని, వ్యాధులను ఆరంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కొత్తగా 42 ప్రాంతాల్లో వ్యాధినిర్ధారణ కేంద్రాలను ప్రారంభించనున్నామని, గ్రామాల్లో సంచార ల్యాబ్‌ల సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ప్రపంచంలో 40 కోట్లకుపైగా, దేశంలో 7 నుంచి 8 కోట్లమంది రేర్ డిసీజెస్ బాధితులున్నారని, పేదరికంతో సరైన అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కొత్త ఒరవడులకు రూపకల్పన చేయాలని ఇటీవల సీఎం కేసీఆర్ తెలిపారని, అనేక సంక్షేమ పథకాలతో తల్లులు, శిశువుల ఆరోగ్యాన్ని కాపాడుతున్నామన్నారు. నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ నీటి బాధితులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా రూ.40 వేల కోట్లతో మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటుచేసిన ఘనత తెలంగాణ సర్కార్‌దేనన్నారు. మందుల తయారీకి ఫార్మా కంపెనీలకు ఇన్సెంటివ్స్ ఇవ్వాలని, అరుదైన వ్యాధుల బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపచేయాలని ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ సంస్థ మంత్రికి విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో డాక్టర్లు విశాల, ముత్యాల రామయ్య, నిర్వాహకులు సనావుల్లా, చౌదరి, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

# అసెంబ్లీ సీట్ల పెంపుపై వివక్ష ఎందుకు?

- ఒకే దేశం - ఒకే చట్టం నినాదం ఏమైంది?
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని నిలదీసిన ప్రణాళికాసంఘం వైస్‌చైర్మన్ వినోద్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అసెంబ్లీ స్థానాల పెంపు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వంద్వవైఖరిని అవలంబిస్తున్నదని రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. తమకు అనుకూలంగాలేని రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతున్నదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్లు పెంచేదిలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటనపై వినోద్‌కుమార్ మండిపడ్డారు. కశ్మీర్‌కు ఏడు అసెంబ్లీ స్థానాలను పెంచిన కేంద్రం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో ఎందుకు పెంచడంలేదని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నిలదీశారు. ఒకే దేశం – ఒకే చట్టం అన్న నినాదం ఏమైందని ఆయన బీజేపీ నేతలను ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి అసెంబ్లీ సీట్లను పెంచుతామని అంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కశ్మీర్‌లో ఎందుకు పెంచారని నిలదీశారు. కశ్మీర్‌లో అసెంబ్లీ స్థానాలను 107 నుంచి 114కు పెంచారని తెలిపారు. తెలంగాణలో అసెంబ్లీ సీట్లను పెంచాలని ఆరేండ్లుగా కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి రాజకీయంగాఎటువంటి లాభం లేనందునే దాటవేత ధోరణిని అవలంబిస్తున్నారని విమర్శించారు.

అసెంబ్లీ స్థానాల పెంపు అంశాన్ని రాత్రికి రాత్రి ఏపీ విభజన చట్టంలో పొందుపర్చారన్న కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను వినోద్‌కుమార్ తప్పుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ మంత్రులు, బీజేపీ అగ్రనేతలు అద్వానీ, వెంకయ్యనాయుడు, సుష్మాస్వరాజ్, అరుణ్‌జైట్లీ వంటి నేతలు కొన్ని నెలలపాటు చర్చించి అసెంబ్లీ స్థానాల పెంపు అంశాన్ని ఏపీ విభజన చట్టంలో పొందుపర్చారని ఆయన గుర్తుచేశారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు బీజేపీ అగ్రనేతలను కించపర్చేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. అసెంబ్లీ సీట్ల పెంపు కోసం ఏపీ, తెలంగాణ ప్రజలు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారని వినోద్‌కుమార్ తెలిపారు.

## ఐఐటీహెచ్ పరిశోధనలకు జైకా సహకారం

**కంది:** జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) సహకారంతో రాబోయేరోజుల్లో మరిన్ని కొత్త పరిశోధనలు చేస్తామని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి వెల్లడించారు. శుక్రవారంనాడు జైకాతో ఐఐటీ హైద్రాబాద్ డైరెక్టర్ రెండోదశ ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా రాబోయేరోజుల్లో నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, సస్టైనబుల్ డెవలప్‌మెంట్, నానో టెక్నాలజీ అండ్ నానోసైన్స్, భవన నిర్మాణం, ఉన్నతస్థాయి పరిశోధనలకు అవసరమైన పరికరాల సేకరణ తదితర అంశాల్లో జైకా సంపూర్ణ సహకారం అందజేస్తుందని మూర్తి వివరించారు. మొదటి దశ ఒప్పందాలతో ఎన్నో మంచి ఫలితాలు వచ్చాయని, తమ విద్యార్థులు ఉన్నతలక్ష్యాల వైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు. ఐఐటీహెచ్ జపాన్‌తో స్థిరమైన, దీర్ఘకాలిక సహకారాన్ని కొనసాగిస్తుందని పేర్కొన్నారు.



సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ ప్రాజెక్టుపై అధికారులతో చర్చిస్తున్న నీటి పారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్. చిత్రంలో సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌దేశ్‌పాండే ఉన్నారు.

## వారంలో 'అన్నపూర్ణ'కు నీళ్లు

- జూన్ నాటికి అన్ని జలాశయాలను నింపాలి
- నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్

**చిన్నకోడూరు/బోయినపల్లి:** మార్చి మొదటివారంలో సిద్దిపేట జిల్లాలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీళ్లందించేలా ఏర్పాట్లుచేయాలని నీటి పారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. త్వరలో ఈ జిల్లాకు గోదావరి జలాలు వస్తున్నందున ప్రాజెక్టు పెండింగ్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల పనులు, సర్జ్‌పూల్ తదితర పనులను పరిశీలించారు. హెలికాప్టర్‌లో రంగనాయకసాగర్‌కు చేరుకున్న రజత్‌కుమార్‌కు కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఈ ఆనంద్, వేణు స్వాగతం పలికారు. రంగనాయకసాగర్ సర్జ్‌పూల్ పంపు, విద్యుత్ సబ్‌స్టేషన్లు తదితర వాటిని పరిశీలించారు. ఎస్ఈ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌దేశ్‌పాండే, ఈఎన్సీ హరిరామ్‌తో కలిసి ప్రాజెక్టుల పురోగతిపై రజత్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ వరకు చెరువుల్లో నీళ్లు నింపేలా పనులను చేపట్టాలన్నారు. వచ్చే జూన్ నాటికి ఆయా రిజర్వాయర్ల కింద ఆయకట్టుకు నీళ్లందించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు రజత్‌కుమార్ శ్రీధర్ దేశ్‌పాండేతో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ శ్రీ రాజరాజేశ్వర జలాశయాన్ని సందర్శించారు. ఎస్సారార్ జలాశయం నుంచి కొండపోచమ్మ వరకు పనులు పూర్తయినట్టు తెలిపారు.

# ప్రాణం తీసిన ఫేస్‌బుక్ పరిచయం

**యువకుడి వేధింపులకు వివాహిత ఆత్మహత్య**



రాగసుధ (ఫైల్)

**మహబూబ్‌నగర్ క్రైం:** ఫేస్‌బుక్ పరిచయం ఓ వివాహిత ప్రాణాలను బలిగొన్నది. ఫేస్‌బుక్‌లో పరిచయమైన యువకుడి వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో చోటుచేసుకున్నది. టుటౌన్ సీఐ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని వెంకటరమణ కాలనీకి చెందిన రాగసుధకు మహబూబ్‌నగర్ జిల్లా ప్రేమ్‌నగర్‌కు చెందిన బలగం ఉదయ్‌కుమార్‌తో 2011లో వివాహం జరిగింది. వీరికి ఐదేండ్ల కుమారుడు రోహిన్ ఉన్నాడు. ఉదయ్‌కుమార్ ఓ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. రాగసుధకు ఏడాది కింద ట ఫేస్‌బుక్ ద్వారా గద్వాల యువకుడు కార్తీక్ పరిచయం అయ్యాడు. కొన్ని రోజులకే కార్తీక్ తీరు నచ్చకపోవడంతో స్నేహం ఆపేసింది. తర్వాత రాగసుధకు కార్తీక్ ఫోన్‌చేసి బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరింపులకు దిగాడు. మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం కొడుకు స్కూల్‌కు వెళ్లిన తర్వాత తండ్రికి ఫోన్‌చేసి 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నా. నా కొడుకును బాగా చూసుకోండి. నేనే తప్పు చేయలేదు. నన్ను అందరూ క్షమించండి' అని సూసైడ్‌నోట్ రాసి ప్రేమ్‌నగర్‌లోని ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

### రూ.లక్ష వరకు వసూలు!

గద్వాలకు చెందిన కార్తీక్, అతని స్నేహితుడు రవితో కూడా రాగసుధకు పరిచయం ఏర్పడింది. రాగసుధను ఏడాదిగా కార్తీక్ బ్లాక్‌మెయిల్ చేస్తూ రూ.లక్ష వరకు వసూలుచేసినట్టు సమాచారం. బెదిరింపుల విషయాన్ని రాగసుధ.. రవికి చెప్పింది. దీంతో రెండ్రోజుల కిందట కార్తీక్‌ను రవి హత్యచేసి గద్వాల పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కేసును ఛేదించేక్రమంలో రాగసుధ విషయం బయటపడటంతో పోలీసులు గద్వాలలో ఉన్న ఆమె తల్లిదండ్రులను విచారించారు. శుక్రవారం విచారణ కోసం మహబూబ్‌నగర్‌కు రావడానికి సిద్ధమవుతుండగానే రాగసుధ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది.

## సాగర్ సమీపంలో పూలే విగ్రహం

**స్థలాన్ని పరిశీలించిన మంత్రులు, జీహెచ్ఎంసీ మేయర్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు హైదరాబాద్‌లో భారీ విగ్రహం ఏర్పాటుకు అనుకూల స్థలాన్ని రాష్ట్ర మంత్రులు పరిశీలించారు. బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు పరిధిలోని హుస్సేన్‌సాగర్‌కు సమీపంలోని ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్ సర్కిల్, నెక్లెస్‌రోడ్‌లోని స్థలాలను శుక్రవారం మంత్రులు గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ చూశారు. ప్రాథమికంగా 2వేల గజాల స్థలాన్ని ఎంపికచేసి అనుమతి కోసం పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్‌కు నివేదిస్తామని మంత్రులు తెలిపారు.

# ఆశ్రమ నిర్బంధం నుంచి తప్పించండి!

**ఢిల్లీ హైకోర్టులో నిజామాబాద్ దంపతుల పిటిషన్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిజామాబాద్ పట్టణానికి చెందిన దుంపల రాంరెడ్డి, వీణావతిరెడ్డి దంపతులు తమ కూతురును ఆధ్యాత్మిక కేంద్రం నిర్బంధం నుంచి విడిపించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన కూతురుతోపాటు 168 మంది అమ్మాయిలు ఢిల్లీ ఆశ్రమంలో ఉన్నారని, ఆశ్రమ వ్యవస్థాపకుడు వీరేంద్రదీక్షిత్‌పై అత్యాచారం సహా పలు కేసులు నమోదు అయ్యాయని, సీబీఐకి దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కూతురుపై మత్తుమందులు ప్రయోగించి ఉంటారని పిటిషన్‌లో తెలిపారు. కేసు విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు కేంద్రానికి, ఢిల్లీ ప్రభుత్వానికి, సీబీఐకి నోటీసులు జారీచేసింది. రెండువారాల్లో స్పందించాలని ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 13కు వాయిదా వేసింది.

## నా పుట్టినరోజున వేడుకలొద్దు

**హోంశాఖ మంత్రి మహమూద్ అలీ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తన పుట్టినరోజు సందర్భంగా మార్చి 2న ఎలాంటి వేడుకలు చేసుకోకూడదని నిర్ణయం తీసుకున్నట్టు హోంశాఖ మంత్రి మహమూద్ అలీ తెలిపారు. దేశవ్యాప్తంగా సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లపై జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. పుట్టినరోజు సందర్భంగా తనకు శుభాకాంక్షలు చెప్పేందుకు రావొద్దని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు.

### లోకం పోకడ




హారర్ సిన్మా కాదు, థ్రిల్లర్ మూవీ కాదు.. ఢిల్లీ దృశ్యాలు చూస్తున్నాడు!

# పవర్‌ఫుల్ డిమాండ్

మొదటిపేజీ తరువాయి...

నమోదయింది. శుక్రవారం తెలంగాణలో అంతకుమించి డిమాండ్‌తో ఆ రికార్డును తిరగరాసింది. శుక్రవారం ఉదయం 7.52 గంటలకు 13,168 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదయింది. గత ఏడాది ఇదే రోజున గరిష్ఠ డిమాండ్ 9,770 మెగావాట్లుగా రికార్డవగా.. ఈ ఏడాది 34 శాతం అధిక డిమాండ్ ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 5,661 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైంది. నాటితో పోలిస్తే ప్రస్తుతం వచ్చిన డిమాండ్ 132.6 శాతం అధికం.

### దేశ సగటును మించి వినియోగం

రాష్ట్రంలో 2014లో 47,338 మిలియన్ యూనిట్ల విద్యుత్‌వినియోగం జరగగా.. 2018–19లో 68,147 మిలియన్ యూనిట్లకు చేరింది. ఆరేండ్లలోనే 44 శాతం అధిక విద్యుత్ వినియోగమయింది. ఇదే సమయంలో దేశ సగటు 23 శాతంగా మాత్రమే నమోదైంది. విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే రెండోస్థానంలో ఉండగా.. తమిళనాడు మొదటి, కర్ణాటక మూడోస్థానంలో ఉన్నాయి.



### పెరిగిన తలసరి విద్యుత్ వినియోగం

ప్రగతి సూచికలుగా గుర్తించే అంశాల్లో తలసరి విద్యుత్ వినియోగం ఒకటి. దేశవ్యాప్తంగా సగటు తలసరి విద్యుత్ వినియోగం 1,181 యూనిట్లు కాగా, తెలంగాణలో ప్రస్తుతం 1,896 యూనిట్లు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో తలసరి విద్యుత్ వినియోగం 1,356 యూనిట్లు ఉండగా, ఆరేండ్లలో 39.82 శాతం పెరిగింది.

### డిమాండ్ పెరగడానికి కారణాలు

- తెలంగాణ వచ్చిన తొమ్మిది నెలల్లోనే సాగుకు 9 గంటల విద్యుత్ అందించారు. 2018 జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంపుసెట్లకు 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతున్నది. 2014 జూన్ 2కు ముందు సాగుకు రెండువేల మెగావాట్లకు మించి డిమాండ్ ఉండేది కాదు. ఎత్తిపోతలతో కలుపుకొని 6 వేల మెగావాట్ల వరకు డిమాండ్ ఏర్పడింది.
- రాష్ట్రం ఏర్పడేనాటికి 19,02,754 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉంటే, నేడు రాష్ట్రంలో 24,31,056 కనెక్షన్లున్నాయి. 2014లో ఎత్తిపోతల పథకాలకు కేవలం 680 మెగావాట్ల డిమాండ్ ఉండగా.. భారీ నీటిపారుదల ప్రాజెక్టుల ఫలితంగా పంపుహౌస్‌ల నిర్వహణకు ప్రస్తుతం 2,200 మెగావాట్ల వరకు విద్యుత్ అవసరమవుతున్నది.
- టీఎస్ ఐపాస్‌తో కొత్త పరిశ్రమలు వస్తున్నాయి. తెలంగాణ ఏర్పాటుకు ముందు పరిశ్రమలకు పవర్ హాలిడేలు ప్రకటిస్తే.. నేడు తెలంగాణలో పరిశ్రమలకు 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా జరుగుతున్నది.
- రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామికరంగాలతోపాటు పట్టణీకరణ శరవేగంగా జరుగుతుండటం వల్ల వ్యాపార, వాణిజ్య కనెక్షన్లు పెరిగాయి. కొత్త విద్యుత్ కనెక్షన్ల వృద్ధిరేటు అధికంగా ఉన్నది. రాష్ట్రం ఏర్పడేనాటికి విద్యుత్ కనెక్షన్లు 1,11,19,990 ఉండగా.. నేడు రాష్ట్రంలో 1,54,14,451 కనెక్షన్లు ఉన్నాయి. అంటే దాదాపు 43 లక్షలు పెరిగాయి. తెలంగాణ వచ్చినప్పటితో పోలిస్తే ఇది 38.61 శాతం అధికం.

### కేసీఆర్ మార్గదర్శకం, సిబ్బంది కృషే కారణం



తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తీవ్ర సంక్షోభంలో ఉన్న పరిస్థితి నుంచి ఇంత గొప్పగా తయారుకావడం వెనుక సీఎం కేసీఆర్ మార్గదర్శనం, పర్యవేక్షణ, విద్యుత్ సంస్థల ఉద్యోగుల అవిరళ కృషి ఉన్నది. ఉమ్మడి ఏపీలో నమోదైన డిమాండ్‌కు మించి తెలంగాణలో డిమాండ్ ఏర్పడటం, దానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయగలగడం సంతోషాన్ని, సంతృప్తిని కలిగిస్తున్నది. ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు, ఉద్యోగులకు అందిస్తున్న ప్రోత్సాహం, ఆర్థిక సహకారంతోనే ఈ మార్పు సాధ్యమయింది. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని పూర్తిచేసి, తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చాలనే ముఖ్యమంత్రి కలను నిజం చేసేందుకు ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది, కార్మికులంతా బృందంగా పనిచేస్తున్నాం.

**- దేవులపల్లి ప్రభాకర్‌రావు, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ**

## ఇంటర్ పరీక్ష కేంద్రాలు గుర్తించే యాప్ విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మార్చి 4 నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాలను గుర్తించే లోకేటర్ యాప్‌ను విడుదలచేసినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఇప్పటికే దాదాపు 3,712 మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని ఒక ప్రకటనలో చెప్పారు.

## బంగారం పట్టివేత

**శంషాబాద్:** శంషాబాద్ విమానాశ్రయంలో శుక్రవారం దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు లోదుస్తుల్లో దాచితెచ్చిన రూ.35 లక్షలు విలువచేసే 826.68 గ్రాముల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.



యాదాద్రిలో మత్స్యావతార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు

## మత్స్యావతారంలో యాదాద్రీశుడు

**యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడోరోజైన శుక్రవారంనాడు శ్రీవారిని పెండ్లికొడుకుగా, అమ్మవారిని పెండ్లికూతురుగా అలంకరించారు. పెండ్లికళతో ధగధగ మెరిసిపోతుండగా దేవర్లు బాలాలయంలో భక్తులకు కనులవిందుగా దర్శనమిచ్చారు. శ్రీమన్నారాయణుని తొలి అవతారమైన మత్స్యావతారంలో అమ్మవారితో కలిసి ఆశ్రిత రక్షణ చేసిన తీరును కన్నులకు కట్టినట్టు అర్చకులు ఆవిష్కరించారు. స్వామివారిని శుక్రవారం రాత్రి శేషవాహనంపై తిరువీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో ఎంవీ భూపాల్‌రెడ్డి, ఈవో ఎన్ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ మాదాపూర్ హైటెక్స్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్‌రావు, అమూల్యల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఎంపీలు కే కేశవరావు, సంతోష్ కుమార్, మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, ఈటలరాజేందర్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్, కూడా ఉన్నారు.



## ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వెయిటింగ్‌లో ఐఏఎస్‌లకు పోస్టింగులిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పశుసంవర్ధక, పాడి, మత్స్యశాఖల కార్యదర్శిగా అనితారాజేంద్ర, రోడ్లు, భవనాలు, రవాణాశాఖ ప్రత్యేక కార్యదర్శిగా బీ విజయేంద్ర, రవాణాశాఖ కార్యదర్శిగా ఎంఆర్‌ఎం రావు, అడవులు, శాస్త్ర, సాంకేతిక విభాగాల జాయింట్ సెక్రటరీగా ప్రశాంతిని నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం రవాణాశాఖ కార్యదర్శిగా ఉన్న సునీల్‌శర్మను రిలీవ్‌చేశారు. ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి డీ రొనాల్డ్‌రాస్‌కు గనులు, భూగర్భ వనరుల శాఖ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఈ పోస్టులో ఉన్న జయేశ్‌రంజన్‌ను రిలీవ్‌చేశారు.

## రేపు బాబ్లీ గేట్లు ఎత్తివేత

**మెండోరా:** సుప్రీంకోర్టు ఆదేశానుసారం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీకి ఆదివారం నీటిని విడుదల చేయనున్నారు. దీనికోసం ఎస్సారెస్పీ ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అధికారుల బృందం బాబ్లీ ప్రాజెక్టుకు వెళ్లనున్నది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రతి ఏడాది మార్చి1న బాబ్లీ గేట్లను తెరిచి దిగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజుక్టుకు 0.6 టీఎంసీల నీటిని విడుదలచేయాలి.

## బ్రాహ్మణ పథకాల దరఖాస్తులకు 20 వరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని బ్రాహ్మణులకు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పరిపాలనాధికారి యూ రఘురాంశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివేకానంద విదేశీ విద్యా పథకం, బ్రాహ్మణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థికసహాయ పథకం (బెస్ట్), రామానుజ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు అర్హులైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ గడువును మార్చి 20 వరకు పొడిగించినట్టు తెలిపారు.

# అన్ని సమీకరణాలతోనే ఎంపిక

- డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లుగా పార్టీ అభ్యర్థులను గెలిపించాలి
- పదవులు దక్కని వారికి భవిష్యత్‌లో అవకాశాలు
- పార్టీ ముఖ్యులతో కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పార్టీలో అంతర్గత సమీకరణలు, సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకొని డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ అభ్యర్థులను ఎంపిక చేశామని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నికలకు సంబంధించి పార్టీ ఎన్నికల పరిశీలకులతో ఆయన సమావేశమయ్యారు. శనివారం జరుగనున్న డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నికల పర్యవేక్షణకు టీఆర్‌ఎస్ పరిశీలకులను నియమించింది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించిన డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ అభ్యర్థుల పేర్లతో ఉన్న సీల్డ్ కవర్లను కేటీఆర్ వారికి అందజేశారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే విధంగా కృషిచేయాలని ఆయన వారికి సూచించారు. ఎన్నిక రోజు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి 9 జిల్లాలకు పరిశీలకులుగా వ్యవహరిస్తున్న నేతలు శుక్రవారం రాత్రే జిల్లా కేంద్రాలకు చేరుకుని అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలని తెలిపారు.



తెలంగాణ భవన్‌లో శుక్రవారం పార్టీ ముఖ్యులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్

ఇందుకోసం జిల్లా మంత్రి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. ఇప్పటికే డైరెక్టర్ పోస్టులను టీఆర్‌ఎస్ గెలుచుకుందని, చైర్మన్, వైస్‌చైర్మన్ పోస్టులన్నింటినీ కైవసం చేసుకుంటుందని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. ఇప్పటికే డైరెక్టర్లుగా ఎన్నికైనవారందరికి శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లుగా ఎన్నిక కావడం కూడా మంచి గౌరవం అని, చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు దక్కనివారికి పార్టీపరంగా భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

### డీసీసీబీ, డీసీఎంఎస్ ఎన్నికల పరిశీలకులు

ఆదిలాబాద్ - కోలేటి దామోదర్‌గుప్తా, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, కరీంనగర్ - నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్సీ, వరంగల్ - గ్యాదరి బాలమల్లు, టీఎస్‌ఐఐసీ చైర్మన్, ఖమ్మం - నూకల నరేశ్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, నల్గొండ - శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ, మహబూబ్‌నగర్ - బండ ప్రకాశ్, రాజ్యసభ సభ్యుడు, రంగారెడ్డి- ఎమ్మెస్ ప్రభాకర్, ప్రభుత్వవిప్, మెదక్ - బడుగుల లింగయ్య యాదవ్, రాజ్యసభ సభ్యుడు, నిజామాబాద్ - మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్



తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన విక్రంకైలాస్ రూ.40 లక్షలు విరాళం అందించారు. ఈ విరాళం డీడీని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి శుక్రవారం ఆయన తిరుమలలో స్వయంగా అందజేశారు.


SI & కానిస్టేబుల్స్ AP & TS
అతి త్వరలో భారీ నోటిఫికేషన్స్ విడుదల
New Batches : March 1st
toppers INSTITUTE
Medipally, Uppal, Hyd
9848458639

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


# వాననీటి సంరక్షణ బాధ్యత మనదే

- శివారు మున్సిపాలిటీల సీవరేజీ బాధ్యత జలమండలిదే
- అధికారులతో సమీక్షలో మంత్రి కేటీఆర్
- వాటర్ హార్వెస్టింగ్ పార్కు సందర్శన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రతి నీటిబొట్టు అమూల్యమైనదని, భవిష్యత్‌తరాలను దృష్టిలోఉంచుకొని నీటిని ఒడిసిపట్టుకోవాలని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జలమండలి నిర్మించిన రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ థీమ్‌పార్కును మంత్రి కేటీఆర్ శుక్రవారం సందర్శించారు. అనంతరం అక్కడే జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడుగుంతలు, నీటిసంరక్షణ చర్యలు చేపడితే వచ్చే వర్షాకాలంలో సత్ఫలితాలు ఉంటాయని చెప్పారు. నగరవాసులకు నీటిసంరక్షణపై అవగాహన కల్పించేందుకు జలమండలి నిర్మించిన థీమ్‌పార్కు అద్భుతమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్వచ్ఛమైన నీటిని వృథాచేయడంవల్ల ఇటు ప్రభుత్వానికి నష్టంతోపాటు రానున్న రోజుల్లో ఇక్కట్లు ఎదురవుతాయని తెలిపారు. మంచినీటి వృథాను అరికట్టడానికి జలమండలి రూపొందించిన వాక్ కార్యక్రమం అద్భుతంగా ఉందన్నారు. ఔటర్ రింగ్‌రోడ్ లోపలి వైపున్న 193 గ్రామాల్లో కూడా మంచినీటిని సరఫరా చేసే బాధ్యత జలమండలిదేనని కేటీఆర్ చెప్పారు. అలాగే శివారు మున్సిపాలిటీల సీవరేజి బాధ్యతను కూడా ఆదివారం నుంచి జలమండలి చేపడుతుందని తెలిపారు.



థీమ్‌పార్కులో ఏర్పాటుచేసిన నమూనాను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

# మేలో దోస్త్ షెడ్యూల్

- మూడువిడుతల్లో అడ్మిషన్ల కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిగ్రీ ఆన్‌లైన్ సిస్టం ఆఫ్ తెలంగాణ (దోస్త్)-2020 అడ్మిషన్లకు మే నెలలో షెడ్యూల్ విడుదలచేస్తామని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. అడ్మిషన్ల కౌన్సెలింగ్ మూడు విడుతలుగా చేపడుతామని చెప్పారు. రాష్ట్ర కళాశాలల విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్ ఆధ్వర్యంలో శుక్రవారం దోస్త్ అడ్మిషన్ల కమిటీ సమావేశమైంది. దోస్త్ రిజిస్ట్రేషన్ల కోసం బయోమెట్రిక్‌తోపాటు కొత్తగా ఐరిస్ విధానంలో కూడా అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో బయోమెట్రిక్, ఐరిస్ విధానం అందుబాటులోకి తెచ్చి.. వీటిని ఆధార్‌కు అనుసంధానం చేస్తారని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ల సమయంలో తలెత్తనున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించొచ్చని తెలిపారు. అడ్మిషన్ల సమాచారాన్ని ఎస్ఎమ్మెస్‌తోపాటు ఈమెయిల్, వాట్సప్ ద్వారా విద్యార్థులకు అందించనున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 60 సహాయకేంద్రాలు కొనసాగుతాయని, మొబైల్‌యాప్, ఆన్‌లైన్ ద్వారా కూడా దోస్త్‌కు రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.


TSPSC
TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad
HALF YEARLY EXAMINATIONS::
MARCH-2020 TERM
NOTIFICATION NO.02/2020
Applications are invited from Officers of the All India Services and State Services working in Telangana State for Half Yearly Examinations, Language Tests and other Tests scheduled to be held from **27/03/2020** to **30/03/2020**. The application and other details can be downloaded from the Commission's **website:www.tspsc.gov.in** and the filled in applications should reach the Commission's office on or before **16/03/2020**
Place: **Hyderabad,**
Date: **28/02/2020**
Sd/-
**SECRETARY**
DIPR R.O. No.728-pp/CL/Advt/1/2019-20




శుక్రవారం హైదరాబాద్‌లో టైలర్స్‌డే వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఈటల, ఎమ్మెల్యే వెంకటేశ్

## పేదలను ఆదుకోవడమే సీఎం కేసీఆర్ లక్ష్యం

- టైలర్స్ డే సదస్సులో మంత్రి ఈటల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కులాలకు అతీతంగా పేదలందరినీ ఆదుకోవడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం మేర కులవృత్తి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టైలర్స్ డే సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. వెనకబడిన వర్గాలకు హైదరాబాద్‌లో ఆత్మగౌరవ భవనాలను మంజూరు చేశామని చెప్పారు. మేర కులవృత్తి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ సతీశ్, మేర కులవృత్తి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓడపల్లి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానపంటలకు బ్రిటన్ సహకారం

శిక్షణాకేంద్రాన్ని సందర్శించిన బ్రిటన్ హైకమిషనర్ బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉద్యానపంటల్లో కోత తర్వాత పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై బ్రిటన్ ప్రభుత్వం సహకారం అందించనున్నది. శుక్రవారం హైదరాబాద్‌లోని ఉద్యాన శిక్షణాకేంద్రాన్ని బ్రిటిష్ హై కమిషనర్ జేస్ దీప్‌జైస్వాల్ నేతృత్వంలోని తొమ్మిదిమంది ఉద్యానరంగ నిపుణుల బృందం సందర్శించింది. ఉద్యాన, పట్టుపరిశ్రమ అభివృద్ధిశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రాంరెడ్డితో బృందం సమావేశమై పలు అంశాలపై చర్చించింది. ఇండియా- బ్రిటన్ ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై ఆరాతీసింది. రాష్ట్రంలో సాగవుతున్న ఉద్యానపంటల ఉత్పత్తి, విస్తరణ, ఉత్పాదకత తదితర అంశాలను వెంకట్రాంరెడ్డి.. బ్రిటన్ ప్రతినిధులకు వివరించారు. కోల్డ్‌చైన్ అభివృద్ధి, పంటల ఎగుమతికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ మార్కెటింగ్‌కు అవసరమైన నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలపై బ్రిటన్ ప్రతినిధులు పలు సూచనలు చేశారు.

## నీరాపాలసీపై నివేదికసమర్పణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నీరా పాలసీ అమలుకు ఎక్సైజ్‌శాఖ కసరత్తు ముమ్మరం చేసింది. క్షేత్రస్థాయిలో నీరా, అనుబంధ ఉత్పత్తుల తయారీ అంశాలపై గీత వృత్తిదారుల ప్రతినిధులు, ఎక్సైజ్‌శాఖ అధికారుల బృందం రాజమండ్రి సమీప పందిరి మామిడిలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీలో కల్లు, అనుబంధ ఉత్పత్తుల పరిశోధన కేంద్రంలో అధ్యయనంచేసి నివేదికను సమర్పించింది. నీరా ఉత్పత్తి, నిల్వ, అనుబంధ ఉత్పత్తుల తయారీలో సాంకేతిక సహకారానికి కేరళలోని సీపీసీఆర్ఐ (సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)తో వచ్చేవారం ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు తెలిసింది. నీరాను చెట్టునుంచి తీసిన వెంటనే తగిన ఉష్ణోగ్రతల మధ్య నిల్వ చేయడం, బాట్లింగ్, నీరాకేఫ్‌లో విక్రయించే వరకు అనేక దశల్లో తీసుకోవాల్సిన చర్యలపై సీపీసీఆర్ఐ సాంకేతిక సహకారం, శిక్షణ ఇవ్వనుంది.

## రాష్ట్రంలో తుఫాన్ వ్యతిరేక గాలులు

- రేపు తేలికపాటి వానలు కురిసే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రం మీదుగా తుఫాన్ వ్యతిరేక గాలులు వీస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం ఆగ్నేయ, తూర్పు దిశల నుంచి ఈ గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరో 24గంటలు గాలులు కొనసాగుతాయని, వాటి ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో తేలికపాటి వానలు కురిసే అవకాశముందని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం పొడి వాతావరణం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. సోమవారం వాతావరణం మరింత చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని చెప్పారు.






## ఆరోగ్యంగా ఉన్నా క్యాన్సర్ స్క్రీనింగ్

# ఎందుకు అవసరమంటే?

**క్యాన్సర్‌ను ఎంత త్వరగా గుర్తిస్తే వ్యాధిని నయం చేయడం అంత సులువు. క్యాన్సర్‌ను గుర్తించడానికి ముందస్తుగా కనిపించే లక్షణాలు, స్క్రీనింగ్ పరీక్షలు ఉపయోగపడుతాయి. లక్షణాలు బయటపడకముందే స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తే వ్యాధిని తొలిదశలోనే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం సాధ్యమవుతుంది. ఒక్కోసారి హెల్దీగా ఉన్నవారికి కూడా క్యాన్సర్ స్క్రీనింగ్ అవసరం. ఎందుకంటే కొందరిలో వ్యాధి లక్షణాలు బయటపడకపోయినా లోపల క్యాన్సర్ ఉండొచ్చు. అందుకే అందరికీ స్క్రీనింగ్ పరీక్షలు అవసరం.**

సలహా




గడ్డలు, అసాధారణ రక్తస్రావం, చాలాకాలం పాటు అన్నం సరిగ్గా జీర్ణం కాకపోవడం వంటి అంశాలు క్యాన్సర్ ముందస్తు లక్షణాల్లో కొన్ని. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారం, నోరు, పెద్దపేగు, చర్మ క్యాన్సర్ల వంటి వాటిల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి.

### స్క్రీనింగ్

అన్ని విధాలా ఆరోగ్యంగా కనిపించే వ్యక్తుల్లో కూడా దాగి ఉన్న క్యాన్సర్‌ను గుర్తించడానికి చేసే సాధారణమైన, సులభమైన పరీక్షనే స్క్రీనింగ్ అంటారు. ముందు జాగ్రత్తతో ఈ పరీక్షలను చేయించుకోవడం వల్ల ఎంతో లాభమే తప్ప నష్టం ఉండదు.

### క్యాన్సర్ వచ్చే అవకాశం ఎవరికి?

పొగతాగే అలవాటున్నవాళ్లు, గుట్కా, పాన్‌మసాలా, జర్దా మొదలైనవి నమిలే అలవాటున్నవాళ్లు, మద్యానికి బానిసలైనవాళ్లు, సిర్రోసిస్ లాంటి కాలేయ వ్యాధులున్నవాళ్లు, వ్యాయామం చేయనివాళ్లు, ఊబకాయం ఉన్నవాళ్లు, ఆహారంలో కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకునే వాళ్లు, పీచు పదార్థాలు తక్కువగా తీసుకునేవాళ్లు, ఆహారంలో మసాలాలు ఎక్కువ తినేవాళ్లు.



### మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు

**రొమ్ము క్యాన్సర్ :** నలభై ఏళ్లు నిండిన మహిళలు ప్రతి ఏడాది డిజిటల్ మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవడం మంచిది.

20 నుంచి 30 ఏళ్లు నిండిన స్త్రీలు ప్రతి మూడేళ్లకు ఒకసారి వైద్యులను కలిసి రొమ్ము పరీక్షలు చేయించుకోవాలి.

20 ఏళ్లు నిండిన ప్రతి మహిళా క్రమం తప్పకుండా ఇంటివద్దనే స్వయంగా రొమ్ము పరీక్ష చేసుకుంటూ ఉండాలి. రొమ్ముల్లో కణుతులు, గడ్డలు ఏమైనా ఉన్నాయేమోనని ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి.

**గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ :** లైంగికంగా కలవడం మొదలుపెట్టిన మూడేళ్ల తర్వాత నుంచి ప్రతి మహిళా గర్భాశయ ముఖ ద్వారానికి స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి. సాధారణ పీఏపీ పరీక్ష పద్ధతిలో ఏడాదికోసారి, అత్యాధునిక లిక్విడ్ బేస్డ్ పీఏపీ పద్ధతిలో అయితే రెండేళ్లకోసారి పరీక్ష చేయించుకోవాలి. 30 ఏళ్లు పైబడిన ప్రతి మహిళా ప్రతి మూడేళ్లకోసారి పీఏపీతో పాటు హెచ్‌పీవీ డీఎన్ఏ పరీక్ష చేయించుకుంటే మంచిది. కానీ హెచ్‌ఐవి ఉన్నవారు, అవయవ మార్పిడి చేయించుకున్నవారు, కీమోథెరపీ తీసుకునేవారు, మత్తుపదార్థాలకు బానిసలైనవారు.. ఈ కారణాలతో తగినంత రోగనిరోధక శక్తి కోల్పోయినవారంతా ప్రతి ఏడాది పైన చెప్పిన పరీక్ష చేయించుకోవాలి. పదేళ్లు నిండిన ఆడపిల్లలకు 46 ఏళ్ల లోపు మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇప్పించడం వల్ల 90 శాతం వరకు సర్వైకల్ క్యాన్సర్‌ని నివారించవచ్చు.

### వీళ్లకు పరీక్షలు అవసరం లేదు..

70 ఏళ్లు.. ఆ పైబడిన మహిళలతో పాటు గత పదేళ్లుగా పీఏపీ పరీక్షల్లో నార్మల్ ఫలితాలు వచ్చినవారు స్క్రీనింగ్ పరీక్షలు ఆపేయవచ్చు.

హిస్టరెక్టమీ ద్వారా గర్భాశయంతో పాటు గర్భాశయ ముఖద్వారాన్ని కూడా తొలగించినవారిలో స్క్రీనింగ్ టెస్టులు చేయించాల్సిన అవసరం లేదు. అయితే కేవలం గర్భాశయాన్ని మాత్రమే తొలగించి, ముఖద్వారాన్ని తొలగించని సందర్భాల్లో మాత్రం స్క్రీనింగ్ పరీక్షలను కొనసాగించాలి.

### ప్రోస్టేట్ క్యాన్సర్

పురుషుల్లో వచ్చే క్యాన్సర్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటి. పురుషులకు తప్పకుండా ప్రోస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని అనేక అంతర్జాతీయ సంస్థలు సూచిస్తున్నాయి. 50 ఏళ్లు నిండిన పురుషులు ప్రతి ఏడాదీ ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ (పీఎస్ఏ) రక్తపరీక్ష, డిజిటల్ రెక్టల్ పరీక్ష చేయించుకోవాలి. కుటుంబంలో ఎవరికైనా (నాన్న, సోదరుడు, కొడుకు) ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్టయితే కుటుంబంలోని మిగతా పురుషులు 40 ఏళ్ల వయసు నుంచే ప్రోస్టేట్ స్క్రీనింగ్ చేయించుకుంటూ ఉండాలి.


**డాక్టర్ మోహనవంశీ**
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్,
ఒమేగా హాస్పిటల్స్
హైదరాబాద్: 9848011421
కర్నూల్: 08518-273001
గుంటూర్: 0863-2223300




సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికిబొల్లారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వ్యూ





ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నూతన గృహ ప్రవేశం చేస్తున్న ఓ కుటుంబం

# కొత్త కాలనీయే మంచిగున్నది

**మురిసిపోయిన కొండపోచమ్మ ముంపు బాధితులు • సల్లంగ సూడాలంటూ గ్రామ దేవతలకు బోనాలు**

**ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో 351 కుటుంబాల సామూహిక గృహప్రవేశాలు • రెండు రోజుల్లో మిగతావారు**

**సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

'మమ్మల్ని సల్లంగ దీవించు తల్లీ..' అంటూ కొండపోచమ్మ సాగర్ ముంపు బాధితులు గురువారం గ్రామ దేవతలకు బోనాలు, మొక్కులు అప్పజెప్పారు. సుట్టాలు.. దోస్తులను పిలిచి ఆప్యాయతలను పంచుకొని.. ఊరంతా పండుగ చేసుకొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం మామిడ్యాల, తానేదారుపల్లి, తండాలకు చెందిన 351 కుటుంబాలు సామాన్లు సర్దుకొని, పిల్లాపాపలతో కలిసి తమ గ్రామాలను స్వచ్ఛందంగా ఖాళీచేశాయి. ములుగు మండలం తున్కిబొల్లారంలో ప్రభుత్వం నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్‌కాలనీకి తరలివెళ్లి సామూహిక గృహప్రవేశాలు చేశాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, గజ్వేల్ ఆర్డీవో విజయేందర్ రెడ్డి హాజరయ్యారు. ఒకప్పుడు ముంపు గ్రామాలను పోలీసుల పహారా మధ్య ఖాళీచేయించేవారు. కానీ నేడు ముఖ్యమంత్రి కేసీఆర్.. ముంపు గ్రామాల ప్రజలకు మెరుగైన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతోపాటు ఊరుకు ఊరు, బడికి బడి ఇలా గ్రామాలను పునర్నిర్మించి ఇవ్వడంతో బాధితులు సంతోషంగా తమ ఊళ్లను వదిలి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు చేరుకొంటున్నారు. ఈ కాలనీలో ఇప్పటివరకు 510 కుటుంబాలు వచ్చిచేరాయి. గ్రామాలు మునుగుతున్నప్పటికీ తమ త్యాగం వల్ల లక్షల ఎకరాలకు సాగునీరందుతుందన్న సంతృప్తి ఉన్నదని పలువురు పేర్కొన్నారు.

**సామూహిక గృహప్రవేశాలు**

ముంపు గ్రామాలైన మామిడ్యాల, తానేదారుపల్లి, తానేదారుపల్లితండాల ప్రజలు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని 351 ఇండ్లలో సామూహిక గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అధికారులు ఏర్పాటుచేసిన 64 మంది వేద పండితులు పూజలుచేశారు. బంధువులను పిలుచుకొని కొత్త ఇంట్లో ఆడ పడుచులకు కట్నకానుకలు పెట్టారు. తమ తమ గ్రామాల్లో ముందురోజు ఊరంతా పండుగ చేసుకొన్నారు. గ్రామ దేవతలకు బోనాలు, మొక్కులు సమర్పించుకొని తమను సల్లంగ చూడాలని కోరుకొన్నారు.

**ముంపువాసులకు మెరుగైన ప్యాకేజీ**

ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం మెరుగైన ప్యాకేజీని అందించింది. ప్రతి కుటుంబానికి రూ.7.50 లక్షలు, 250 గజాల ప్లాటు, ఒక డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇచ్చింది. కుటుంబంలో 18 ఏండ్లు నిండిన యువతీయువకులకు ఒక ప్లాటు, రూ.5 లక్షల ప్యాకేజీని అందించింది.

**180 ఎకరాల్లో ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ**

ములుగు మండలం తున్కిబొల్లారంలో 180 ఎకరాల విస్తీర్ణంలో ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ నిర్మించారు. అన్ని హంగులతో చేపట్టిన ఈ కాలనీలో ప్రస్తుతం 1,135 ఇండ్ల నిర్మాణాలు చేపట్టగా, ఇప్పటివరకు 900 ఇండ్ల నిర్మాణం పూర్తయింది. మిగతా ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రత్యేకంగా డ్రైన్స్, సీసీ రోడ్లు, ఇంటింటికీ తాగునీరు, బడి, షాపింగ్ కాంప్లెక్స్, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటుచేశారు. గుడి నిర్మాణంలో ఉన్నది. అన్ని వసతులతో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్‌కాలనీకి ముంపు గ్రామాలైన తానేదారుపల్లి, తండా, మామిడ్యాల ప్రజలు తమ ఊర్లను ఖాళీచేసి రాగా, బైలాంపూర్‌వాసులు కూడా రెండుమూడు రోజుల్లో కాలనీకి చేరుకోనున్నారు.

## అధికారులతో సహపంక్తి భోజనం

**గతంలో** ముంపు గ్రామాల తరలింపు అంటే ఘర్షణ వాతావరణం, వాగ్వాదాలు చోటుచేసుకొనేవి. పోలీసుల ప్రమేయంతో బలవంతంగా ఖాళీ చేసిన సందర్భాలూ ఉన్నాయి. కానీ నేడు కొండపోచమ్మ నిర్వాసితులు కోపతాపాలకు తావులేకుండా, అధికారులతో మమేకమై స్వచ్ఛందంగా గ్రామాలను విడిచి ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో గృహప్రవేశాలకు రావడం చరిత్రలోనే అరుదైన ఘట్టం. అంతేకాకుండా ఎలాంటి అరమరికలు లేకుండా అధికారులతో కలిసి సహపంక్తి భోజనంచేశారు. సర్కారు తమకు సమకూర్చిన సకల సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. రెండుమూడురోజుల్లో అన్ని గ్రామాలు పూర్తిస్థాయిలో ఖాళీ కానున్నాయి. అనంతరం ముంపు బాధితులు వారివారి పాత ఇండ్లను కూలగొట్టి అవసరమైన సామగ్రిని తెచ్చుకోనున్నారు.



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గృహప్రవేశం సందర్భంగా కడపకు బొట్లు పెడుతున్న దృశ్యం.

## దేశంలోనే రికార్డు



**సాధారణంగా** ప్రాజెక్టుల భూసేకరణ, నిర్మాణాలకు ఇరవై ఏండ్లు పడుతుంది. అలాంటిది కేవలం మూడేండ్లలోనే కొండపోచమ్మ సాగర్ భూసేకరణ, ప్రాజెక్టు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్మాణాలు పూర్తి చేయడం.. దేశంలోనే రికార్డు. జిల్లాలో ప్రాజెక్టులకు భూసేకరణ మొదలుకొని నిర్మాణాలు పూర్తిచేసేవరకు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. నిర్వాసిత కుటుంబాలకు ఎక్కడా లేనివిధంగా మెరుగైన ప్యాకేజీ ఇవ్వడంతో భూసేకరణ, ప్రాజెక్టుల నిర్మాణం అధికార యంత్రాంగానికి సులభమైంది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు గేటెడ్ కమ్యూనిటీలను తలపిస్తున్నాయి. నిర్వాసితులు గౌరవంగా జీవించాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యం. అత్యున్నత వసతులు ఏర్పాటు చేయడంతో నిర్వాసితులు ఆనందంతో వచ్చి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సామూహిక గృహప్రవేశాలు చేసుకొన్నారు. దేశ చరిత్రలోనే ఒక చిన్న సమస్య తలెత్తకుండా పండుగ వాతావరణంలో ముంపు గ్రామాల ప్రజలు సామూహిక గృహ ప్రవేశాలు చేసుకోవడం ఇదే ప్రథమం. నాలుగైదు రోజుల్లో మిగతా అన్ని కుటుంబాలు కూడా వస్తాయి. ఒక్కో ప్లాట్ 250 చదరపు గజాల విస్తీర్ణంలో 1,800 ప్లాట్లు చేశాం. ముంపు గ్రామాల్లో 1,250 కుటుంబాలు అర్హులు. వీరిలో 1,135 కుటుంబాలు ఇండ్లు అడిగాయి. మిగతా వారికి డబ్బులు ఇచ్చాం.

– వెంకట్రామ్‌రెడ్డి, సిద్దిపేట కలెక్టర్

### చాలా సంతోషంగా ఉన్నది



**ఇదివరకు** మేము ఉన్న ఊరు, ఇల్లు కంటే ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు, కొత్త కాలనీ చాలా మంచిగున్నది. కలెక్టర్, అధికారులు వచ్చి ప్రాజెక్టుల వల్ల కలిగే లాభాలను చెప్పిండ్రు. అందుకు మేము భూములిచ్చేందుకు ముందుకు వచ్చినం. ఊర్లు పోతయని తెలిసినప్పుడు కొంత భయపడ్డం. ప్రభుత్వం మాకు అండగా నిలువడంతో చాలా సంతోషంగా ఉన్నం.

– నాగోజి రవీందర్, రజిత, మామిడ్యాల భూనిర్వాసితులు

### కొత్త ఇండ్లు మంచిగున్నాయి



**మాది** మామిడ్యాల గ్రామం. మా భూములన్నీ ప్రాజెక్టులో పోయినయి. ఇప్పుడు మాకు ప్రభుత్వం తునికిబొల్లారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీల కొత్త ఇల్లు ఇచ్చింది. ఈ రోజు పూజలుచేసి గృహ ప్రవేశాలుచేసినం. మా కొత్త ఇల్లు చాలా మంచిగున్నది. మా గురించి బడి, అంగన్వాడీ కేంద్రం, దుకాణ సముదాయం కూడా సర్కారు ఏర్పాటుచేసింది.

– రాచకొండ నాగేశ్, పుష్ప, మామిడ్యాల భూనిర్వాసితులు

### ఐదు జిల్లాల వరప్రదాయిని!

| జిల్లా | నియోజకవర్గం | మండలం | ఆయకట్టు ఎకరాలు |
|---|---|---|---|
| 1. సిద్దిపేట | గజ్వేల్ | 1. జగదేవ్‌పూర్ | 12,740 |
| | | 2. ములుగు | 12,922 |
| | | 3. మర్కూక్ | 8,486 |
| | | 4. గజ్వేల్ | 20,620 |
| | | 5. వర్గల్ | 21,353 |
| | దుబ్బాక | 6. మిరుదొడ్డి | 938 |
| | | 7. దౌల్తాబాద్ | 27,989 |
| 2. మెదక్ | | 8. చేగుంట | 12,823 |
| | | 9. నార్సింగి | 1,046 |
| | నర్సాపూర్ | 10. వెల్దుర్తి | 5,186 |
| | | 11. నర్సాపూర్ | 10,347 |
| | | 12. శివ్వంపేట | 12,816 |
| | | 13. కౌడిపల్లి | 7,244 |
| | మెదక్ | 14. రామాయంపేట | 2,704 |
| | | 15. శంకరంపేట | 10,857 |
| | | 16. నిజాంపేట | 4,130 |
| | గజ్వేల్ | 17. తూప్రాన్ | 18,422 |
| 3. యాదాద్రి భువనగిరి | భువనగిరి | 18. తుర్కపల్లి | 13,587 |
| | | 19. బొమ్మల రామారం | 17,311 |
| | | 20. బీబీనగర్ | 4,650 |
| 4. సంగారెడ్డి | సంగారెడ్డి | 21. హత్నూర | 20,629 |
| | | 22. సంగారెడ్డి | 10,404 |
| | పటాన్‌చెరు | 23. పటాన్‌చెరు | 6,830 |
| | | 24. జిన్నారం | 3,381 |
| 5. మేడ్చల్ మల్కాజిగిరి | మేడ్చల్ | 25. కీసర | 2,479 |
| | | 26. శామీర్‌పేట | 15,386 |
| మొత్తం | | | 2,85,280 |



**రిజర్వాయర్‌లోకి ఇలా..** రంగనాయక సాగర్ నుంచి సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి మీదుగా తొగుట మండలం తుక్కాపూర్ పంప్‌హౌజ్‌కు.. అక్కడి నుంచి గజ్వేల్ మండలం అక్కారం పంప్‌హౌజ్‌కు. అటునుంచి మర్కూక్ పంప్‌హౌజ్ నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌లోకి..

**సాగునీరు అందే నియోజకవర్గాలు**

- **సిద్దిపేట జిల్లా**
  గజ్వేల్ **94,543**
  దుబ్బాక **42,796**
- **యాదాద్రి భువనగిరి జిల్లా**
  భువనగిరి **35,543**
- **మెదక్ జిల్లా**
  నర్సాపూర్ **35,593**
  మెదక్ **17,691**
- **సంగారెడ్డి జిల్లా**
  సంగారెడ్డి **31,033**
  పటాన్‌చెరు **10,211**
- **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా**
  మేడ్చల్ **17,865**

(ఎకరాల్లో)

**నీటిని తీసుకెళ్లడానికి ప్రధాన కాల్వలు**
రామాయంపేట, గజ్వేల్, ఉప్పరపల్లి, కిష్టాపూర్, తుర్కపల్లి, జగదేవ్‌పూర్, తుర్కపల్లి(ఎం), శంకరంపేట, సంగారెడ్డి



**మూడు ప్రధాన స్లూయిస్‌లు**
- సంగారెడ్డి ప్రధాన కెనాల్
- కేశవపూర్ కెనాల్
- జగదేవ్‌పూర్ కెనాల్

**15 టీఎంసీలు** కొండపోచమ్మ రిజర్వాయర్ సామర్థ్యం 15.8 కి.మీ వలయాకారంలో కట్ట

**10 టీఎంసీలు** కేశవపూర్ రిజర్వాయర్‌కు తరలించేవి. ఇక్కడి నుంచి జంటనగరాలకు తాగునీరు.

రూ.**1,540** కోట్లు ప్రాజెక్టు వ్యయం

**2,85,280** ఎకరాలు మొత్తం ఆయకట్టు

**లబ్ధిపొందనున్న జిల్లాలు**
సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, మేడ్చల్, యాదాద్రి భువనగిరి

## ఎక్కడి గోదారమ్మ.. ఎక్కడి 'కొండ'పోచమ్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కొండపోచమ్మసాగర్‌కు గోదావరి జలాలను తరలింపు కసరత్తు ముమ్మరమైంది. ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్ నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయంవరకు జలాల తరలింపు ఇప్పటికే ప్రారంభమైంది. దీంతోపాటు ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా ఈ నీటిని ఎత్తిపోసి వరదకాల్వను రిజర్వాయర్‌లా మార్చారు. ఇలా రెండువైపులా జలసిరులను అందించిన కాళేశ్వరం.. అతికొద్ది రోజుల్లో మూడోదిశగా తన ప్రస్థానాన్ని ప్రారంభించనున్నది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని జలాల తరలింపు దశలను ఓసారి పరిశీలిస్తే..



గోదావరి నదిపై మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీబరాజ్ ఎఫ్‌ఆర్‌ఎల్ వంద మీటర్లు. ఇక్కడ నిల్వచేసిన నీటిని కన్నెపల్లి వద్ద నిర్మించిన లక్ష్మీ పంపుహౌజ్ ద్వారా ఎత్తిపోస్తున్నారు. అంటే సముద్రమట్టానికి 88 మీటర్ల ఎత్తునుంచి గోదావరిజలాలను ఎగువకు ఎత్తిపోయడం ఇక్కడే ప్రారంభమైంది. పదకొండు పంపులతో రోజుకు రెండు టీఎంసీలను ఎత్తిపోయడం కూడా విజయవంతమైంది.



లక్ష్మీ పంపుహౌజ్‌ద్వారా జలాలను సరస్వతి బరాజ్‌లో పోస్తున్నారు. దీని ఎఫ్‌ఆర్‌ఎల్ 119 మీటర్లు. ఇక్కడినుంచి సరస్వతి పంపుహౌజ్‌లోని మోటర్ల ద్వారా పార్వతి బరాజ్‌లోకి తరలిస్తున్నారు. ఇక్కడ కూడా ఎనిమిది మోటర్లతో రోజుకు రెండు టీఎంసీల ఎత్తిపోత విజయవంతమైంది.



పార్వతి బరాజ్ ఎఫ్‌ఆర్‌ఎల్ 130 మీటర్లు. ఇక్కడ నిల్వచేసిన నీటిని పార్వతి పంపుహౌజ్‌లోని మోటర్ల ద్వారా 148 మీటర్ల ఎత్తులో ఉన్న ఎల్లంపల్లి జలాశయానికి తరలిస్తున్నారు. ఈ పంపుహౌజ్‌లోనూ తొమ్మిది మోటర్లతో రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోశారు.



ఎల్లంపల్లి నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా నంది రిజర్వాయర్.. ఆపై నంది పంపుహౌజ్‌కు తరలించిన నీటిని 124.4 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మోటర్ల ద్వారా ఎత్తిపోస్తున్నారు.



నంది పంపుహౌజ్ నుంచి ఎత్తిపోసిన నీళ్లు దాదాపు పదకొండు మీటర్ల పొడవున ఉన్న జంటసొరంగాల ద్వారా గాయత్రి పంపుహౌజ్‌కు చేరుకొంటున్నాయి. అక్కడ 139 మెగావాట్ల సామర్థ్యం ఉన్న బాహుబలి మోటర్ల ద్వారా ఎత్తిపోస్తున్నారు. ఇలా గోదావరిజలాలు ఎస్సారెస్పీ వరదకాల్వలో 99 మీటర్ల వద్ద పడుతున్నాయి.



వరద కాల్వలోకి వచ్చిన జలాలు నేరుగా శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌కు చేరుకొంటున్నాయి. లక్ష్మీ బరాజ్ వద్ద సముద్రమట్టానికి 88 మీటర్ల ఎత్తులో ఉన్న గోదావరి జలాలను 323 మీటర్ల ఎత్తులోకి పోస్తున్నారు. అంటే సుమారు 235 మీటర్ల ఎత్తువరకు నీటి ఎత్తిపోత విజయవంతంగా కొనసాగుతున్నది.



ఎస్సారార్ నుంచి జలాలను 397 మీటర్ల ఎత్తులో ఉన్న 3.50 టీఎంసీల సామర్థ్యం గల అన్నపూర్ణ (అనంతగిరి) జలాశయానికి తరలిస్తారు. ఇక్కడ నీటిని నిల్వ చేసేందుకు స్వల్ప అవాంతరంగా ఉన్న ఎస్సీకాలనీ తరలింపు ప్రక్రియ కూడా పూర్తయింది.

అన్నపూర్ణ జలాశయం నుంచి 480 మీటర్ల ఎత్తులో ఉన్న సిద్దిపేట సమీపంలోని రంగనాయకసాగర్‌లోకి తరలిస్తారు.

రంగనాయకసాగర్ నుంచి 557 మీటర్ల ఎత్తులోకి జలాలను ఎత్తిపోయడం ద్వారా మల్లన్నసాగర్‌లోకి నీళ్లను తరలించవచ్చు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కానందున అక్కడ నిల్వ చేయకుండా బైపాస్‌చేసి ముందుకు తరలించనున్నారు.

557 మీటర్ల ఎత్తులోకి వచ్చిన గోదావరి జలాలను మరోసారి ఎత్తిపోయడం వల్ల కొండపోచమ్మ సాగర్‌కు చేరుకొంటాయి. తద్వారా జలాలు 614 మీటర్ల ఎత్తులో అందుబాటులోకి వస్తాయి. కొండపోచమ్మ సాగర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 15 టీఎంసీలు.

రంగనాయకసాగర్ నుంచి 557 మీటర్ల ఎత్తులోకి జలాలను ఎత్తిపోయడం ద్వారా మల్లన్నసాగర్‌లోకి నీళ్లను తరలించవచ్చు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కానందున అక్కడ నిల్వ చేయకుండా ముందుకు తరలించనున్నారు.

### పూర్తయిన ప్రత్యామ్నాయమార్గం

మల్లన్నసాగర్‌ను 50 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు పూర్తికాకపోవడంతో అక్కడ నిల్వ చేయకుండా ప్రత్యామ్నాయ మార్గంలో ముందుకు తరలించాలని నిర్ణయించారు. ఇందుకు రిజర్వాయర్ ప్రాంతంనుంచే టీఎంసీ ప్రవాహ సామర్థ్యంతో కాల్వ నిర్మించారు. ఈ జలాశయంలో నీరు నిల్వచేసే వరకు ప్రజల రవాణాసౌకర్యానికి ఇబ్బంది కలుగకుండా కాల్వపై అవసరమైన చోట వంతెనలు నిర్మించారు.

**కాళేశ్వరంతో జలసిరులు**

ఎండాకాలంలో సాధారణంగా జలాశయాల్లో నీటినిల్వలు తగ్గుతుంటాయి. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు మహత్తుతో ఇప్పటికీ జలసిరులు కళకళలాడుతున్నాయి. గోదావరిపై నిర్మించిన మూడు బరాజ్‌లలో సుమారు 20 టీఎంసీలవరకు నిల్వలుండగా.. ఎల్లంపల్లిలో 10.60 టీఎంసీలు, ఎస్సారార్‌లో దాదాపు 25, ఎల్ఎండీలో 11.40 టీఎంసీలవరకు నీటినిల్వలు ఉన్నాయి. అదనంగా ఎస్సారెస్పీ వరదకాల్వ పొడవునా ఒక టీఎంసీ జలాలు ఉండగా.. శ్రీరాంసాగర్‌లో 54 టీఎంసీల నిల్వ ఉన్నది.

**138 రోజులుగా కాకతీయ కాల్వలో జలాలు**

కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతో చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఎస్సారెస్పీ పరిధిలో తొలిసారిగా పూర్తిస్థాయిలో 14 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందింది. సుమారు 2వేలకుపైగా చెరువులను నింపారు. గత ఏడాది అక్టోబర్ 13న కాకతీయకాల్వలో మొదలైన ప్రవాహం.. నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధివరకు ఇప్పటికీ కొనసాగుతున్నది. అంటే 138 రోజులుపాటు నిరవధికంగా నీటి ప్రవాహం ఉండటమనేది కాల్వచరిత్రలోనే తొలిసారి. శుక్రవారం కూడా కాకతీయకాల్వలో ఆరువేల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నది.

**ఇప్పటికీ కొనసాగుతున్న ఎత్తిపోత**

కాళేశ్వరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఏడాది జూన్ 21న ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో నిరంతరం ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రారంభం నుంచి ఇప్పటివరకు లక్ష్మీ పంపుహౌజ్ ద్వారా 51.56 టీఎంసీలు, సరస్వతి పంపుహౌజ్ ద్వారా 45.21, పార్వతి పంపుహౌజ్ ద్వారా 41.08, నంది పంపుహౌజ్ ద్వారా 58.21, గాయత్రి పంపుహౌజ్‌లోని బాహుబలి మోటర్ల ద్వారా 56.78 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు.

**110 కిలోమీటర్ల మేర సజీవంగా జీవనది**

కాళేశ్వరం ప్రాజెక్టుతో ఈ నీటి సంవత్సరం గోదావరి చరిత్రలోనే ఏనాడూ కనిపించని అపురూప దృశ్యం సాక్షాత్కారమైంది. లక్ష్మీ బరాజ్ మొదలు ఎగువన పార్వతి బరాజ్‌వరకు ఏకంగా 110 కిలోమీటర్లకుపైగా గోదావరి జలకళతో సజీవంగా కనిపిస్తున్నది. వరుస బరాజ్‌ల నిర్మాణంతోనే ఇది సాధ్యమైంది.

**ఎస్సారెస్పీ వైపునా విజయవంతం**

వరదకాల్వ ద్వారా శ్రీరాజరాజేశ్వర జలాశయం వైపే కాకుండా శ్రీరాంసాగర్‌వైపు కూడా జలాల తరలింపు విజయవంతమైంది. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం మోటర్లతో ఒక టీఎంసీ నీటిని ఎగువకు ఎత్తిపోయడంతో వరదకాల్వ రిజర్వాయర్‌లా మారింది. అంతేకాకుండా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 200పైగా చెరువులను ఈ నీటితో నింపారు.

# గుండె గుండెకో వ్యథ!

## ఢిల్లీ హింసాకాండలో సర్వం కోల్పోయిన కుటుంబాలు.. ఎవరిని కదిపినా కన్నీళ్లే



ఢిల్లీ అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన తమవారి మృతదేహాల కోసం గురుతేజ్ బహదూర్ దవాఖాన మార్చురీ బయట ఎదురు చూస్తూ రోదిస్తున్న ఓ మహిళ

*ఢిల్లీలో హంతకమూకలు సాగించిన హింసాకాండ.. అనేక కుటుంబాల్లో చీకట్లను మిగిల్చింది. కండ్ల ముందే అయినవారిని కోల్పోయి ఆ కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. గత మూడు రోజులుగా మత ఘర్షణలతో అట్టుడికిన ఈశాన్య ఢిల్లీలో పరిస్థితులు కాస్త సద్దుమణిగాయి. దీంతో బాధితుల కుటుంబాలను మీడియా పలుకరించగా.. కన్నీరే సమాధానంగా వస్తున్నది. ఒక్కొక్కరిది ఒక్కో విషాద గాథ. ఎవరిని కదిపినా కన్నీళ్లే. ఉన్మాదుల విధ్వంసకాండలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. మరోవైపు, గురుతేజ్ బహదూర్ దవాఖాన వద్ద బాధితుల రోదనలతో పరిస్థితి హృదయవిదారకంగా ఉన్నది. హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయినవారిలో ఎక్కువ మందికి బుల్లెట్ గాయాలైనట్లు వైద్యులు చెప్తున్నారు.*

**- నేషనల్ డెస్క్**

### తప్పించుకునేందుకు నుదుటిన తిలకం

**ఘోండా** ప్రాంతానికి చెందిన పర్వేజ్ ఆలం (50) గ్యారేజ్ నడుపుతున్నాడు. మంగళవారం విధ్వంసం సృష్టిస్తున్న అల్లరిమూకలను వారించేందుకు వెళ్లిన ఆయనను ఓ దుండగుడు వెనుక నుంచి కాల్చాడు. దీంతో ఆయన కుమారుడు మొహమ్మద్ సాహిల్ (20), సమీప బంధువును వెంటబెట్టుకుని తండ్రిని బైక్‌పై దవాఖానకు తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో దుండగుల బారి నుంచి తప్పించుకునేందుకు వారు నుదుటిపై తిలకం దిద్దుకున్నారు. అయితే ఆలం దవాఖానలో చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.

### కాల్చి.. మంటల్లోకి తోసి..

శివ విహార్‌లో నివసించే అన్వర్‌ను అల్లరిమూకలు దారుణంగా హతమార్చాయి. మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో అన్వర్ ఇంట్లోకి చొరబడిన దుండగులు ఆయనను బయటకు లాగి ఇంటికి నిప్పుపెట్టారు. అనంతరం ఆయనపై కాల్పులు జరిపారు. అంతటితో ఆగని కర్కశులు.. అన్వర్‌ను అలాగే మంటల్లోకి తోసేశారు. కండ్లారా చూడ్డం తప్ప తానేమీ చేయలేకపోయానని అన్వర్ సోదరుడు సలీమ్ కన్నీటి పర్యంతమయ్యారు. అయితే మానవత్వంపై తనకు ఇంకా విశ్వాసం ఉన్నదని, తమకు ఒక హిందూ కుటుంబం ఆశ్రయమిచ్చిందని చెప్పారు. మూకలు తమ ఇంటిలోని బంగారు ఆభరణాల్ని దోచుకెళ్లారని సలీమ్ వాపోయారు. వచ్చేనెలలో తన కుమార్తె పెండ్లి ఉన్నదని, తాము సర్వం కోల్పోయామని కన్నీరుమున్నీరయ్యారు.

### బీఎస్‌ఎఫ్ జవాన్ ఇంటినీ వదల్లేదు..



ఈశాన్య ఢిల్లీలో దుండగులు బీఎస్‌ఎఫ్ జవాన్ మొహద్ అనిస్ ఇంటినీ వదల్లేదు. ఇంటి బయట 'బీఎస్‌ఎఫ్ జవాన్' అని రాసి ఉన్న నేమ్ ప్లేట్‌ను చూసైనా తమను కనికరిస్తారన్న అనిస్ కుటుంబం ఆశలు నెరవేరలేదు. ఇంటి బయట ఉన్న కార్లకు నిప్పుపెట్టిన మూకలు అనంతరం ఇంటిని తగులబెట్టారు. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని అనిస్ కుటుంబం ఎలాగోలా బయటపడింది. ఇది బయటవారి పనేనని, స్థానికంగా ఉన్న హిందువులు తమకు సాయం చేశారని జవాన్ కుటుంబసభ్యులు చెప్పారు.

### పెండ్లయిన 10 రోజులకే..



ఎన్నో ఆశలతో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన ఆ దంపతుల కలలను అల్లరి మూకలు ఛిద్రం చేశాయి. గోకుల్‌పురిలోని ఓ ఇంటిలో నివాసముంటున్న ఎలక్ట్రిషియన్ అష్ఫక్ హుస్సేన్‌కు(22) పదిరోజుల కిందటే వివాహమైంది. మంగళవారం సాయంత్రం పని నిమిత్తం బయటకువెళ్లిన అతడిని దుండగులు హతమార్చారు. దవాఖాన నుంచి ఈ మేరకు ఫోన్ రావడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. తన కుమారుడికి ముస్లింల కంటే హిందువుల్లోనే ఎక్కువ మంది మిత్రులు ఉన్నారని, పెండ్లికి వారంతా హాజరై సందడి చేశారని అష్ఫక్ తండ్రి ఉద్వేగంగా తెలిపారు. ఇంటి దగ్గర ఉన్న ఆలయానికి ముస్లిం యువకులు రక్షణగా నిలువడంతో దుండగులు దాన్ని ఏమీ చేయలేదని తెలిపారు.

### మురికి కాలువలో సోదరుల మృతదేహాలు..

ఆమిర్ (25) ఘజియాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సోదరుడు అక్రమ్ (16) అతడికి సాయంగా ఉంటున్నాడు. వారి కుటుంబం అల్లర్లు జరుగుతున్న గోకుల్‌పురిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో కుటుంబాన్ని కలిసేందుకు ఇంటికి వస్తామంటూ మంగళవారం రాత్రి 8.30 గంటలకు ఆమిర్ తన పెద్దన్నకు ఫోన్‌చేశాడు.అయితే రాత్రి10 అయినా వారు ఇంటికి చేరలేదు. దీంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా..ఒక పోలీస్ వారి మృతదేహాలను తాను జీటీబీ దవాఖానలో చూసినట్లు చెప్పడంతో వారి గుండె పగిలింది. మురికి కాల్వలో సోదరులిద్దరి మృతదేహాలు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు.



ఢిల్లీలో ముస్లిం కుటుంబానికి తమ ఇంట్లో ఆశ్రయం కల్పించిన హిందూ కుటుంబం

### వెల్లి విరిసిన మత సామరస్యం!

**న్యూఢిల్లీ:** ఈశాన్య ఢిల్లీ ప్రాంతం మత హింసతో అల్లకల్లోలమైనా ఓ కాలనీ మాత్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. యమునా విహార్‌లోని బీ-బ్లాక్ కాలనీలో ఒకవైపు హిందువులు, మరొకవైపు ముస్లింలు, సిక్కులు జీవిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో మూకలు దాడులకు పాల్పడుతున్నా.. యమునా విహార్ మాత్రం ప్రశాంతంగా ఉంది. ఒకవైపు మారణ హోమంతో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. ఈ కాలనీలోని హిందువులు, ముస్లింలు, సిక్కులు రాత్రి వేళ తమ ఇండ్లకు రక్షణగా నిలిచారు. బయటి వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినా అప్రమత్తమయ్యారు. సోమ, మంగళవారాల్లో 24 గంటల పాటు తమ కాలనీని కంటికి రెప్పలా కాపాడుకున్నారు.

# కుదుటపడుతున్న పరిస్థితులు

**42కి చేరిన మృతుల సంఖ్య**

గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ ఎరుగని స్థాయిలో తీవ్రమైన మత ఘర్షణలతో అట్టుడికిన దేశ రాజధాని ఢిల్లీ క్రమంగా కుదుటపడుతున్నది. అల్లర్లకు కేంద్ర స్థానమైన ఈశాన్యఢిల్లీలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రజలు ఇప్పుడిప్పుడే ఇండ్ల నుంచి బయటకు వస్తున్నారు. దుకాణాలు తెరుచుకుంటున్నాయి. శుక్రవారం ప్రార్థనల నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. సున్నిత ప్రాంతాల్లో 7వేల మంది పారామిలిటరీ బలగాలను మోహరించారు. అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య శుక్రవారంనాటికి 42కు చేరుకున్నది. మరో 250 మంది గాయపడ్డారు.మరోవైపు, ఢిల్లీ అల్లర్లపై అమెరికా ఆందోళన వ్యక్తంచేసింది.హింసకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని భారత్‌ను కోరింది.

# 'రాజధర్మం'పై రగడ

### మీరా.. మాకు బోధించేది?

- మీ చరిత్ర తప్పులతడక
- సోనియాపై రవిశంకర్ మండిపాటు



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీపై కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. 'రాజధర్మం' గురించి తమకు బోధించవద్దన్న ఆయన, మీ చరిత్ర తప్పులతడకని విమర్శించారు. ఈశాన్య ఢిల్లీలో మతపరమైన అల్లర్లను అదుపుచేయడంలోనూ, తన విధులను నిర్వర్తించడంలోనూ విఫలమైన కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనియా నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు రాష్ట్రపతి కోవింద్‌కు ఓ వినతిపత్రం అందజేశారు. తమ ప్రభుత్వ హయాంలో 'రాజధర్మాన్ని' పాటించామని గుర్తుచేశారు. దీనిపై రవిశంకర్ స్పందిస్తూ.. 'సోనియా గాంధీ, దయచేసి రాజధర్మం గురించి మాకు బోధించొద్దు. మీ చరిత్ర అంతా తప్పులతడక' అని అన్నారు.

### మీది విభజన మనస్తత్వం

**మా హయాంలో అసలైన రాజధర్మాన్ని పాటించాం: కాంగ్రెస్**



**న్యూఢిల్లీ:** ఇందిరా గాంధీ, మన్మోహన్‌ది సమానత్వం, మతసామరస్యం కోరే రాజధర్మమని, బీజేపీది విభజన మనస్తత్వమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. సోనియాపై కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ చేసిన విమర్శలను ఆ పార్టీ ఖండించింది. ఢిల్లీలో అల్లర్లకు ప్రతిపక్షం ప్రోద్బలమే కారణమన్న రవిశంకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ స్పందించారు. 'ఎన్నార్సీ తప్పుడు నిర్ణయమని మళ్లీ చెబుతున్నా. దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి. స్వేచ్ఛగా మాట్లాడనివ్వని, శాంతియుతంగా నిరసనలు తెలుపనివ్వని దేశంలో మనం జీవించాల్సిరావడం సిగ్గుపడాల్సిన విషయం' అని వ్యాఖ్యానించారు.

# సుప్రీంకోర్టుకు నిర్భయ కేసు దోషి

- ఉరిశిక్షను జీవితఖైదుకు తగ్గించాలని విజ్ఞప్తి
- క్యురేటివ్ పిటిషన్ దాఖలుచేసిన పవన్ గుప్తా



**న్యూఢిల్లీ:** తనకు విధించిన ఉరిశిక్షను జీవితఖైదుగా తగ్గించాలని కోరుతూ నిర్భయ కేసు దోషుల్లో ఒకడైన పవన్‌కుమార్ గుప్తా శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఉరిశిక్ష విధిస్తూ ట్రయల్ కోర్టు జారీచేసిన ఆదేశాలను వాయిదావేయాలని కోరుతూ క్యురేటివ్ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ నెల 17న ట్రయల్ కోర్టు నిర్భయ కేసు దోషులను మార్చి 3న ఉరి తీయాలని డెత్ వారెంట్లను జారీచేసింది. ఈ ఆదేశాల్ని సవాల్ చేస్తూ.. పవన్‌కుమార్‌కు ఉరిశిక్ష వేయొద్దని అతని తరఫు న్యాయవాది ఏపీ సింగ్ క్యురేటివ్ పిటిషన్ ద్వారా విజ్ఞప్తిచేశారు. ఇప్పటివరకు ఎలాంటి న్యాయపరమైన అవకాశాలను వినియోగించుకోని పవన్ వేసిన క్యురేటివ్ పిటిషన్ తిరస్కరణకు గురైతే రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరే వెసులుబాటు అతనికి ఉన్నది.మిగిలినముగ్గురు దోషుల రాష్ట్రపతి క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే.

# ఎల్గార్ పరిషత్ కేసులో ఎన్ఐఏ కోర్టుకు నిందితులు

**ముంబై:** ఎల్గార్ పరిషత్ కేసులో అరెస్టు అయిన 9 మంది నిందితులను శుక్రవారం ముంబైలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. వీరిలో వరవరరావు, సురేంద్ర గాడ్లిగ్, మహేశ్ రౌత్, రోనా విల్సన్, సుధీర్ ధవాలే, అరుణ్ ఫెరీరా, సుధా భరద్వాజ్, షోమా సేన్, వెర్నన్ గోంజాల్వెజ్ ఉన్నారు. 2017 డిసెంబర్ 31న పుణెలోని శనివార్‌వాడా ప్రాంతంలో నిర్వహించిన 'ఎల్గార్ పరిషత్' సదస్సు సందర్భంగా వీరంతా విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగించారని, దీంతో మరుసటి రోజు కోరెగావ్ భీమా వద్ద హింస చెలరేగిందని ఆరోపిస్తూ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసును ఇటీవల ఎన్ఐఏకు అప్పగించారు. ఈ నేపథ్యంలో పోలీసులు నిందితులను ముంబైలోని ఎన్ఐఏ కోర్టులో హాజరుపర్చారు.

### ఇది నా జీవితం.. నా ముఖం

- ట్రోల్స్‌పై శృతిహాసన్ మండిపాటు



**చెన్నై:** 'చాలా సన్నగా మారిపోయింది'.. 'ఈ ఫొటోలో వయసైపోయినట్టు కనిపిస్తున్నది' అంటూ గత కొంత కాలంగా తనపై వస్తున్న వార్తలపై ప్రముఖ నటి శృతిహాసన్ స్పందించారు. ఎదుటివాళ్లపై తీర్పులు చెప్పే అధికారం ఎవరికీ లేదని మండిపడ్డారు. ఇది తన జీవితమని, నచ్చినట్టు కనిపించే హక్కు తనకున్నదని తెలిపారు. మన శరీరంలో వచ్చే మార్పులను స్వాగతిస్తే ప్రశాంత జీవనం గడుపవచ్చని హితవు పలికారు. తాను హార్మోన్ సమస్యలతో బాధ పడుతున్నానని.. అందుకే తన రూపంలో మార్పులు వస్తున్నాయని పేర్కొన్న శృతి.. తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్టు వెల్లడించారు. ఈ విషయాల్ని తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. దీంతోపాటు రెండు ఫొటోలను కూడా షేర్ చేశారు.

### ఈ వేసవి హాట్ గురూ!

*ఎండలు దంచికొడుతాయన్న ఐఎండీ*

**న్యూఢిల్లీ:** ఈ వేసవికాలంలో మార్చి నుంచి మే నెల వరకు ఎండలు సాధారణం కన్నా ఎక్కువగా ఉండనున్నట్లు భారత వాతావరణ విభాగం తెలిపింది. వాయవ్య, పశ్చిమ, మధ్య, దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ ఎండల ప్రభావం అధికంగా ఉండనున్నట్లు పేర్కొంది. అలాగే 'కోర్ హీట్ వేవ్ జోన్'లో మార్చి నుంచి మే నెల వరకు వడగాలులు ఎక్కువగా వీస్తాయని తెలిపింది. ఈ జోన్ పరిధిలో తెలంగాణ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, మహారాష్ట్రలోని కొంత ప్రాంతం, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి.

### మగువలకు.. మద్యం షాపులు

**భోపాల్:** మద్యం ద్వారా మరింత ఆదాయం కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఇందులో భాగంగా మగువల కోసం ప్రత్యేక మద్యం షాపులను ఏర్పాటు చేయనున్నది. భోపాల్, ఇండోర్‌లో రెండు, జబల్‌పూర్, గ్వాలియర్‌లో ఒకటి చొప్పున త్వరలో ప్రారంభించనున్నట్లు సమాచారం. మాల్స్ లేదా సూపర్‌మార్కెట్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

# పరిశోధనల్లో మహిళలు 15 శాతమే!

**వారి భాగస్వామ్యం పెరుగాలి**

**రాష్ట్రపతి కోవింద్ పిలుపు**



**న్యూఢిల్లీ:** శాస్త్ర, సాంకేతిక రంగంలో మహిళల సంఖ్య తక్కువగా ఉండటంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధిలో మహిళా సాధికారత చాలా కీలకమని, కానీ పరిశోధన, అభివృద్ధి విభాగంలో మహిళలు 15 శాతమే ఉండటం ఆందోళనకరమన్నారు. పరిశోధన, అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరుగాలని శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో చెప్పారు. 'గతేడాది శ్రీహరికోట నుంచి చంద్రయాన్-2ను ప్రయోగించినప్పుడు నేనక్కడికి వెళ్లాను. అక్కడ ఓ మహిళా శాస్త్రవేత్తను చూస్తే చాలా సంతోషం అనిపించింది. ఆ ప్రాజెక్టు కోసం ఆమె తన 6 నెలల బాలుడిని కుటుంబం వద్ద వదిలేసి కష్టపడ్డారు. ఆమె స్ఫూర్తిగా మరింత మంది మహిళలు ఈ రంగంలోకి రావాలి' అని పిలుపునిచ్చారు.

**శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ సెల్యూట్**

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్వీట్ చేశారు.



స్వర్ణ రథం లోపలున్న విలాసవంతమైన సౌకర్యాలు; స్వర్ణ రథం

### త్వరలో మళ్లీ పట్టాలపైకి 'స్వర్ణ రథం'

**న్యూఢిల్లీ:** విలాసవంత రైలు 'గోల్డెన్ ఛారియట్ (స్వర్ణ రథం)' సేవలను మార్చి 22 నుంచి పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు. 2008లో కర్ణాటకలోని పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఆ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఈ రైలును ప్రారంభించింది. కొన్నేండ్ల అనంతరం నిలిపేసిన ఈ రైలును ప్రస్తుతం ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఒప్పందం కుదిరింది. 'కర్ణాటక ఆత్మగౌరవం' పేరుతో మార్చి 22, 29, ఏప్రిల్ 12న వారం రోజుల రైలు యాత్రలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ రైలులో ఆధునాతన ఫర్నీచర్, స్పా, జిమ్, వైఫైతో కూడిన స్మార్ట్ టీవీలు వంటి ప్రత్యేక హంగులతోపాటు స్వదేశీ, విదేశీ వంటకాలు అందుబాటులో ఉంటాయని వివరించారు.

### 35 ఏండ్లుగా చిత్ర విచిత్ర సమ్మె

**ఉత్తరాఖండ్ న్యాయవాదుల సమ్మెను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు**

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ పాఠశాలలో బాంబు పేలుళ్లు జరిగాయని కొందరు, శ్రీలంక రాజ్యాంగానికి సవరణలు చేశారని మరికొందరు, నేపాల్‌లో భూకంపం వచ్చిందని ఇంకొందరు.. ఇలా అర్థం పర్థంలేని కారణాలతో కొందరు న్యాయవాదులు సమ్మెకు దిగారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 35 ఏండ్లుగా ఈ నిర్వాకం వెలగబెడుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని మూడు జిల్లా కోర్టులకు చెందిన న్యాయవాదులు అసంబద్ధమైన కారణాలతో ప్రతి శనివారం కోర్టు విధులకు డుమ్మా కొట్టి ఇలా సమ్మెకు దిగుతున్నారు. దీనిపై శుక్రవారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సమ్మెను వెంటనే నిలిపివేయాలని ఆదేశాలిచ్చింది.

- ఎన్పీఆర్‌లో కొత్త ప్రశ్నల జోడింపుతో గందరగోళం
- స్పష్టతనివ్వని కేంద్రప్రభుత్వం
- షెడ్యూలు దగ్గర పడుతుండటంతో ప్రక్రియను వాయిదా వేస్తున్న పలు రాష్ట్రాలు
- వివాదాలమయమైన సీఏఏ, ఎన్నార్సీ

**కేంద్రం** తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), జాతీయ పౌర జాబితా(ఎన్నార్సీ)పై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నార్సీని వ్యతిరేకిస్తూ.. దాన్ని తమ దగ్గర అమలు చేయబోమని ఇప్పటికే పదుల సంఖ్యలో రాష్ట్రాలు నిర్ణయించాయి. ఇదిలా ఉండగా గతంలో ఉన్న జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్)కు కేంద్రం కొత్త ప్రశ్నలు జోడించడం అగ్నికి ఆజ్యం పోసినట్టైంది. 'ఎన్నార్సీ తయారీకి ఎన్పీఆర్ ప్రాతిపదిక' అని ఆరోపిస్తూ.. పశ్చిమబెంగాల్, కేరళ తదితర రాష్ట్రాలు ఎన్పీఆర్ ప్రక్రియను తమ రాష్ట్రాల్లో అమలు చేయబోమని ప్రకటించాయి. ఎన్పీఆర్ విషయంలో సమాజంలోని పలు వర్గాల్లోనూ సందేహాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, షెడ్యూల్‌ను అనుసరించి ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య ఎన్పీఆర్, జనగణన(తొలి దశ-హౌస్‌హోల్డ్ సర్వే) ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో ఎన్పీఆర్, జనగణన, ఎన్నార్సీ, సీఏఏల మధ్య తేడా, తదితర అంశాలపై పరిశీలన.

**- నేషనల్ డెస్క్**







## ఎన్పీఆర్

**అంటే ఏమిటి?**

దేశంలోని సాధారణ నివాసుల వివరాలతో కూడిన ఒక పట్టిక. ప్రతి ఐదేండ్లకోసారి ఎన్పీఆర్ సవరణ జరుగుతుంది.

**ఏ చట్టం ప్రకారం?**

పౌరసత్వం చట్టం-1955 పరిధిలో పౌరసత్వ నిబంధనలు, 2003 ఆధారంగా ఎన్పీఆర్‌ను రూపొందిస్తారు.

**ఎందుకు?**

ఒక నివాసిత ప్రాంతంలో గత ఆరునెలలుగా నివసిస్తున్న, లేదా వచ్చే ఆరునెలలు నివసించాలనుకొంటున్న వ్యక్తుల వివరాలను సేకరించడం ఎన్పీఆర్ ప్రధాన ఉద్దేశం

**వివాదం ఏమిటి?**

గత ప్రభుత్వాలు అనుసరించిన ఎన్పీఆర్ నమూనాకు కొన్ని ప్రశ్నలు జోడించి సవరించిన నమూనాతో కొత్త ఎన్పీఆర్‌ను మోదీ సర్కార్ తీసుకురావడంతో పలు రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జోడించిన ప్రశ్నలను చట్టంలోని ఏ సెక్షన్ ప్రకారం చేర్చిందో కేంద్రం స్పష్టతనివ్వకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. మాతృభాష, వ్యక్తి, తల్లిదండ్రులు పుట్టిన ప్రదేశం, గతంలో నివసించిన ప్రాంతంతో పాటు ఆధార్ వివరాలు(ఐచ్ఛికం), ఓటరు గుర్తింపు కార్డు వివరాలు, పాసుపోర్టు, మొబైల్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ నంబరు తదితర ప్రశ్నల్ని కొత్తగా జోడించారు.

**వివరాలు**

స్థానిక(గ్రామ/మండల), తాలూకా, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎన్పీఆర్‌ను అప్‌డేట్ చేస్తారు. ఎన్పీఆర్‌లో వ్యక్తి పేరు, నివాస స్థితి, కుటుంబ యజమానితో గల బంధుత్వం, లింగం, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, విద్యార్హత, వృత్తి, తల్లిదండ్రులు లేదా భాగస్వాముల పేర్లు, జన్మస్థలం, ప్రస్తుత చిరునామా, ఎంతకాలంగా ప్రస్తుత చిరునామాలో ఉంటున్నారు, శాశ్వత చిరునామా వంటి అంశాలను పూరించాల్సి ఉంటుంది. అయితే, వీటికితోడు పౌరుల వ్యక్తిగత వివరాలు, పలు సున్నిత అంశాలు ప్రశ్నావళిలో జోడించడంతో వివాదం రాజుకున్నది. అయితే, ఎన్పీఆర్ కోసం పౌరులు ఇచ్చే సమాచారం స్వచ్ఛందమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

**అంటే ఏమిటి?**

చట్ట ప్రకారం భారతీయ పౌరులుగా నమోదైన వారి జాబితాయే ఎన్నార్సీ. ఈ పట్టికను మొట్టమొదటిసారిగా 1951లో ప్రభుత్వం రూపొందించింది. అసోంలో మినహా.. ఇప్పటి వరకు దీన్ని ఎక్కడా మళ్లీ నవీకరించలేదు.




**ఏ చట్టం ప్రకారం?**

పౌరసత్వ సవరణ చట్టం 2003 ఆధారంగా నిర్వహిస్తారు.

**ఎందుకు?**

చట్టబద్ధమైన భారతీయ పౌరులు ఎవరో తెలుసుకోవడమే ప్రధానోద్దేశం.

**వివాదం ఏమిటి?**

అక్రమవలసదారుల్ని గుర్తించి దేశం నుంచి వెనక్కి పంపించటమే ఎన్నార్సీ లక్ష్యమని పేర్కొంటారు. అయితే, సరైన వివరాలు సమర్పించలేదన్న కారణంతో అసోంలో గత కొన్నేండ్లుగా నివసిస్తున్న వేలాది మంది పౌరుల్ని జాబితా నుంచి తొలిగించినట్టు వార్తలు వచ్చాయి. దీంతో వివాదం రాజుకున్నది. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత్ తరుపున పోరాడిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మహమ్మద్ సనావుల్లా పేరు సైతం జాబితాలో లేకపోవడం చర్చనీయాంశమైంది.

## జనగణన (సెన్సస్)

**అంటే ఏమిటి?**

దేశంలో నివసిస్తున్న జనాభా సంఖ్యను తెలియజేసేదే జనగణన. ప్రతి పదేండ్లకొకసారి దీన్ని చేపడుతారు. జనగణనకు సన్నాహకంగా హౌస్‌హోల్డ్ సర్వే నిర్వహిస్తారు. దీన్ని ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ నడుమ చేపట్టనున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి 9, 2021 నుంచి జనగణన ప్రక్రియ చేపట్టనున్నారు.

**ఏ చట్టం ప్రకారం?**

జనగణన చట్టం-1948 ఆధారంగా నిర్వహిస్తారు

**ఎందుకు?**

దేశంలోని పౌరుల గణాంక సమాచారంతో పాటు, గత దశాబ్దంలో దేశం సాధించిన పురోగతి, ప్రభుత్వ పథకాల అమలు వంటివి తెలుసుకోవడం దీని ప్రధానోద్దేశం.

**వివరాలు**

వ్యక్తి గృహ వివరాలు, ఇంటి నిర్మాణం, కుటుంబ సభ్యుల వివరాలు, గృహోపకరణాల వివరాలు, ఆదాయ మార్గాలు, వ్యవసాయ- వ్యవసాయేతర వర్గాలు, సాగు, తాగు నీటి లభ్యత, ఎస్సీ, ఎస్టీ వివరాలు(రిజర్వేషన్ల కోసం), భాష, మతం, దివ్యాంగత.. తదితర సమాచారాన్ని సేకరిస్తారు.

పాకిస్థాన్, అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల్లో మత వివక్షకు గురై 2014 డిసెంబర్ 31 కంటే ముందు భారత్‌కు వలస వచ్చిన హిందు, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ, క్రైస్తవులకు(స్థూలంగా ముస్లిమేతరులకు) కొన్ని నిబంధనలకు లోబడి భారత పౌరసత్వం ఇవ్వడమే దీని ప్రధానోద్దేశం.

**ఏ చట్టం ప్రకారం?**

1955 పౌరసత్వ చట్టానికి పలు సవరణలు చేసి తీసుకొచ్చిందే సీఏఏ-2019

**వివాదం ఎందుకు?**

జాబితాలో ముస్లింలను చేర్చకపోవడమే వివాదానికి ప్రధాన కారణం.



సోనియా జీ! రాజధర్మం గురించి మాకు చెప్పొద్దు. మీ చరిత్రే రాజ్యాంగ ఉల్లంఘనల గురించి చెబుతుంది. మీ ఓటుబ్యాంకు రాజకీయాలు తెలియనివి కావు. సున్నిత సమయాల్లో ఢిల్లీ ప్రజల మధ్య శాంతి, సౌభ్రాతృత్వాలు పెంచటానికి ఉమ్మడిగా కృషిచేయాలి.

**రవిశంకర్‌ప్రసాద్, కేంద్రమంత్రి**

ప్రపంచ మార్కెట్లన్నీ కరోనా వైరస్ కారణంగా కుప్పకూలాయి. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పడిపోయింది. భారత్ కూడా ఆర్థిక మందగమనంతో సతమతమవుతున్నది. మనం దీన్నుంచి బయటపడటం కష్టం. ఉద్యోగ కల్పన లేదు. కానీ మన నేతలు హిందూ-ముస్లిం వివాదాల్లో మునిగిపోయారు.

**చేతన్ భగత్, ప్రముఖ రచయిత**



### చరిత్రలో నేడు



**1908**

'ఘన రూప హీలియం'ను కనుగొన్న డచ్ శాస్త్రవేత్త హెయికీ కామర్లింగ్.

**1940**

'గాన్ విత్ ది విండ్' చలన చిత్రంలో సహాయనటి పాత్రకు అస్కార్ అవార్డును పొందిన మొదటి ఆఫ్రో అమెరికన్ మెక్ డేనియల్.





**1956**

ఇస్లామిక్ రిపబ్లిక్‌గా అవతరించిన పాకిస్థాన్.

ఒడిషా నుంచి దక్షిణ తమిళనాడు వరకు 75 వేల చ॥కి.మీ. మేర విస్తరించి ఉన్న తూర్పు కనుమలు వన, జంతు జాలానికి పెద్ద ఆవాసంగా ఉన్నాయి. మూడు వేల పూలజాతి మొక్కలు, తేమ వాతావరణంలో పెరిగే వందరకాల ప్రత్యేక మొక్కలున్నాయి. పులులు, ఏనుగులు ఉన్నాయి. 400 రకాల పక్షి జాతులున్నాయి. ఈ ప్రాంతం లక్షలాది మందికి జీవనోపాధిగా ఉన్నది. కానీ ఈ మధ్యకాలంలో అడవుల నరికివేత కారణంగా ఉష్ణోగ్రతల్లో మార్పు, రుతువులు గతితప్పటం జరుగుతున్నవి. ఇప్పటికైనా వనసంపదను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**ది హిందూ**

హాలీవుడ్ మొగల్ హార్వీ వేన్‌స్టెయిన్‌ను లైంగికదాడి, వేధింపుల ఆరోపణల్లో న్యూయార్క్ కోర్టు దోషిగా తేల్చింది. మొదట 2017లో వెలుగుచూసిన ఈ ఆరోపణలు, ఆ తర్వాతికాలంలో వంద మందిదాకా మహిళలు హార్వీ తమను వేధించాడని ప్రకటించటంతో పెద్ద సంచలనమయ్యాయి. ఇలాంటి ఘటనలతో వేధింపులకు గురైనవారు ముందుకురావటంతో మీ టూ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా కొనసాగింది. ఉన్నతస్థానాల్లో ఉంటూ వేధింపులకు పాల్పడినవారి చీకటి జీవితం వెలుగుచూసింది. ఇప్పుడు మీ టూ ఉద్యమం ఫలించినట్లే.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# ప్రపంచ మహమ్మారి!

చైనాలో స్థిరపడిన కరోనా వైరస్ దాదాపు యాభై ఇతర దేశాలకు కూడా వ్యాపించడంతో దీనిని ప్రపంచ మహమ్మారిగా గుర్తించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రపంచ మహమ్మారిగా మారడానికి ఒక అడుగు దూరంలో ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించడాన్ని బట్టి పరిస్థితి ఎంత విషమించిందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఒక ప్రాంతంలోని అనేకమందిని బలిగొంటూ ఉంటే దానిని మహమ్మారి అంటారు. అది ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తమవుతున్నది. చైనాలోనే ఇప్పటివరకు దాదాపు 80 వేల మందికి కరోనా వైరస్ సోకిందనీ, 2,788 మంది మరణించారని తెలుస్తున్నది. చైనా పారదర్శక వ్యవస్థ కాదు కనుక వాస్తవ సంఖ్య ఎంతో చెప్పలేము. ఈ వైరస్ కారణంగా ఇతర దేశాలలో మరో 20 మంది మరణించారు. చైనా తరువాత అతి ఎక్కువగా ప్రభావితమైన దేశం దక్షిణకొరియా. ఇటలీలో కూడా 229 మందికి సోకింది. ఇరాన్‌లో 61 మంది ఈ వైరస్ బారినపడ్డారు. ఆఫ్రికా ఖండంలో అత్యధిక జనాభా గల నైజీరియాలోనూ వైరస్ అడుగుపెట్టింది. ఇరాక్, కువైట్, ఒమన్, బహ్రైన్ వంటి పశ్చిమాసియా దేశాలలో ఉనికిని చాటుకున్నది. చైనాలో పర్యటించినందుకు మంగోలియా అధ్యక్షుడికే ఏకాంతవాసం తప్పడం లేదు. వైరస్ వ్యాప్తి మూలంగా చైనా సమాజం ఎంత ఒత్తిడికి గురవుతున్నదో ఊహాతీతం. ప్రపంచవ్యాప్తంగా పర్యటనలు, కార్యక్రమాలు రద్దవుతున్నాయి. పలుదేశాల్లో షేర్ మార్కెట్లు పతనమవుతున్నాయి. ప్రపంచ ఆర్థికాభివృద్ధికి కరోనా వైరస్ వ్యాప్తి పెనుముప్పుగా పరిణమించింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఇప్పటికే శుష్కించిన ఆర్థికవ్యవస్థలు మరింత ప్రమాదంలో పడవచ్చు.

**పక్షులు, పందుల నుంచి వచ్చిన వైరస్ కొత్త రూపంతో మానవులకు సంక్రమించింది. ఈ విధంగా 2009లో మొదలైన స్వైన్ ఫ్లూ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని బలిగొన్నది. భారీ ఫామ్‌లలో హృదయవిదారక పరిస్థితులలో జంతువులను, పక్షులను బంధించి వధిస్తున్న తీరు పట్ల తీవ్ర విమర్శలున్నాయి. ఆహారాన్ని నెలల కొద్ది నిలువ చేస్తూ ఖండాంతరాలకు సరఫరాకు చేస్తున్న విధానాలు మంచివేనా అనేది సమీక్షించుకోవడం మంచిది. 'బిగ్ ఫామ్స్ మేక్ బిగ్ ఫ్లూ' అనే వాదన కొట్టిపారేయదగినది కాదు. కరోనా వైరస్ భయపెడుతున్న ఈ తరుణంలోనైనా- మానవులు విజ్ఞతతో ఆలోచించాలి.**

కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ లేదు. అందువల్ల ఈ వైరస్ విస్తరించకుండా ప్రపంచదేశాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. కరోనా వైరస్ ఉపశమించేలోగా ఎంతమందిని బలిగొంటుందో తెలువదు. కొంచెం ముందు వెనుకలుగా అంతర్జాతీయ సమాజం ఈ వైరస్ విస్తరణను అరికట్టగలుగుతుందనడంలో సందేహం లేదు. కానీ ఇంతటితో ఇటువంటి వైరస్‌ల విస్తరణ ముగుస్తుందనే భరోసా మాత్రం లేదు. వైరస్‌లు ఎప్పటికప్పుడు మార్పుచెందుతూ వ్యాక్సిన్‌లకు లొంగకుండా సవాలు చేస్తున్నవి. మానవాళిని ఏదో ఒక వైరస్ తరచూ పీడిస్తూనే ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా రాకపోకలు పెరిగిన ఈ కాలంలో వైరస్‌లు తరచూ వ్యాపించడం వల్ల ఆర్థికాది రంగాలు ఇబ్బందుల్లో పడుతున్నాయి. 2003లో సార్స్ బెదరగొట్టింది. 2005లో బర్డ్ ఫ్లూ వచ్చింది. ఎబోలా, స్వైన్‌ఫ్లూ, నిపా వైరస్– ఈ విధంగా ఏదో రూపంలో దాడులు సాగుతూనే ఉన్నాయి. వ్యాధులకు వ్యాక్సిన్‌లు, మందులు వాడటానికి ఒక హద్దు ఉన్నది. యాంటీ బయాటిక్స్ అధికంగా వాడటం వల్ల చివరికి బ్యాక్టీరియా మందులకు లొంగకుండా మొండిగా మారిపోయింది. ఇప్పుడు వైరస్ తనను తాను మార్చుకుంటూ కొత్త రూపాలలో వచ్చి దెబ్బకొడుతున్నది. ముమ్మందు ఇదే కరోనా వైరస్ మార్పు చెంది మరింత ఉగ్రరూపంలో దాడిచేసినా ఆశ్చర్యం లేదు.

ఈ మహమ్మారులను అరికట్టే విషయమై వైద్యరంగానికే పరిమితమై ఆలోచించకూడదు. వైద్యరంగానికి బయట తాత్విక దృష్టితో పరిష్కారాన్ని సాధించాలి. ఆహారతయారీ, రవాణా, నిలువ మొదలైన విధానాల్లో అనుసరిస్తున్న వికృత పోకడలే భిన్న వ్యాధులు ప్రబలడానికి కారణమనే అభిప్రాయం ఉన్నది. 1980 దశకంలో ఆవులకు శాకాహారం కాకుండా, ఎముకలు, మాంసాన్ని నుజ్జు చేసి ఆహారంగా అందించడం 'మాడ్ కౌ' వ్యాధి జనించడానికి కారణమైంది. ఆవుల నాడీ వ్యవస్థ దెబ్బతిని చివరకు అది మానవులకూ శాపంగా పరిణమించింది. అమెరికా సరిహద్దులోని మెక్సికో ప్రాంతంలో ఒక ఆహార కంపెనీ భారీ కబేళాను ఏర్పాటుచేసింది. భారీ ఎత్తున పందులను వధించి, మాంసాన్ని ఎగుమతి చేస్తున్నది. ఆ పందుల అవశేషాలను గుట్టలుగుట్టలుగా పడివేయడంతో, ఆహారం కోసం పక్షులు వచ్చిచేరాయి. పక్షులు, పందుల నుంచి వచ్చిన వైరస్ కొత్త రూపంతో మానవులకు సంక్రమించింది. ఈ విధంగా 2009లో మొదలైన స్వైన్ ఫ్లూ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని బలిగొన్నది. భారీ ఫామ్‌లలో హృదయవిదారక పరిస్థితులలో జంతువులను, పక్షులను బంధించి వధిస్తున్న తీరు పట్ల తీవ్ర విమర్శలున్నాయి. ఆహారాన్ని నెలల కొద్ది నిలువ చేస్తూ ఖండాంతరాలకు సరఫరాకు చేస్తున్న విధానాలు మంచివేనా అనేది సమీక్షించుకోవడం మంచిది. 'బిగ్ ఫామ్స్ మేక్ బిగ్ ఫ్లూ' అనే వాదన కొట్టిపారేయదగినది కాదు. కరోనా వైరస్ భయపెడుతున్న ఈ తరుణంలోనైనా– మానవులు విజ్ఞతతో ఆలోచించాలి. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా వ్యవహరించకూడదనే, జంతువుల పట్ల కారుణ్యం చూపాలనే వాదనలను కూడా పట్టించుకోవాలి.

### జనగళం

#### వదంతులను నమ్మవద్దు

చికెన్ తింటే కరోనా వైరస్ సోకుతుందనే వదంతులతో చికెన్ అమ్మకాలు పడిపోయాయి. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి వదంతులను నమ్మవద్దని ఇప్పటికే రాష్ట్ర ఆరోగ్యశాఖ శాఖ ప్రకటించింది. కరోనా వైరస్ వ్యాపించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకున్నాయి. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దు.

**- పాశం రమేశ్, రంగారెడ్డి జిల్లా**

#### నీటిని పొదుపు చేద్దాం

నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ గురించి ప్రభుత్వాలే కాదు ప్రజలుగా మన బాధ్యతను సరిగా నిర్వర్తించాలి. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలి. నీటి వృథాను అరికట్టాలి. పచ్చని చెట్లతోనే మనకు స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. వీటివల్ల మానవాళికి అనేక ప్రయోజనాలున్నాయి. ఇవి ఎవరో చెప్పాల్సిన పని లేదు. నీటి పొదుపు, చెట్ల పరిరక్షణ అనేది అందరి జీవితంలో భాగం కావాలి. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సఫలమౌతాయి.

**- పడాల సతీశ్, సిరిసిల్ల**

#### ప్రతిపక్ష నేతల తీరు హాస్యాస్పదం

పంటలకు మద్దతు ధర విషయం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. ఇది ప్రతిపక్ష నేతలకు తెలియంది కాదు. కానీ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయాలనే ఉద్దేశంతోనే కంది రైతుల గురించి ప్రతిపక్ష నేతలు మాట్లాడటం హాస్యాస్పదం. కేంద్ర ప్రభుత్వం కందులకు ప్రకటించిన మద్దతు ధరకు, వాస్తవంగా మార్కెట్లో అమ్ముడుపోతున్న ధరకు పొంతన కుదరడం లేదు. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి ఇప్పటికే వివరించారు. ప్రతిపక్షనేతలు సమస్యకు కారణమైన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదు. అలాగే కంది రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది. ప్రతిపక్ష నేతలు కూడా రాజకీయాలకు అతీతంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అప్పుడే కంది రైతులకు న్యాయం జరుగుతుందనడంలో సందేహం లేదు.

**- మాటూరి శ్రీనివాస్, మహబూబ్‌నగర్**

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ముక్తసరి



**దేవులపల్లి ప్రభాకరరావు**

# వచ్చిండు, పోయిండు

కశ్మీర్ వివాదంపై మధ్యవర్తిత్వం జరుపడానికి రెడీ అని మోదీజీ దోస్తు ట్రంప్ పదేపదే అంటున్నారు. భారతదేశానికి ట్రంప్ అసలైన, సిసలైన మిత్రుడని మోదీజీ పదేపదే అంటున్నారు. 1954లో ఈ దేశం వచ్చినప్పుడు కృశ్చేవ్, బుల్గానిన్ స్వయంగా కశ్మీర్ వెళ్లి 'కశ్మీర్ భారతదేశ అంతర్భాగం' అని సూటిగా ప్రకటించారు. ఎవరు అసలైన మిత్రులు?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సతీసమేతంగా, కూతురు, అల్లుడు కూడా వెంటరాగా ఇండియా వచ్చిండు, పోయిండు –ఇచ్చింది లేదు, తీసుకపోయిందే ఎక్కువ. రెండురోజుల హంగామా (2020 ఫిబ్రవరి 24, 25) క్షణాల్లో ముగిసింది. ఈ రెండురోజుల హంగామాలో ఈ దేశ ప్రజలకు, మొత్తం ప్రపంచానికి ప్రధానంగా కనిపించింది ట్రంప్–మోదీ దోస్తీ. వారిద్దరు రెండుదేశాల అధినేతల వలె, నాలుగేండ్ల నుంచి మాత్రమే పరిచయం ఉన్న వ్యక్తుల వలెగాక బాల్య మిత్రుల వలె, చిన్నప్పుడు గోలీలు, చిర్రగోనె, గుడుగుడు (చెడుగుడు) ఆడుకున్న, తరగతిలో ఒకే బెంచిమీద నిక్కర్లు తొడుక్కుని కూర్చున్న జిగ్రీ దోస్తుల వలె, లంగోటీయార్ల వలె ఈ రెండురోజులు అశోక్‌కుమార్, అమితాబ్‌బచ్చన్ వంటి మేటి నటులు సైతం తలవంచే నటనా నైపుణాన్ని ప్రదర్శించారన్నది అభిజ్ఞుల నిశ్చితాభిప్రాయం. ఈ ఇద్దరు అధినేతల ఆలింగనాలను, ప్రేమానురాగాలను, పరస్పర ప్రశంసలను పరికిస్తున్నప్పుడు, వింటున్నప్పుడు 'మామిడిచెట్టును అల్లుకున్నది మాధవి లత ఒకటి, ఏమా రెండిటి ప్రేమా సంపద ఇంతింతన లేము...' అన్న అలనాటి భావగీతం యాదికొస్తున్నది. దాదాపు వందేండ్ల కిందట ఒక ప్రసిద్ధ భావకవి రచించిన ఈ గీతం ప్రేమ గీతమే.

మొగలు చక్రవర్తి షాజహాన్ (అయోధ్యలో మసీదు కట్టించిన బాబర్‌ముని మనుమడు–నాలుగవతరం వాడు) తన ప్రేయసి ముంతాజ్ స్మారక చిహ్నంగా ఆగ్రాలో, యమునా నదీతీరంలో నలభై రెండు ఎకరాల నందనోద్యానం మధ్య 17వ శతాబ్దం ప్రారంభంలో తాజ్‌మహల్‌ను నిర్మించాడు. క్రీ.శ. 1632లో ప్రారంభమై తాజ్‌మహల్ నిర్మాణం ఇరువై ఏండ్లు కొనసాగి క్రీ.శ.1653లో పూర్తయింది. దాదాపు నాలుగు వందల ఏండ్ల కిందట, భారతీయ సంస్కృతీ వైవిధ్యానికి సౌందర్య నీరాజనంగా నిర్మితమైన తాజ్‌మహల్ ప్రపంచంలోని అద్భుతాల్లో ఒకటిగా నేటికీ సామాన్యులను, అసామాన్యులను, సౌందర్య ఆరాధకులను, ధన ఆరాధకులను, అందరిని సమానంగా ఆకర్షిస్తున్నది; తన అధ్యక్ష పదవి ఎనిమిదేండ్ల కాలంలో రెండుసార్లు (2010 లో, 2015లో) ఈ దేశం వచ్చి తాజ్‌మహల్ అందాలను తనివితీర ఆస్వాదించిన బరాక్ హుస్సేన్ ఒబామా తన పిల్లలు పరీక్షల కారణంగా ఇండియా రాలేకపోయారని, తాజ్‌మహల్‌ను చూడాలన్నవాళ్ల కోరిక నెరవేరలేదని బాధపడ్డాడు.

ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ మొన్న టి రెండురోజుల ముప్పై ఆరు గంటల పర్యటనలో సబర్మతి గాంధీజీ ఆశ్రమంలో గడిపింది కేవలం 15 నిమిషాలే! ఆ 15 నిమిషాల్లో ట్రంప్‌కు గాంధీజీ జ్ఞాపకం రాలేదు– మోదీజీ తనకు జరుపుతున్న అతిథి మర్యాదల్లో ఒళ్లు మరిచిన ట్రంప్‌కు ఇంకేదీ జ్ఞాపకం రాకపోవడంలో వింత లేదు–ప్రపంచంలోనే అన్నిటికంటే పెద్ద ఆడిటోరియంగా ప్రచారం పొందుతు న్న స్థలంలో లక్ష చిల్లరసభలో (అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి సబర్మతి ఆశ్రమం వరకు, ఆడిటోరియం వరకు కొన్ని మిలియన్ల మంది తనకు స్వాగతం పలుకుతారని మోదీ జీ అన్నట్లు ట్రంప్ వెల్లడించారు). మొన్న మిలియన్లు రాలేదు. ఇండియాలోనే మిలియన్ల మంది అప్రయత్నంగా, స్వచ్ఛందంగా వచ్చిన సంఘటనలున్నాయి. కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర సమితి ఏ సభకైనా కనీసం కొన్నిలక్షల మంది రావడం సాధారణ విషయం. జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో, 1954లో, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నికిటాకృశ్చేవ్, అప్పటి సోవియట్ ప్రధానమంత్రి బుల్గానిన్ ఇండియా వచ్చారు. అప్పుడు ఎటువంటి ప్రయత్నం లేకుండా, స్వచ్ఛందంగా మిలియన్ల సంఖ్యలో ఈ దేశ ప్రజ లు ఆ ఇద్దరు కమ్యూనిస్టు నాయకులకు ఘన స్వాగతం పలికిన యదార్థం జగద్విదితం. కశ్మీర్ వివాదంపై మధ్యవర్తిత్వం జరుపడానికి రెడీ అని మోదీ జీ దోస్తు ట్రంప్ పదేపదే అంటున్నారు. భారతదేశానికి ట్రంప్ అసలైన, సిసలైన మిత్రుడని మోదీజీ పదేపదే అంటున్నారు. 1954లో ఈ దేశం వచ్చినప్పుడు కృశ్చేవ్, బుల్గానిన్ స్వయంగా కశ్మీర్ వెళ్లి 'కశ్మీర్ భారతదేశ అంతర్భాగం' అని సూటిగా ప్రకటించారు. ఎవరు అసలైన మిత్రులు?

అహ్మదాబాద్ సబర్మతి ఆశ్రమంలో 15 నిమిషాలు గడిపిన పిదప ట్రంప్‌నకు ఆ ఆశ్రమం నుంచి (1915లో దక్షిణాఫ్రికా నుంచి స్వదేశం రాగానే గాంధీజీకి సత్యాగ్రహ కేంద్రంగా సబర్మతి ఆశ్రమం స్థాపన ఆలోచన అంకురించింది) భారత స్వాతంత్ర్య ఉద్యమానికి సారథ్యం వహించిన గాంధీజీ జ్ఞాపకం రాలేదు; తర్వాత, సర్దార్ పటేల్ ఆడిటోరియంలో ఇరువై ఐదు నిమిషాలు తప్పుల తడక ప్రసంగం చేసిన ట్రంప్ లక్ష చిల్లర మందిని చూసి ముగ్ధుడైనాడు, తన మిత్రుడు మోదీజీని మెచ్చుకున్నాడు. కానీ ట్రంప్‌నకు సర్దార్ పటేల్ జ్ఞాపకం రాలేదు. భూగోళం, చరిత్ర, సారస్వతం, సంస్కృతి, ఉద్యమాలు, రాజకీయాలు, వర్తమాన విషయాలేవీ తెలియని ట్రంప్‌నకు గాంధీజీ, సర్దార్‌పటేల్ ఎందుకు జ్ఞాపకం వస్తారు? 70 ఏండ్ల భారత ప్రగతి గురించి ప్రస్తావించిన ట్రంప్‌నకు జవహర్‌లాల్ నెహ్రూ ఎందుకు జ్ఞాపకం వస్తాడు? మోదీజీ ఆవహించిన ట్రంప్‌నకు ఈ దేశం చరిత్ర ప్రాచీనమైనదన్న సంగతి తెలియదనుకోవాలె! కనీ సం మోదీజీ ప్రభుత్వ విదేశాంగశాఖ వారైనా, అమెరికాలోని భారత రాయబారి అయినా, అమెరికాలో గత సెప్టెంబర్‌లో హౌడీ–మోదీ ప్రచార కార్యక్రమం ఏర్పాటుచేసిన వారైనా ట్రంప్‌నకు భారత చరిత్ర గురించి చెప్పవలసింది–ఒక రియల్ ఎస్టేట్ వర్తకుడికి భారత చరిత్ర తెలుస్తుందనుకోలేం. యూఎస్‌ఏ రాజకీయాలు, చరిత్రతోనైనా ఎన్నడూ సంబంధం లేని వర్తక శిఖామణి ట్రంప్.

ఈ దేశానికి, ముఖ్యంగా స్వతంత్ర భారత దేశానికి విదేశీ అధినేతలు, ప్రముఖులు రావడం ఇది మొదటిసారి కాదు–చివరిసారి కాబోదు. రెండవ ప్రపంచయుద్ధం చివరి దశలో–1942లో యూఎస్‌ఏలో అధ్యక్షుడు రూజ్‌వెల్ట్. గాంధీజీ సారథ్యంలోని భారత స్వాతంత్ర్య ఉద్యమానికి అండగా నిలిచినవాడు, భారత స్వాతంత్ర్యం కోసం అప్పటి బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌పై ఒత్తిడి తెచ్చినవాడు రూజ్‌వెల్ట్. స్వతంత్ర భారతానికి వచ్చిన మొదటి అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ రెండవ ప్రపంచయుద్ధంతో గొప్ప సేనానిగా ప్రసిద్ధి పొందాడు. ఒబామా గాంధేయవాది. ఇండియన్ పార్లమెంటులో ప్రసంగిస్తూ ఒబామా మొదట గాంధీజీకి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించాడు. తన నేటి ఉన్నత స్థానానికి గాంధీ సిద్ధాంతాలు దోహదపడ్డాయని ఆఫ్రికన్–అమెరికన్ ఒబామా భారత పార్లమెంటులో ప్రకటించడం విశేషం. ఒబామా భారతదేశానికి అప్పుడు వీడ్కోలు పలుకుతూ భారత రాజ్యాంగంలోని సమానత్వహక్కుల గురించి జ్ఞాపకం చేశాడు. మత సామర స్యం కొరవడితే ఈ దేశానికి ప్రమాదం తప్పదని ఆ రోజే ఆయన చేసిన హెచ్చరిక గమనార్హమైనది.

సబర్మతి ఆశ్రమానికి మోదీజీ స్వయంగా వెంట ఉండి తోడ్కొని వచ్చినవారు కమ్యూనిస్టు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇజ్రాయెల్ ప్రధాని, జపాన్ ప్రధాని, ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. వీరెవరూ అహింసావాదులు కారు, శాంతిప్రియులు కారు, సత్యాన్వేషకులు కారు. అందువల్ల, గాంధీజీ నడిచిన, జీవించిన ఈ స్థలం అపవిత్రమైందని, శుద్ధి అవసరమని భావించేవారున్నారు. గాంధీజీ ఇదే ఆశ్రమం నుంచి ఉప్పు సత్యాగ్రహం వంటి మహత్తర సత్యాగ్రహ కార్యక్రమాలను నిర్వహించారు. గాంధీజీతో పాటు ఇదే స్థలంలో ఆయనను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన ప్రపంచ ప్రసిద్ధ పత్రికా రచయితలు లూయిఫిషర్, జాన్ గంధర్, విన్సెంట్‌షీన్ వంటివా రు నడిచారు. ఇది అబద్ధ ప్రకటనలు వెలువడిన చోటు కాదు.

ఇక్కడే పటేల్ స్టేడియంలో ప్రసంగిస్తూ ట్రంప్ ఇస్లామిక్ టెర్రరిజానికి వ్యతిరేకంగా గొంతెత్తారు. ఒకవంక కరడుగట్టిన మతోన్మాదులు తాలిబాన్లతో రాజీ ఒప్పందం కోసం పాకిస్థాన్ సహాయంతో ప్రయత్నిస్తున్న ట్రంప్ సబర్మతి నేలపై అబద్ధాలాడటం సమంజసం కాదు. ట్రంప్ వచ్చిండు, పోయిండు–తీసుక పోయిండు గానీ ఇచ్చిందే మీ లేదు. బ్రిటిష్ పాలకులు రెండు వందల ఏండ్లలో చేసింది ట్రంప్ రెం డురోజుల్లో చేయగలిగాడు. రెండు రోజుల ట్రంప్ యాత్రను విశ్లేషిస్తూ యాదగిరి 'ఇది నా ఎన్ను నువు గోకు, నీ ఎన్ను నేను గోకుతా కార్యక్ర మం' అని అన్నాడు. మరింత సూటిగా చెప్పాలంటే ఇది స్వీయమర్దనం, పరస్పర మర్దనం, విహారయాత్ర. ఈ సంవత్సరం నవంబర్‌లో మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయనున్న ట్రంప్, 'అమెరికా అమెరికన్లదే' అన్న సంకుచిత నినాదంతో ఒకసారి గెలిచిన, మరోసారి గెలువాలనుకుంటున్న ట్రంప్ భారతదేశానికి ఏదో ఇచ్చిపోతాడనుకోవడం పొరపాటు. ఎన్నికల్లో గెలువడం కోసమే ట్రంప్ అమెరికాలోని భారతీయుల హక్కుల గురించి (హెచ్–1 వీసా తదితర హక్కులు) కచ్చితంగా ఏమీ మాట్లాడలేదు.

**సబర్మతి ఆశ్రమానికి మోదీజీ స్వయంగా వెంట ఉండి తోడ్కొని వచ్చినవారు కమ్యూనిస్టు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇజ్రాయెల్ ప్రధాని, జపాన్ ప్రధాని, ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. వీరెవరూ అహింసావాదులు కారు, శాంతిప్రియులు కారు, సత్యాన్వేషకులు కారు. అందువల్ల, గాంధీజీ నడిచిన, జీవించిన ఈ స్థలం అపవిత్రమైందని, శుద్ధి అవసరమని భావించేవారున్నారు. గాంధీజీ ఇదే ఆశ్రమం నుంచి ఉప్పు సత్యాగ్రహం వంటి మహత్తర సత్యాగ్రహ కార్యక్రమాలను నిర్వహించారు.**

# రైతు బంధువుకు పట్టం

విశ్లేషణ



**ప్రొఫెసర్ తాటికొండ రమేష్**

రాష్ట్రంలో సహకార సంఘాల ఎన్నికలు ముగిశాయి. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతు ప్రభుత్వంగా మన్ననలు పొందుతున్న టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులను రైతాంగం గెలిపించింది. దీంతో మరోసారి తాము టీఆర్‌ఎస్ వైపు ఉన్నామని చాటిచెప్పారు. రైతు సమస్యలను ఏనాడూ పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెపుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులకు అఖండ విజయాన్ని కట్టబెట్టారు. పలుచోట్ల పోటీకి అభ్యర్థు లే దొరుకని పరిస్థితుల్లో ప్రతిపక్షాల ఉనికే మసకబారే పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో ఉన్న 904 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు గాను 136 సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి. ప్రజలు తెలంగాణ ప్రభుత్వం పట్ల, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ఈ ఎన్నికల ద్వారా ప్రకటించారు. మొత్తంగా 904కు గాను 91 శాతం 824 టీఆర్‌ఎస్ గెలుచుకోవటం గమనార్హం. ప్రతిపక్ష కాంగ్రెస్ 6 శాతం (52), కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఒక శాతం (7) స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగాయి. టీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగే జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ), జిల్లా సహ కార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) డైరెక్టర్ల పదవుల్లోనూ పోటీలేకుండా 180కి 146 గెలుచుకున్నది. ఇక చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక లాంఛనమే. వీటితోపాటు మార్చి 5న జరిగే తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌ను సైతం టీఆర్‌ఎస్ గెలుచుకోవడం తథ్యం.

టీఆర్‌ఎస్‌కు ఈ అద్భుత విజయం సునాయాసంగా దక్కలేదు. దీని వెనుక ప్రభుత్వ కఠిన శ్రమ, నిబద్ధత ఉన్నాయి. వ్యవసాయరంగం పట్ల, జలవనరులు, భూగర్భ జలవనరుల పట్ల, రైతులకు కావాల్సిన మౌలిక వసతుల పట్ల చూపిన శ్రద్ధ రైతాంగం ఇచ్చిన తీర్పులో కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో 4 సీట్లు గెలువగానే బీజేపీ, మూడు సీట్లు గెలువగానే కాంగ్రెస్ వాపును చూసి బలుపనుకున్నాయి. ఈ క్రమంలో వారు చేసే తప్పుడు, మోసపూరిత ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టారు. దీనికి నిదర్శనంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లోని 106లో 105 సహకార సంఘాల్లో అద్వితీయమైన విజయాన్ని టీఆర్‌ఎస్ పార్టీకి కట్టబెట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 113కు 105 స్థానాల్లో టీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టారు. అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లా లోని 55 స్థానాలకు గాను 52 గెలిపించారు. ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లా లో 96కు 83 స్థానాల్లో గెలిపించారు.

గ్రామ సీమలు సుభిక్షంగా, స్వయం పోషకంగా ఉండాలంటే వ్యవసాయ రంగం, పశుపోషణ, దానికి అనుబంధమైన వివిధ వృత్తులు సమాంతరంగా అభివృద్ధి చెందాలి. ఈ సత్యాన్ని ఆకళింపు చేసుకున్న సీఎం కేసీఆర్ తనదైన శైలిలో వినూత్న పథకాలకు రూపకల్పన చేశారు. దుక్కి దున్నింది మొదలు పంట అమ్మే దాకా రైతాంగానికి తామున్నామనే భరోసా ఇచ్చేలా ప్రభుత్వం వ్యవహరించింది. రైతులకు పెట్టుబడిగా, ఎకరాకు ఏడాదికి రూ.10 వేలు ఇస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచింది. దీంతో రైతులకు పెట్టుబడి బాధలు తప్పాయి. బ్యాంకుల ద్వారా వ్యవసాయానికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేశారు. రైతులు తమ రుణాలు తిరిగి చెల్లించలేని స్థితిలో గరిష్ఠంగా లక్ష వరకు రుణమాఫీ చేశారు. సకాలంలో రైతులకు మార్క్‌ఫెడ్ ద్వారా 40 శాతం సబ్సిడీతో ఎరువులు అందేలా చర్యలు చేపట్టారు. 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తూ తెలంగాణ రైతాంగాన్ని ఆదుకున్నారు. ఈ విధంగా కేసీఆర్ నాయకత్వంలో సాగునీటి కష్టాలు తీరాయి. మిషన్‌కాకతీయ ద్వారా గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ జరిగింది. పూడికతీత కారణంగా చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. భూగర్భజలాలు సైతం పెరిగి బావులు, బోర్లలో నీరు పుష్కలంగా లభిస్తున్నది. దీంతో రైతన్న కష్టాలు సగం తీరాయి. తెలంగాణ వరప్రదాయినిగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. వృథాగా సముద్రంలో కలిసే నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా రాష్ట్రం మొత్తం గోదావరి నీళ్లు అందిస్తున్నారు.

పంట పండటం ఒక ఎత్తయితే దానిని గిట్టుబాటు ధరకు అమ్ముకోవ టం మరో ఎత్తు. పండిన పంటకు మద్దతు ధర వచ్చినప్పుడే రైతు లాభపడేది. రాష్ట్రంలో ఆహారపంటలతో పాటు, వాణిజ్య పంటలైన పత్తి, పసుపు ఉత్పత్తి కూడా ఎక్కువ. వీటి ధరలను కేంద్రం నిర్ణయిస్తుంది. ఈ విధంగా నిర్ణయించబడిన ధర అయినా రైతులకు లభిస్తున్నదా అంటే అదీ లేదు. దళారుల దోపిడీకి రైతు బలవుతున్నాడు. మద్దతు ధర అనేది ఒక మిథ్యగా మారింది. గతంలో దళారులు రైతుల దగ్గరపంటలు కొని వాటి ని అధిక ధరకు మార్కెట్లో అమ్ముకునేవారు. అలా జరుగకుండా ప్రాథ మిక వ్యవసాయ సంఘాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. రైతు సమన్వయ సమితులు ఏర్పాటుచేసి విత్తనం నాటిన నుంచి విక్రయం దాకా రైతాంగానికి అండగా ఉండేవిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చిదిద్దారు. ముఖ్యంగా రైతులకు పంటల్లో సహాయార్థం వ్యవసాయ విస్తరణాధికారులను నియమించారు. పంట మార్పిడి, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కలిగింది. తద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతున్నది. వ్యవసాయ అనుబంధ వృత్తులను కూడా ప్రోత్సహిస్తూ పశువుల పంపిణీ, చేపల పంపిణీ, గొర్రెల పంపిణీ వంటివి చేయడం, సబ్సిడీపై వారికి రుణాలివ్వడం వంటి చర్యలు ఫలితాన్నివ్వడం చూస్తున్నాం.

కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేంద్రంతో పాటు, చాలా రాష్ట్రాలు ఆదర్శమైనవిగా గుర్తించినప్పటికీ వాటిని అమలుచేయలేకపోతున్నాయి. కేసీఆర్ అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయ సహకార సంఘాలు మరింతగా బలోపేతమయ్యాయి. నీటిపారుదల ప్రాజెక్టులు, నాణ్యమైన కరెంటు, రైతు సమన్వయ సమితులు ఇవన్నీ కూడా సమ్మిళిత అభివృద్ధికి ఉపయుక్తంగా మారాయి. తెలంగాణ సమాజంలో పేరుకుపోయిన అనేక సమస్యలు, రుగ్మతలను సామాజిక వైద్యుడిలా నిర్మూలించడానికి కేసీఆర్ చేసిన చేస్తున్న కృషి అద్వితీయం. తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం ఒక సోషల్ ఇంజినీర్‌గా కృషిచేస్తున్నారు. తెలంగాణలో ఎన్నిక ఏదైనా ప్రజలు కేసీఆర్‌కు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. అందుకే ఆయనను రైతుబంధువుగా, రైతుసారథిగా అక్కున చేర్చుకుంటున్నది మన తెలంగాణ సమాజం.

**(వ్యాసకర్త: డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్, కేయూ)**

**కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేంద్రంతో పాటు, చాలా రాష్ట్రాలు ఆదర్శమైనవిగా గుర్తించినప్పటికీ వాటిని అమలుచేయలేకపోతున్నాయి. కేసీఆర్ అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయ సహకార సంఘాలు మరింతగా బలోపేతమయ్యాయి. నీటిపారుదల ప్రాజెక్టులు, నాణ్యమైన కరెంటు, రైతు సమన్వయ సమితులు ఇవన్నీ కూడా సమ్మిళిత అభివృద్ధికి ఉపయుక్తంగా మారాయి. తెలంగాణ సమాజంలో పేరుకుపో యిన అనేక సమస్యలు, రుగ్మతలను సామాజిక వైద్యుడిలా నిర్మూలించడానికి కేసీఆర్ చేసిన చేస్తున్న కృషి అద్వితీయం.**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com



పట్టణప్రగతిలో భాగంగా కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని ఓ కాలనీలో మట్టి ఎత్తిపోస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ ఎంవీ రెడ్డి



జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

## పారపట్టిన స్పీకర్ పోచారం

**పట్టణప్రగతిలో** భాగంగా కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని నాలుగో వార్డులో కలెక్టర్ శరత్‌తో కలిసి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఓ డ్రైనేజీవద్ద స్వయంగా పారపట్టి మురికిని తీశారు. అనంతరం వార్డులో ఏర్పాటుచేసిన సమావేశంలో పోచారం మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బాన్సువాడలో కొంత మంది డబుల్ బెడ్‌రూం ఇండ్లు పొందాలనే ఉద్దేశంతో దొంగ పట్టాలను తయారు చేశారని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.





రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో కూరగాయల మార్కెట్‌ను సందర్శిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో డ్రైనేజీని పరిశీలించి కౌన్సిలర్‌తో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ



మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

# పట్టణానికి కొత్తరూపు

### పరిశుభ్రంగా వార్డులు, డివిజన్లు.. ఐదోరోజూ జోరుగా పట్టణప్రగతి

### పాల్గొంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

**నమస్తేతెలంగాణ, నెట్‌వర్క్:** పట్టణప్రగతి జోరుగా సాగుతున్నది. ఐదో రోజైన శుక్రవారం మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మురుగుకాల్వలు, రోడ్లను శుభ్రం చేయించారు. పారిశుద్ధ్య పనులతోపాటు, పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రజలకు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. వార్డుల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. పట్టణప్రగతితో వార్డులు, డివిజన్ల రూపురేఖలు మారుతున్నాయి.

**మంత్రి ఆదేశాలతో కదిలిన అధికారులు**

ఆర్థిక శాఖ మంత్రి టీ హరీశ్‌రావు ఆదేశాలకు విద్యుత్ అధికారులు స్పందించారు. పట్టణ ప్రగతిలో భాగంగా ఈనెల 24న మంత్రి సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని 8వ వార్డులో పర్యటించారు. నారాయణరెడ్డి కాలనీలో ఇండ్లపైనుంచి వెళ్తున్న 33 కేవీ, 11 కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని స్థానికులు విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి ఆ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం నారాయణరెడ్డి కాలనీకి వెళ్లిన అధికారులు విద్యుత్ తీగలను సరిచేసే పనులను ప్రారంభించారు.

### భీమ్‌గల్‌లో మంత్రి వేముల..

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటించారు. పలువురు వృద్ధులు మంత్రి వద్దకు వచ్చి ఆప్యాయంగా పలుకరించగా.. ప్రశాంత్‌రెడ్డి వారి యోగక్షేమాలు అడిగారు. తమకు పింఛన్ రావడం లేదని కొందరు మహిళలు, వృద్ధులు మంత్రికి విన్నవించారు. అర్హులైన వారికి పింఛన్ అందేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

### 82లక్షలు మంజూరు: మంత్రి అల్లోల

నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్, శ్రీనగర్ కాలనీల్లో పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటించారు. వార్డుల్లో తిరిగి మురికి కాల్వలను శుభ్రం చేయించారు. శ్రీనగర్‌కాలనీలోని హనుమాన్ ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. పట్టణ ప్రగతి కింద నిర్మల్ మున్సిపాలిటీకి రూ.82 లక్షలు మంజూరైనట్టు తెలిపారు.

### కొత్తగూడెంలో మంత్రి పువ్వాడ..

పట్టణప్రగతిలో భాగంగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినసభలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. పట్టణప్రగతి నిరంతర ప్రక్రియ అని, ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను కోరారు. మంత్రి వెంట కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ ఎంవీ రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో పాదయాత్ర సందర్భంగా వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

### అభివృద్ధి బాటలో పట్టణాలు: కొప్పుల

జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో నిర్వహించిన పట్టణప్రగతిలో స్థానిక ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీ అధ్యక్షురాలు దావ వసంత, కలెక్టర్ రవితో కలిసి ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. పల్లె ప్రగతితో గ్రామాలను అభివృద్ధి బాటలోకి తీసుకొచ్చామని, పట్టణ ప్రగతిలో పట్టణాలను సైతం అభివృద్ధి చేస్తున్నట్టు మంత్రి తెలిపారు.

### పీర్జాదిగూడలో మంత్రి మల్లారెడ్డి..

మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాల్గో డివిజన్‌లో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి.. జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కలెక్టర్, మేయర్ జక్క వెంకట్‌రెడ్డితో కలిసి పర్యటించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పట్టణప్రగతితో నగరాలు, పట్టణాలు కొత్తరూపు సంతరించుకుంటున్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు.

### సీఎం సంకల్పంతోనే: సబితారెడ్డి

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పట్టణంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి తదితరులతో కలిసి విద్యాశాఖ మంత్రి పీ సబితాఇంద్రారెడ్డి పట్టణ ప్రగతిలో పాల్గొన్నారు. కూరగాయల మార్కెట్‌లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురికి కాల్వలను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ పట్టణ ప్రగతికి శ్రీకారం చుట్టారన్నారు.

### ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పట్టణ ప్రగతి పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బిల్‌కలెక్టర్ ఆహ్మద్, జవాన్ విశ్వనాథంను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ సురేందర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## పురాతన వెండి నాణేలు లభ్యం

**వడ్డేపల్లి:** జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం కోయిలదిన్నెలో 15 పురాతన వెండినాణేలు బయటపడ్డాయి. కోయిలదిన్నెకు చెందిన రామచంద్రారెడ్డి తనపాత ఇంటిని జేసీబీతో పడగొడుతుండగా పునాదుల్లో ఉన్న కుండలో వెండినాణేలు బయటపడ్డాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో పోలీసులకు అక్కడికి చేరుకొని నాణేలను స్వాధీనం చేసుకున్నారు.



లభించిన వెండి నాణేలు

## అత్తకు సేవ చేయలేక..

### అంతమొందించిన కోడలు

### హత్యకేసును ఛేదించిన పోలీసులు

**మద్దూరు:** మంచానికే పరిమితమైన అత్తకు సపర్యలు చేయాల్సి వస్తున్నదని భావించిన కోడలే ఆమెను హతమార్చింది. నెల రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఏసీపీ మహేందర్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం ధూళ్మిట్టకు చెందిన పులి కనకయ్య, తన తల్లి బొందవ్వ(70), భార్య సువర్ణ, కూతురు ప్రియాంకతో కలిసి ఉంటున్నాడు. బొందవ్వ అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. కోడలు సువర్ణ ఆమెకు సపర్యలు చేస్తున్నది. ఈ క్రమంలో అత్తకు సేవచేయడం ఇష్టం లేక ఆమెను హతమార్చాలని కోడలు పథకం రచించింది. జనవరి 11న బొందవ్వ ముఖంపై దిండు పెట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్యచేసింది. కూతురు ప్రియాంకతో(19) కలిసి మృతదేహాన్ని గోనె సంచిలో పెట్టి గ్రామంలోని ఓ పాడుబడ్డ బావిలో పడేసింది. అనంతరం తన అత్త కనిపించడం లేదంటూ గతనెల 13న భర్తతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి జనవరి 21న ధూళ్మిట్ట సమీపంలో పాడుబడిన వ్యవసాయబావిలో బొందవ్వ మృతదేహాన్ని గుర్తించారు. ఆమె హత్యకు గురైనట్టు నిర్ధారించుకొని ఆ దిశగా విచారణ చేపట్టారు. సువర్ణే హత్యచేసినట్టు అనుమానించిన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరం ఒప్పుకున్నది. దీంతో సువర్ణను పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కూతురు ప్రియాంకపైనా కేసు నమోదుచేశారు.

# వేములవాడ రూపురేఖలు మారుస్తాం

- సీఎం కేసీఆర్ ఆలోచనలు అమలు : వీటీడీఏ వైస్‌చైర్మన్ కృష్ణభాస్కర్
- వీటీడీఏ వైస్‌చైర్మన్, సీఈవోగా బాధ్యతల స్వీకరణ
- 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ

**సిరిసిల్ల/వేములవాడ నమస్తే తెలంగాణ:** వేములవాడ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని వీటీడీఏ (వేములవాడ పట్టణ ప్రాధికార సంస్థ) వైస్‌చైర్మన్, సీఈవోగా నియమితులైన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో వీటీడీఏ కార్యకలాపాలపై అధికారులతో సమీక్షిస్తానన్నారు. వీటీడీఏ వైస్‌చైర్మన్‌గా, సీఈవోగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూ ఇలా..

**వీటీడీఏ బాధ్యతల స్వీకరణ ఎలాంటి అనుభూతినిస్తున్నది?**

వీటీడీఏ వైస్ చైర్మన్, సీఈవో బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉన్నది. సీఎం కేసీఆర్ ఆలోచన విధానాలను పూర్తిస్థాయిలో అమలు చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాం.

**ఆలయ అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు చేపట్టనున్నారు?**

బద్దిపోశమ్మ, వేదాశ్రమం, అభివృద్ధికి, బైపాస్‌రోడ్డుకు, ప్రతిపాదనలున్నాయి. స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. టెంపుల్ టౌన్ కోసం అందరి సహకారం తప్పనిసరిగా అవసరం. వేములవాడ దేవస్థానం ఒక తిరుపతిగా మారే అవకాశమున్నది. వేములవాడ అభివృద్ధికి సీఎం కేసీఆర్ స్పష్టమైన సూచనలిచ్చారు. మాస్టార్‌ప్లాన్‌లో కూడా ప్రధాన ఆలయ ప్రాకారం ఉంటుంది. సిరిసిల్లలో కూడా కల్యాణ మండపం నిర్మించేందుకు అనుమతి వచ్చింది. అతి త్వరలోనే ఆ పనులు ప్రారంభమవుతాయి.



కృష్ణభాస్కర్

**తాగునీటి సమస్యను ఎలా అధిగమిస్తారు?**

రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా 1,100 కేఎల్ సంప్‌ను ఆలయ పరిసరాల్లో నిర్మించాం.

**దేవస్థాన పరిసర గ్రామాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

వేములవాడ పరిసర గ్రామాలను కూడా అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి చర్యలు తీసుకుంటున్నాం. వేములవాడలో పట్టణ ప్రగతి జోరందుకున్నది. పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపుతున్నారు.

**ఏమైనా నిధులు మంజూరయ్యాయా?**

ఇప్పటికే ఆలయ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం కొన్ని నిధులను మంజూరు చేసింది. వాటితో పనులు చేపట్టాం. మరికొన్ని నిధులు ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు మంజురవుతాయని ఆశిస్తున్నాం.



వనపర్తి జిల్లా పెద్దమందడి తాసిల్దార్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.
- పెద్దమందడి

# బయటకొస్తున్న రేవంత్ బాధితులు

- గోపన్‌పల్లి భూ దందాపై రెండ్రోజుల్లోనే 15 మంది ఫిర్యాదు
- దర్యాప్తు చేపట్టిన ఆర్డీవో

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి బ్రదర్స్ గోపన్‌పల్లిలో సాగించిన భూదందాపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నది. శుక్రవారం మరో తొమ్మిది మంది బాధితులు రాజేంద్రనగర్ ఆర్డీవో చంద్రకళకు ఫిర్యాదుచేశారు. వీరిలో కూకట్‌పల్లి బాలాజీనగర్‌కు చెందిన కల్లం పెరిరెడ్డి, ఆయన బంధువులు గురువారెడ్డి, వడ్డెన్నతోసహా తొమ్మిది మంది ఉన్నారు. దీంతో గత రెండ్రోజుల్లో ఫిర్యాదుచేసిన బాధితుల సంఖ్య 15కు పెరిగింది. తాము రాజోలు నియోజకవర్గం ఎస్సీ మ్యూచువల్ అల్డెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఐ రామారావు పేరిట ఉన్న భూములతోపాటు పలువురు జీపీఏ హోల్డర్ల నుంచి ప్లాట్లు, భూములు కొనుగోలుచేసి, 2013లో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నామని బాధితులు పేర్కొన్నారు. తాము కొనుగోలు చేసిన భూముల విషయంలో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 2014లో రేవంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మయ్య, శ్రీశైలం, అశోక్, రమేశ్, నర్సింహ, వారి అనుచరులు తమ భూమిని ఆక్రమించి, సరిహద్దు రాళ్లను తొలగించారని వాపోయారు. జేసీబీతో పెకిలించి, ఫెన్సింగ్‌ను విచ్ఛిన్నంచేశారని.. ఇదేమిటని ప్రశ్నిస్తే తమపై దాడికి దిగారని ఆరోపించారు. అప్పట్లో ఈ వ్యవహారంపై తాము చందానగర్ పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. తర్వాత కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకోవడంతో కేసు నమోదుచేశారని వివరించారు. రేవంత్ బ్రదర్స్ తమ భూములను ఆక్రమించడమేకాకుండా తమపైనే కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. అప్పటి ఎస్సై రమేశ్.. వీరికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. గోపన్‌పల్లి భూ వివాదంలో 15 ఫిర్యాదులు అందాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఆర్డీవో చంద్రకళ పేర్కొన్నారు.



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు



మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ఎస్సీ బాలుర ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. డైనింగ్‌హాల్‌లో విద్యార్థులకు టేబుళ్లు లేకపోవడంపై ఆరా తీశారు. వెంటనే డీడబ్ల్యూవో రాజుకు ఫోన్‌చేసి తనను కలవాలని ఆదేశించారు.
- తొర్రూరు, నమస్తే తెలంగాణ

## అమరుల త్యాగాలు చిరస్మరణీయం

### టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

**నర్సంపేట, నమస్తే తెలంగాణ:** మాదిగ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాదిగ అమరవీరుల త్యాగాలను స్మరించుకొనేందుకు ఏటా మార్చి 1న సంస్మరణ సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మార్చి 10 వరకు ప్రతి జిల్లాలో అమరవీరుల స్తూపాల వద్ద జెండాలను ఆవిష్కరించాలని కోరారు.



వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

ఓం నమః శివాయ
**శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లా**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్**
ఆర్.సి.నం.డి/132/2020 తేది: 27-02-2020 తేది: 27-02-2020
మార్కెటింగ్ శాఖ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము వేములవాడ దేవస్థానమునకు శివ కళ్యాణం, శ్రీరామ నవరాత్రుల సందర్భంగా ఆలయములో విశేష పూల అలంకరణ మరియు ఉత్సవాల సందర్భముగా తీరటిచెట్లు ఏర్పాటు చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ ప్రకటన మరియు టెండరు వివరాలు https://tender.telangana.gov.in కు లాగాన్ చేయండి. కరెంటు టెండర్స్‌పై క్లిక్ చేసి శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము ప్రొడక్టు సెలెక్టు చేయండి. తదుపరి వివరములకు 9247307754 పూజల స్టోర్ విభాగములో కార్యాలయము పని చేయు వేళలలో సంప్రదించవచ్చును.
సం/- కార్యనిర్వహణాధికారి
DIPR RO. No. 733-PP/CL/Advt/1/2019-20, Dt: 28/02/2020

తెలంగాణ ప్రభుత్వం
**గురుకులం**
తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రిజిస్ట్రర్
Rc.No. C2/0947/2020 **టెండరు ప్రకటన** తేది: 28-02-2020
2020-21 విద్యా సంవత్సరానికి నిర్ణీత ఫార్మాట్‌లో TTWRE ఇన్‌స్టిట్యూషన్లకు దిగువ ఐటమ్‌ల సరఫరా కొరకు టెండరు ఫారంలో తెలిపిన నియమ నిబంధనలపై నమోదిత సంస్థలు/ సరఫరాదార్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఐటమ్‌ల పేరు: 1) ట్రాక్ స్యూట్లు & స్పోర్ట్స్ డ్రెస్, 2) నైట్ డ్రెస్, 3) స్కూల్ బ్యాగ్‌లు, 4) 2 జతల సాక్స్‌తో స్పోర్ట్స్ షూ. టెండరు ఫారాలు/డాక్యుమెంట్లను TTWREI సొసైటీ (గురుకులం) గురుకులం బిల్డింగ్ కాంప్లెక్స్, డిఎస్ఎస్ భవనం, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ నుండి అన్ని పని రోజులలో 29-02-2020 నుండి 16-03-2020 వరకు ఉ. 11.00 గం. నుండి సా. 5.00 గం. మధ్య సెక్రటరీ, TTWREI సొసైటీ హైదరాబాద్ పేరున డిడి రూపంలో ఒక్కొక్క టెండరు కొరకు ఒక్కొక్క ఫారం కొరకు రూ. 2000/- వాపసురాని మొత్తాన్ని చెల్లించి పొందవచ్చును. అన్ని వివరాలు టెండరు డాక్యుమెంట్‌లో తెలుపబడినవి. టెండరు దాఖలుకు ఆఖరి తేది: 16-03-2020 సా.5.00 గం. వరకు. తదుపరి వివరాలకు సంప్రదించండి 9866665828 లేదా దర్శించండి. http://www.tgtwgurukulam.telangana.gov.in.
DIPR R.O. No. 731-PP/CL/Advt/1/2019-20, Dt: 28-02-2020 సం/- సెక్రటరీ (FAC) TTWREI సొసైటీ (గురుకులం)

అనుబంధం-I
తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక శాఖ
**అక్టోబర్ 30, 2019న జారీచేసిన 7.35% తెలంగాణ SDL 2054 తిరిగి జారీ**

| | |
|---|---|
| మొత్తం | : రూ. 3000.00 కోట్లు |
| జారీ ధర | : ప్రతి రూ. 10,000.00లకు రూ. 10,000.00 |
| కరెన్సీ | : 35 సంవత్సరాలు |
| రుణ దరఖాస్తు స్వీకరణ | :మొత్తం చేకూరిన వెంటనే ప్రకటన లేకుండా 03-03-2020 కాలము వ్యాపార వేళల అనంతరం వెంటనే ముగియగలదు. |

పై రుణము కొరకు తెలంగాణ ప్రభుత్వము చందాలు అభ్యర్థిస్తున్నది. పూర్తి వివరములను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబయి నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
కె. రామకృష్ణారావు
ముఖ్య ఆర్థిక కార్యదర్శి
ఆర్థిక శాఖ
DIPR R.O. No. 2548-DP/CL/Advt/1/2019-20, Dt: 28-02-2020

## బంగారానిదీ అదే దారి...



స్టాక్ మార్కెట్లతోపాటు బంగారం ధరలు కూడా దిగొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.222 తగ్గి రూ.43,358కి పడిపోయింది. గురువారం ఈ ధర రూ.43,580గా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి మద్దతు లభించకపోవడంతో కిలో వెండి ధర రూ.60 తగ్గి రూ.48,130కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,632 డాలర్లకు, వెండి 17.25 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.

## సంపన్నులనూ వదలని కరోనా

కరోనా వైరస్ దెబ్బకు దేశీయ కుబేరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. గడిచిన పక్షం రోజుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఏకంగా 5 బిలియన్ డాలర్ల సంపదను కోల్పోయారు. ఇది మన కరెన్సీలో రూ.36 వేల కోట్లకు పైమాటే. విప్రో చైర్మన్ అజీం ప్రేమ్‌జీ రూ.6,281 కోట్లు (869 మిలియన్ డాలర్లు), ఆదిత్యా బిర్లా గ్రూపు చైర్మన్ కుమార మంగళం బిర్లా రూ.6,374 కోట్లు (884 మిలియన్ డాలర్లు), అదానీ గ్రూపు అధినేత గౌతమ్ అదానీ 496 మిలియన్ డాలర్ల సంపదను కోల్పోయారు. వీరితోపాటు కొటక్ మహీంద్రా బ్యాంక్ చీఫ్ ఉదయ్ కొటక్, సన్‌ఫార్మా అధినేత దిలీప్ సంఘ్వీలు కూడా భారీగా నష్టపోయారు. గడిచిన పదిహేను రోజులుగా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమవుతుండటంతో కుబేరుల ఆస్తి భారీగా పతనమైంది. ఈ నెల 12 నుంచి 11 సెషన్లలో బీఎస్ఈ సెన్సెక్స్ 3 వేల పాయింట్ల వరకు క్షీణించింది. దీంతో మదుపరుల సంపద రూ.11.52 లక్షల కోట్లు కరిగిపోయింది. టాటా గ్రూపునకు చెందిన 21 కంపెనీలు నికరంగా రూ.41,390 కోట్ల సంపదను కోల్పోగా.. అదానీ గ్రూపు రూ.27,100 కోట్లు, ఆదిత్యా బిర్లా గ్రూపు రూ.17,500 కోట్లు, వాడియా గ్రూపు రూ.3,300 కోట్లు నష్టపోయినట్టు బ్లూంబర్గ్ వెల్లడించింది.

| వ్యక్తి | కంపెనీ | కోల్పోయిన సంపద (కోట్లలో) |
|---|---|---|
| ముకేశ్ అంబానీ | రిలయన్స్ | 36,100 |
| కుమార మంగళం బిర్లా | ఆదిత్యా బిర్లా | 6,300 |
| అజీం ప్రేమ్‌జీ | విప్రో | 6,200 |
| గౌతమ్ అదానీ | అదానీ | 3,500 |
| టాటా గ్రూపు | --- | 41,930 |

### పతనానికి గల కారణాలు..

**డబ్ల్యూహెచ్‌వో కీలక వ్యాఖ్యలు**

ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ వ్యాఖ్యలు పతనానికి ఆజ్యం పోశాయి. ప్రపంచ దేశాలన్నీ స్పందిస్తేనే కరోనాను అరికట్టడం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం సాధ్యమవుతుందని ఆయన వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లలో అలజడి సృష్టించాయి.

**ఆర్థిక మాంద్యం భయాలు..**

ఆర్థిక మాంద్యం భయాలు స్టాక్ మార్కెట్లను చుట్టుముట్టాయి. దేశ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై మూడీస్, డీఅండ్‌పీ ఆందోళన వ్యక్తం చేయడం, మరోవైపు కరోనా వైరస్‌తో వృద్ధి మరింత దిగజారే అవకాశాలున్నట్లు వచ్చిన సంకేతాలు మార్కెట్లను కుప్పకూల్చాయి.

**ఎఫ్‌పీఐల్లో ఆందోళన**

వరుసగా మూడు నెలలుగా దేశీయ ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు పెడుతున్న ఎఫ్‌పీఐలు.. ఈ నెల చివర్లో భారీగా నిధులను ఉపసంహరించుకున్నారు. ఈ వారంలో రూ.6,812.57 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు.

**నాలుగేండ్ల కనిష్ఠానికి క్రూడాయిల్**

క్రూడాయిల్ ధరలు భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధరలు వరుసగా ఆరో రోజు శుక్రవారం మరో నాలుగు శాతం పడిపోయాయి. ప్రస్తుతం బ్యారెల్ ధర 51.01 డాలర్లుగా ఉన్నది. ఈ వారంలో ఇంధన ధర 12 శాతం తగ్గినట్టయింది.

**వృద్ధి గణాంకాలు..**

కరోనా వైరస్‌తోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను భారత వృద్ధి గణాంకాలు కూడా పతనానికి పరోక్షంగా దోహదం చేశాయి. జీడీపీ గణాంకాలతోపాటు కీలక రంగాల పనితీరు కూడా విడుదల కానుండటంతో మదుపరులు ముందు జాగ్రత్తగా అమ్మకాలకు మొగ్గుచూపారు.




## మార్కెట్లకు వైరస్

# కల్లోలం

**చరిత్రలో రెండో అతిపెద్ద పతనం • కుప్పకూలిన ప్రపంచ మార్కెట్లు**

**సెన్సెక్స్ 1,448, నిఫ్టీ 431 పాయింట్ల పతనం • రూ.5.45 లక్షల కోట్ల సంపద ఆవిరి**

**ముంబై, ఫిబ్రవరి 28:**

స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న కరోనా వైరస్ మరిన్ని దేశాలకు విస్తరిస్తున్నదన్న భయాలు మార్కెట్లలో అల్లకల్లోలం సృష్టించాయి. మార్కెట్లు ప్రారంభమైన తొలి గంటలోనే ఐదు లక్షల కోట్లకు పైగా సంపద కోల్పోవడం చూస్తుంటే ఈ వైరస్ దెబ్బ ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థమవుతున్నది. ఒక దశలో 1,500 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ వారాంతం ట్రేడింగ్ ముగిసే సమయానికి 1,448.37 పాయింట్లు లేదా 3.64 శాతం పడిపోయి 38,297.29 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్ చరిత్రలో రెండో అతిపెద్ద పతనం ఇదే. 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం కారణంగా అప్పట్లో భారీగా నష్టపోయిన సూచీలు మళ్లీ ఇప్పుడు కరోనా వైరస్‌తో కకావికలమయ్యాయి. ఆగస్టు 24, 2015న సూచీ 1,624.51 పాయింట్ల మేర నష్టపోయిన విషయం తెలిసిందే. జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ కూడా 431.55 పాయింట్లు లేదా 3.71 శాతం క్షీణించి 11,201.75 వద్ద పరిమితమైంది. మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 2,872.83 పాయింట్లు లేదా 6.97 శాతం, నిఫ్టీ 879.10 పాయింట్లు లేదా 7.27 శాతం పడిపోయాయి. కరోనా (కోవిడ్-19) వైరస్ మరో 57 దేశాలకు విస్తరించడం, ముఖ్యంగా న్యూజిలాండ్, నైజీరియా, నెదర్లాండ్స్ దేశాల్లో తొలి కేసు నమోదవడం ప్రపంచ మార్కెట్లలో ఆందోళనను పెంచింది. ఫలితంగా వరుసగా ఆరు రోజులుగా పతనమవుతూ వచ్చిన దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం బ్లాక్ ఫ్రైడేగా నిలిచిపోయింది. పవిత్ర మక్కాకు రాకపోకలను నిలిపివేస్తూ సౌదీ అరేబియా నిర్ణయించడం, యూరప్ దేశాలు దాదాపు పర్యవేక్షణలో ఉండటంతో మార్కెట్లపై భయాలు మరింత పెరిగాయి. దీంతో దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. ముఖ్యంగా మెటల్, ఐటీ, టెక్, బేసిక్ మేటిరీయల్, ఇండస్ట్రీయల్, ఎనర్జీ, ఫైనాన్స్, ఆటో, బ్యాంకెక్స్ సూచీలు ఏడు శాతానికి పైగా పతనమయ్యాయి.

**ఆరు రోజుల్లో 11 లక్షల కోట్లు మాయం**

స్టాక్ మార్కెట్ల భారీ పతనంతో మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోతున్నది. ఒక్క శుక్రవారమే మదుపరులు ఏకంగా రూ.5,45,452.52 కోట్ల మేర సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ. 1,46,94,571. 56 కోట్లకు పడిపోయింది. గురువారం ఇది రూ. 1,52,40, 024.08 కోట్లుగా ఉన్నది. వరుసగా ఆరు రోజుల్లో మదుపరులు రూ. 11,76,985.88 కోట్ల సంపదను కోల్పోయారు. కరోనా వైరస్ వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్వల్పకాలంపాటు కుదేలవుతుందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- టెక్ మహీంద్రా 8.14 శాతం పడిపోయి టాప్ లూజర్‌గా నిలిచింది
- టాటా స్టీల్, మహీంద్రాలు 7 శాతానికి పైగా పతనమవగా, హెచ్‌సీఎల్ టెక్, బజాజ్ ఫిన్, ఇన్ఫోసిస్, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంకులు 5 శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.
- టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, సన్‌ఫార్మా, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌యూఎల్, పవర్‌గ్రిడ్, హీరో, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాసిమెంట్, ఎన్‌టీపీసీ, ఎల్‌అండ్‌టీలు రెండు శాతంకు పైగా పతనం చెందాయి.
- టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, ఇండస్ఇండ్, మారుతిలు కూడా మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి.
- 2,620 షేర్లకుగాను 2,011 షేర్లు పతనమవగా, 456 షేర్లు లాభపడ్డాయి. 153 షేర్లు యథాతథంగా ఉన్నాయి.
- 335 షేర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకగా, 106 స్టాకులు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి.
- 52 వారాల కనిష్ఠానికి 437 కంపెనీల షేర్లు జారుకన్నాయి.
- కానీ, 36 స్టాకులు ఏడాది గరిష్ఠానికి చేరుకోవడం విశేషం.

### విమానయాన రంగ షేర్లు డీలా..




విమానయాన రంగ షేర్లను కూడా కరోనా వైరస్ వదలడం లేదు. ఈ వైరస్‌తో ప్రపంచ పర్యాటక రంగం కుదేలవుతున్నట్లు వచ్చిన సంకేతాలతో విమానయాన కంపెనీల షేర్లు భారీగా పతనం చెందాయి. ఇండిగో పేరుతో విమానాలు నడుపుతున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు 4.80 శాతం, స్పైస్‌జెట్ 4.69 శాతం, జెట్ ఎయిర్‌వేస్ షేరు 4.26 శాతం పడిపోయాయి.

### ఆటో స్టాకులు ఢమాల్



**వాహన** రంగ షేర్లు ఢమాల్‌మన్నాయి. కరోనా వైరస్‌తో వాహన విడిభాగాల సరఫరా నిలిచిపోనున్నట్లు వచ్చిన సంకేతాలకు తోడు రెండు దశాబ్దాలకు పైగా అమ్మకాలు పడిపోవడంతో ఈ రంగ షేర్లు కుదేలయ్యాయి. టాటా మోటర్స్ 11.03 శాతం పతనమవగా, అశోక్ లేలాండ్ 8.15 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 7.50 శాతం, బజాజ్ ఆటో 1.60 శాతం, మారుతి సుజుకీలతోపాటు టీవీఎస్ మోటర్, ఎమ్మారఫ్, హీరో మోటోకార్ప్, ఐచర్ మోటర్స్, అపోలో టైర్స్ కూడా పతనం చెందాయి.

## జీఎస్టీ మీ ముంగిటకే...

**హైదరాబాద్ జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ పురుషోత్తం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా 'జిల్లా జిల్లాలో కేంద్ర జీఎస్టీ మీ వద్దకు' పేరిట అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ డీ పురుషోత్తం తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో సమావేశాన్ని నిర్వహించి జీఎస్టీకి సంబంధించిన పలు అంశాలపై సందేహాలను నివృత్తిచేశారు. జీఎస్టీ రిటర్నుల దాఖలుకు తీసుకొచ్చిన కొత్త ప్రక్రియతోపాటు ఈ-ఇన్‌వాయిసింగ్ అంశంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. అనంతరం పురుషోత్తం మాట్లాడుతూ.. రిటర్నుల దాఖలులో పన్ను చెల్లింపుదారులకు ఎదురవుతున్న ఇబ్బందులను త్వరగా పరిష్కరించడమే ధ్యేయంగా 'జిల్లా జిల్లాలో కేంద్ర జీఎస్టీ మీ వద్దకు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో పన్నుచెల్లింపుదారులు నేరుగా అధికారులతో మాట్లాడేందుకు వీలుంటుందని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో 7 సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించామని, వీటిలో ప్రస్తుత సమావేశం మూడవదని తెలిపారు.

## 6 నెలల కనిష్ఠానికి రూపాయి

**63 పైసలు పడిపోయిన మారకం**

**ముంబై, ఫిబ్రవరి 28:** దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. స్టాక్ మార్కెట్ల భారీ పతనంతో మారకం విలువ ఆరు నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఈక్విటీ మార్కెట్లు కుదేలవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడంతో రూపాయి కరెన్సీ వరుసగా ఆరో రోజు 63 పైసలు పడిపోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 72.24 వద్ద నిలిచింది. 71.90 వద్ద ప్రారంభమైన కరెన్సీ విలువ ఇంట్రాడేలో 72.29 కనిష్ఠ స్థాయిని తాకింది. సెప్టెంబర్ 13, 2019 తర్వాత రూపాయికి ఇదే భారీ పతనం. కరోనా వైరస్ భయాలు ఫారెక్స్ మార్కెట్లకు చుట్టుకున్నాయని, ఫలితంగా దేశీయ కరెన్సీతోపాటు ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. దేశీయ క్యాపిటల్ మార్కెట్ నుంచి రూ.1,428.74 కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్నారు.




### 476 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ రిజర్వులు

విదేశీ మారకం నిల్వలు స్వల్పంగా పెరిగాయి. ఈ నెల 21తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 29 మిలియన్ డాలర్లు పెరిగి రికార్డు స్థాయి 476.122 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతక్రితం వారంలో రిజర్వులు 3 బిలియన్ డాలర్లు పెరిగి 476.092 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తులు మాత్రం 490 మిలియన్ డాలర్లు తగ్గి 441.458 బిలియన్ డాలర్లకు పరిమితమైనప్పటికీ రికార్డు స్థాయికి చేరుకోవడం విశేషం. వరుసగా రెండోవారం గోల్డ్ రిజర్వులు 539 మిలియన్ డాలర్లు ఎగబాకి 29.662 బిలియన్ డాలర్లకు చేరాయి.

### కుదేలైన ప్రపంచ మార్కెట్లు

**ప్రపంచ** మార్కెట్లు కుదేలయ్యాయి. వాల్‌స్ట్రీట్ షేర్లు భారీగా పతనం కావడం దేశీయ మార్కెట్ల పతనాన్ని శాసించాయి. జపాన్ 3.5 శాతం, చైనా మార్కెట్లు 2.5 శాతం క్షీణించాయి. అమెరికా డౌజోన్స్ సూచీ చరిత్రలో అతిపెద్ద ఒక్క రోజు పతనాన్ని చవిచూసింది. దాదాపు 1200 పాయింట్లు కోల్పోయింది. అమెరికాలో కరోనా వైరస్ సోకినట్లు అనుమానాలు వ్యక్తం కావడం అక్కడి మదుపరుల్లో ఆందోళనను పెంచింది. వీటితోపాటు షాంఘై, హాంకాంగ్, సియోల్, టోక్యో షేర్లు నాలుగు శాతం వరకు కోల్పోయాయి. ఈ వైరస్‌తో ఇప్పటి వరకు 2,858 మంది ప్రాణాలు కోల్పోగా, ప్రపంచవ్యాప్తంగా 83 వేల మందికి ఈ వైరస్ సోకినట్లు వార్తలు వచ్చాయి.




(శుక్రవారం అర్ధరాత్రి వరకు)

## ఏడేండ్ల కనిష్ఠానికి జీడీపీ

**క్యూ3లో వృద్ధిరేటు 4.7 శాతానికి పతనం • తయారీరంగం మందగించడమే కారణం**




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో వరుసగా మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో కూడా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు క్షీణించింది. 4.7 శాతానికి పతనమై దాదాపు ఏడేండ్ల కనిష్ఠస్థాయికి దిగజారింది. 2012-13 ఆర్థిక సంవత్సర చివరి త్రైమాసికం (జనవరి-మార్చి) తర్వాత ఇదే అత్యల్ప వృద్ధిరేటు. ఆ త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు 4.3 శాతంగా నమోదైంది. తయారీ రంగంలో ఉత్పత్తి తగ్గడమే తాజా పతనానికి ప్రధాన కారణమని శుక్రవారం విడుదలైన అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. గత ఆర్థిక సంవత్సర (2018-19) మూడో త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు 5.6 శాతంగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సర రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో తొలుత 4.5 శాతంగా అంచనావేసిన జీడీపీ వృద్ధిరేటును ఆ తర్వాత 5.1 శాతానికి, తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో వృద్ధిరేటును 5 శాతం నుంచి 5.6 శాతానికి సవరించారు. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్వో) తాజాగా విడుదలచేసిన గణాంకాల ప్రకారం ఏడాది క్రితం తయారీ రంగంలో 5.2 శాతంగా నమోదైన వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసికంలో 0.2 శాతం, నిర్మాణరంగ వృద్ధిరేటు 0.3 శాతం తగ్గింది. అలాగే ఈ వృద్ధిరేటు మైనింగ్ రంగంలో 4.4 శాతం నుంచి 3.2 శాతానికి, విద్యుత్, గ్యాస్, నీటిసరఫరా, ఇతర వినిమయ సేవల రంగంలో 9.5 శాతం నుంచి 8.8 శాతానికి, వాణిజ్యం, హోటల్, రవాణా, కమ్యూనికేషన్లు, ప్రసార సంబంధ సేవల రంగంలో 7.8 శాతం నుంచి 5.9 శాతానికి క్షీణించింది. అయితే వ్యవసాయ రంగంలో ఏడాది క్రితం 2 శాతంగా నమోదైన వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసికంలో 3.5 శాతానికి పెరిగింది. అలాగే ఈ వృద్ధిరేటు ఆర్థిక, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసుల రంగంలో 6.5 శాతం నుంచి 7.3 శాతానికి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, డిఫెన్స్, ఇతర సేవల రంగాల్లో 8.1 శాతం నుంచి 9.7 శాతానికి చేరింది. ఏడాది క్రితం ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో 6.3 శాతంగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో 5.1 శాతానికి క్షీణించింది. స్థిర (2011-12) ధరల వద్ద గత ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసికంలో రూ.35 లక్షల కోట్లుగా ఉన్న జీడీపీ ఈ ఆర్థిక సంవత్సరం క్యూ3లో 4.7 శాతం వృద్ధితో రూ.36.65 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్టు ఎన్ఎస్వో ఓ ప్రకటనలో పేర్కొన్నది. ప్రస్తుత ధరల ప్రకారం 2018-19లో రూ.1,26,521గా ఉన్న తలసరి ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలో 6.3 శాతం పెరిగి రూ.1,34,432కు చేరుతుందని అంచనా వేస్తున్నట్టు ఎన్ఎస్వో తెలిపింది. అయితే దేశ ఆర్థిక వృద్ధిరేటు అత్యంత కనిష్ఠస్థాయికి చేరిందని, ఇక ఇంతకంటే క్షీణించే అవకాశం లేదని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అతాను చక్రవర్తి అభిప్రాయపడ్డారు. బొగ్గు ఉత్పత్తితోపాటు రిఫైనరీ ఉత్పత్తులు, విద్యుదుత్పత్తి పెరుగడంతో జనవరిలో ఎనిమిది కీలక రంగాల్లో 2.2 శాతం వృద్ధి నమోదైనట్టు వాణిజ్యశాఖ విడుదలచేసిన గణాంకాలు వెల్లడించాయి.

## పీఎఫ్‌పై వడ్డీ కోత!

**8.5 శాతానికి కుదించాలని ఈపీఎఫ్‌వో యోచన**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:** వేతనజీవులకు చేదు వార్త. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గించడంపై ఉద్యోగ భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) పరిశీలన జరుపుతున్నది. 2019 ఆర్థిక సంవత్సరంలో 8.65 శాతంగా ఉన్న వడ్డీ రేటును 2020 ఆర్థిక సంవత్సరంలో 8.5 శాతానికి (15 బేసిస్ పాయింట్లు) తగ్గించాలని ఈపీఎఫ్‌వో భావిస్తున్నట్టు సమాచారం. పెట్టుబడులపై లాభాలు తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. దీర్ఘకాలిక ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీలపై లాభాలు గత ఏడాది కాలంగా 50 నుంచి 80 బేసిస్ పాయింట్ల మేరకు తగ్గడంతో ఈపీఎఫ్‌వో ఈ ఆర్థిక సంవత్సరంలో పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించకపోవచ్చు. ఇబ్బందులతో సతమతమవుతున్న రెండు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల్లో (దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో) ఈపీఎఫ్‌వో రూ.4,500 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ప్రస్తుతం ఈ రెండు సంస్థల దివాలా ప్రక్రియ కొనసాగుతుండటంతో వాటి నుంచి ఇప్పటికిప్పుడు ఈపీఎఫ్‌వో సొమ్ము రికవరీ అయ్యే అవకాశాలు కనిపించడంలేదు. మార్కెట్లలో ఈపీఎఫ్‌వో మొత్తంగా రూ.18 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టింది. వీటిలో 85 శాతం నిధులను డెట్ మార్కెట్లలో, మరో 15 శాతం నిధులను ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టింది. దీంతో ఈక్విటీల్లో పెట్టిన పెట్టుబడులు గతేడాది మార్చి నాటికి 14.74 శాతం లాభాలతో రూ.74,324 కోట్లకు చేరాయి. పీఎఫ్ వడ్డీరేటు కుదింపుపై తుదినిర్ణయానికి రావడానికి ముందు గత ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్‌వోకు వచ్చిన రాబడులపై ఫైనాన్స్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఆడిట్ కమిటీ (ఎఫ్ఐఏసీ) పరిశీలన జరుపుతుంది. ఆ తర్వాత ఈపీఎఫ్‌వోలో అత్యున్నత విధాన నిర్ణాయక విభాగమైన కేంద్ర ట్రస్టీల బోర్డు (సీబీటీ) పీఎఫ్ వడ్డీరేటు కుదింపుపై చర్చిస్తుంది. సీబీటీ సమావేశం మార్చి 5న జరుగనున్నది.

### ఆర్థికంలో 'నిలకడ' శుభసూచకం

**4.7 శాతం జీడీపీపై నిర్మలా సీతారామన్ వ్యాఖ్య**



**దేశ** ఆర్థిక వ్యవస్థలో 'నిలకడ' శుభసూచకమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసికంలో జీడీపీ 4.7 శాతానికి చేరినట్టు శుక్రవారం అధికారిక గణాంకాలు వెలువడిన వెంటనే ఆమె ఈ వ్యాఖ్య చేశారు. ముంబైలో సీఎన్‌బీసీ టీవీ-18 చానల్ నిర్వహించిన బిజినెస్ లీడర్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. జీడీపీ వృద్ధిరేటు సంఖ్య మారుతుందని తాను భావించడంలేదన్నారు. ప్రస్తుతం చైనాతోపాటు పలు దేశాలను గడగడలాడిస్తున్న కరోనా వైరస్ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై పడే దుష్ప్రభావం గురించి ఇప్పుడే ఆందోళన చెందాల్సిన అవసరంలేదని చెప్పారు. అయితే కరోనా వైరస్ వల్ల తలెత్తిన సమస్యలు మరో రెండు మూడు వారాలు కొనసాగితే అది సవాలుగా మారవచ్చని అంగీకరించారు. ముడిసరుకుల కోసం చైనా నుంచి వచ్చే దిగుమతులపై అధికంగా ఆధారపడిన దేశీయ ఫార్మా, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు ముఖ్యమైన వస్తువులను విమానాల ద్వారా తీసుకురావాలని సూచించాయని, ఆ సూచనను ప్రభుత్వం పరిశీలించవచ్చని నిర్మలా సీతారామన్ తెలిపారు.

### పెరిగిన ద్రవ్యలోటు

దేశ ద్రవ్యలోటు మరింత పెరిగింది. జనవరి నెలాఖరుకే మొత్తం వార్షిక బడ్జెట్ లక్ష్యంలో 128.5 శాతానికి (రూ. 9,85,472 కోట్లకు) చేరినట్టు కంప్ట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ద్రవ్యలోటు సవరించిన బడ్జెట్ అంచనాల్లో 121.5 శాతంగా ఉన్నది. మార్చి 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో ద్రవ్యలోటును రూ.7,66,846 కోట్లకు (జీడీపీలో 3.3%) కట్టడి చేయాలని ప్రభుత్వం తొలుత లక్ష్యంగా నిర్దేశించుకొన్నది. అయితే ప్రభుత్వానికి రాబడి తగ్గడంతో ద్రవ్యలోటు లక్ష్యాన్ని జీడీపీలో 3.8 శాతానికి పెంచినట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి సీతారామన్ ఇటీవల పార్లమెంట్‌లో సార్వత్రిక బడ్జెట్ 2020 - 21ను ప్రవేశపెడుతూ ప్రకటించారు.

/nt.zindagi నమస్తే తెలంగాణ WWW. NTNEWS.COM
శనివారం 29 ఫిబ్రవరి 2020

# జిందగీ

## హ్యాపీ లీప్ ఇయర్




**ఈ ఏడాదికి ఓ ప్రత్యేకత ఉన్నది. అదే లీపు సంవత్సరం. నాలుగేండ్లకు ఓసారి వచ్చే అరుదైన రోజు ఫిబ్రవరి 29. ఏడాదిలో మిగిలిన రోజుల్లో పుట్టిన వారికీ ఈ రోజు పుట్టిన వారికీ , పెండ్లి చేసుకున్న వారికీ చాలా తేడా ఉంటుంది. లీపు సంవత్సరంలో పుట్టిన వారు నాలుగేండ్లకు ఓ సారి ఆయా దినోత్సవాలను జరుపుకుంటారు. అనేక దేశాల్లో ఫిబ్రవరి 29ని అరుదైన దినోత్సవంగా పేర్కొంటారు.**

ఫిబ్రవరి 29న పుట్టిన వారిని 'లీప్లింగ్స్' లేదా 'లీపర్స్' అని పిలుస్తారు. ఈ రోజున పుట్టిన వారు కొందరు అదృష్టంగానూ, మరికొందరు దురదృష్టంగానూ భావిస్తారు. ఈ రోజున జన్మించిన వ్యక్తులకు 'హానర్ సొసైటీ ఆఫ్ లీప్ ఇయర్ బేబీస్ క్లబ్' పేరుతో ఓ సంఘమే ఏర్పాటైంది. ఇందులో 10వేల మందికిపైగా సభ్యులున్నారు. ఫిబ్రవరి 29న పుట్టిన వారిలో అసాధారణమైన ప్రతిభ దాగి ఉంటుంది. ఇదే రోజు పుట్టి, మరణించాడు జేమ్స్ విల్సన్అనే వ్యక్తి. గ్రీస్‌లో నిశ్చితార్థం చేసుకున్న ఐదు జంటల్లో ఒకరు మాత్రమే లీప్ ఇయర్‌లో పెండ్లి చేసుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఇలా పెండ్లి చేసుకోవడం వారు దురదుష్టంగా భావిస్తారు. అందుకోసమే వారు ఫిబ్రవరి 29న పెండ్లి చేసుకోవడానికి నిరాకరిస్తారు. నార్వేకు చెందిన కరిన్ హెన్రిక్సన్ అనే మహిళ ఇదే రోజున వేర్వేరు సంవత్సరాల్లో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ఒకరు 1960లో కుమార్తె, 1964, 1968ల్లో ఇద్దరు కుమారులు ఫిబ్రవరి 29నే పుట్టారు. కరిన్ హెన్రిక్సన్ ఇలా వేర్వేరు సంవత్సరాల్లో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చి చరిత్రలో నిలిచిపోయింది. బ్రహ్మచారుల దినోత్సవం కూడా ఇదే రోజున జరుపుకుంటారు. ఐర్లాండ్‌లో పెండ్లికాని ప్రసాదులంతా కలిసి బ్రహ్మచారుల దినోత్సవాన్ని జరుపుకోవడం మొదలు పెట్టారు. అక్కడ ఈ రోజున యువకులు యువతులకు పెండ్లి చేసుకుంటానని చెప్పవచ్చు. అలా చెప్పిన తర్వాత గ్రీన్ సిగ్నల్ వస్తే ఇద్దరూ కలిసి డాన్స్ చేస్తారు. ఒకరికొకరు బహుమతులు ఇచ్చి సంతోషంగా గడుపుతారు. యూరప్‌లో ఈ ఏడాదంతా బ్యాచిలర్స్ డే వేడుకలను జరుపుతారు. వేడుకల్లో భాగంగా అబ్బాయిలు, అమ్మాయిలకు పెండ్లి ప్రతిపాదన చేసుకుంటారు.

## జిడ్డు మరకలా?



- బెండకాయ కూర జిగురుగా ఉండకూడదంటే కూర వండేటప్పుడు నిమ్మరసం కాస్త కలపాలి.
- గ్యాస్ బర్నల్స్‌ను వారానికోసారైనా క్లీన్ చేస్తే గ్యాస్ ఆదా అవుతుంది.
- గ్యాస్ బర్నల్స్ నల్లగా మారిపోతే వెనిగర్‌లో రాత్రంతా బర్నల్స్ నానబెట్టి బ్రష్‌తో తోమితే తెల్లగా మారుతాయి.
- చట్నీ లేదా మరేదైనా మిక్సీ పట్టినప్పుడు బ్లేడ్స్‌కు అతుక్కుపోయి ఉంటాయి. ఇలాంటప్పుడు కొన్ని నీళ్లుపోసి కాస్తంత డిష్‌వాష్ లిక్విడ్ వేసి ఒకసారి మిక్సీ పట్టాలి. ఇప్పుడు కడిగేస్తే బ్లేడ్స్ శుభ్రంగా మారుతాయి.
- నెయిల్ పాలిష్ రిమూవర్ లిక్విడ్‌ను కొద్దిగా గుడ్డమీద పోసి స్విచ్‌బోర్డును తుడిస్తే స్విచ్‌బోర్డుపై ఉన్న మరకలన్నీ తొలిగిపోతాయి.

## సాబుదాన పోషకాల ఖజానా



**చాలామంది ఉపవాసం ఉన్న సమయాల్లో ఎక్కువగా సాబుదానాను ఆహారంగా తీసుకుంటుంటారు. సాబుదాన తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. తరచూ ఆహారంలో దీనిని తీసుకుంటే ఏమేం లాభాలు కలుగుతాయంటే..**

- సాబుదానాలో ఉండే ప్రొటీన్లు కండరాల వృద్ధికి ఉపయోగపడుతాయి. బలాన్ని అందిస్తాయి. మరోవైపు వీటిలో ఉండే ప్రొటీన్లకు నయం చేసే గుణాలతో పాటు కణాల విధులను మెరుగుపరిచే గుణాలూ ఉంటాయి.
- ఇందులో క్యాల్షియం, ఐరన్, విటమిన్ కె ఉండడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోజూవారీ అలసట తగ్గించేందుకు ఇది ఉపయోగపడుతుంది. రోజూ 50 గ్రాములు తినడం వల్ల రక్తహీనత సమస్యలు తలెత్తవు. వీటిలోని పొటాషియం స్థాయిలు రక్త ప్రవాహాన్ని మెరుగుపరిచి గుండెపై ఏర్పడే ఒత్తిడిని తగ్గిస్తాయి.
- సాబుదానలో ఫోలిక్ ఆసిడ్, విటమిన్ బి ఉంటాయి. గర్భిణులు వీటిని రోజూ తినడం వల్ల పుట్టబోయే బిడ్డలకు ఆరోగ్యం చేకూరుతుంది. శిశువులకు నాడీ సంబంధ లోపాల నియంత్రణలోనూ సాబుదాన బాగా పనిచేస్తుంది.
- తరచూ సాబుదాన తింటుంటే మలబద్దకం, అజీర్ణం, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు తొలిగిపోతాయి. శరీరంలోని కొవ్వు పదార్థాల స్థాయి నియంత్రణలో ఉంటుంది. నీరసంగా, బలహీనంగా ఉన్నవారు తరచూ సాబుదాన తింటే సత్వర శక్తిని పొందుతారు.
- తక్కువ కేలరీలతో ఎక్కువ శక్తినిచ్చే ఆహారంగా సగ్గుబియ్యాన్ని చెప్పవచ్చు. ఇందులో కార్బోహైడ్రేట్లు అధికం. అందుకే శక్తినిచ్చే డ్రింకుల్లోనూ, బ్రెడ్ ఐటమ్స్‌లోనూ వీటినే ఎక్కువగా వాడుతుంటారు. వీటిని రోజూవారీ ఆహారంలో చేర్చుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

**చదువండీ..**
**చదువండీ అని పిల్లలను**
**రుద్దుతున్నారు సరే..**
**వారేం తింటున్నారో చూస్తున్నారా?**
**★ ★ ★**
**అసలేం**
**పెడుతున్నారో అర్థమవుతున్నదా?**
**★ ★ ★**
**నిండా గాలి నింపి.. గట్టిగా మసాలా**
**పట్టించి.. డిజైనింగ్ ప్యాకెట్ల మేతనే కదా**
**మీరిచ్చేది?**
**★ ★ ★**
**బిజీ ముసుగు తీసేసి మీ పిల్లల్ని చూడండి. కొందరు ఎత్తు పెరగరు. మరికొందరు బలహీనంగా ఉంటారు. ఇంకొందరికి రక్తం తక్కువగా ఉంటుంది. మరి ఏం చేయాలి? ఒకసారి తంపులూర్ ప్రభుత్వ పాఠశాల గురించి తెలుసుకోండి.**
**పిల్లలకు ఏం పెట్టాలో? అక్కడ వాళ్లేం పెడుతున్నారో? పిల్లలకు మంచి ఆరోగ్యాన్ని ఎలా ఇవ్వాలో తెలుస్తుంది!**



కొత్త బడిగంట

## తంపులూర్ బడిలో మోగుతున్న

# స్నాక్స్ బెల్!



**కేరళ సర్కారు బడుల్లో మోగిన వాటర్ బెల్ మనకు తెలిసిందే కదా? ఎంతో చక్కటి కార్యక్రమం అది. విజయవంతంగా నడుస్తున్నది. గజిబిజీ గందరగోళ చదువుల లోకంలో కనీసం నీళ్లు తాగలేని స్థితిలో పిల్లలున్నారని గుర్తించి ఈ వాటర్‌బెల్ మోగించారు అక్కడి టీచర్లు. అలాంటి మరొక అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది తెలంగాణలోని ఓ ప్రభుత్వ పాఠశాల. ఆ కార్యక్రమం పేరు స్నాక్స్‌బెల్.**

> **ఇష్టంగా తింటున్నారు:** విద్యార్థుల్లో రక్తహీనత ఉన్న విషయం తెలియగానే బాధనిపించింది. నివారణకు ఏం చేయాలి అనే ఆలోచన నేపథ్యంలో నుంచి పుట్టిందే ఈ స్నాక్స్ బెల్. శనగలు, పెసలు వంటి తృణధాన్యాలు కొనుగోలు చేస్తున్నాం. వాటిని శుభ్రంచేసి రోజువారీగా ఎంత అవసరమో అంత స్నాక్స్ రూపంలో విద్యార్థులకు అందిస్తున్నాం. వాటిని విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. అన్ని పాఠశాలల్లో ఈరకమైన స్నాక్స్ అందిస్తే విద్యార్థుల్లో ఉన్న రక్తహీనత సమస్య తగ్గే అవకాశం ఉంటుంది.
>
> అనంతల జ్యోత్స్న

**ఒక అనౌన్స్‌మెంట్...** మెదక్ జిల్లా తంపులూర్ ఉన్నతపాఠశాల. అది ప్రార్థనా సమయం. భారతదేశం నా మాతృభూమి అంటూ పిల్లలు చక్కగా ప్రార్థన చేశారు. ఇంతలో హెడ్‌మాస్టర్ మైక్ అందుకున్నారు. 'మన పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న 'పూజ' రక్తహీనతతో చనిపోయిన విషయం మీ అందరికీ తెలిసిందే కదా. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం' అనే అనౌన్స్‌మెంట్ అది. విద్యార్థులు, ఉపాధ్యాయులు మౌనం పాటించారు. అందరూ క్లాస్ రూమ్‌ల్లోకి వెళ్లిపోయారు.

**రక్తహీనతతో చనిపోవడమా? :** కొన్నాళ్లకు స్కూల్‌లో మెడికల్ క్యాంప్ జరిగింది. 6-10 తరగతుల విద్యార్థులకు పరీక్షలు చేశారు. వాళ్లలో చాలావరకు రక్తహీనతతో బాధపడుతున్నట్లు తేలింది. డాక్టర్స్ కొన్ని సలహాలు ఇచ్చారు. క్యాంప్ అయిపోయింది. ఎవరి పనిలో వాళ్లు నిమగ్నమయ్యారు. కానీ ఒక ఉపాధ్యాయురాలు మాత్రం పూజ మరణం గురించే ఆలోచిస్తున్నారు. ఆ అమ్మాయి రక్తహీనతతో చనిపోవడాన్ని తట్టుకోలేకపోయారు. 'పూజలా మరే విద్యార్థి అనారోగ్యం బారిన పడకూడదు' అంటూ రోజుల తరబడి ఆలోచించిన ఆ టీచరే జ్యోత్స్న. ఆమె హిందీ ఉపాధ్యాయురాలు.

**విస్తుపోయే విషయాలు :** పాఠశాలలో రోజూ మధ్యాహ్న భోజన పథకం కింద భోజనం పెడుతున్నారు. గంట గంటకూ విద్యార్థులు నీళ్లు తాగుతున్నారు. అయినా ఎందుకు రక్తహీనతతో బాధపడుతున్నారు? అని ఆలోచించారు జ్యోత్స్న. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విస్తుపోయే విషయాలు ఆమె దృష్టికొచ్చాయి. ఉదయాన్నే విద్యార్థులు స్కూలుకు వచ్చే సమయానికి వంట పూర్తి కాలేదనో.. సమయం లేదనో ఏమీ తినకుండా వస్తున్నారట పిల్లలు. ఒకవేళ తిన్నా.. పచ్చడితోనో.. కారం మెతుకులో తింటున్నారని.. దుకాణాల్లో దొరికే చిరుతిళ్లు తింటున్నారని తెలుసుకున్నారు. రక్తహీనతకు ఎలా చెక్ పెట్టొచ్చో తోటి ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్‌తో చర్చించారు.

**చాలా మంచి కార్యక్రమం**



విద్యార్థులు ఇంతకు ముందు నిల్వ ఉంచిన పదార్థాలు, జంక్ ఫుడ్ తినేవారు. మొలకలు, బెల్లం ఇవ్వడం ప్రారంభించినప్పటి నుంచి పూర్తిగా చిరుతిళ్లు మానేశారు. గతంలో కంటే ఆరోగ్యంగా, చురుగ్గా కనిపిస్తున్నారు. విద్యార్థుల్లో రక్తహీనతను అధిగమించేందుకు జ్యోత్స్న టీచర్ చేపట్టిన కార్యక్రమం అభినందనీయం. కేరళలో ప్రారంభించిన వాటర్ బెల్ మాదిరిగా తెలంగాణలోని అన్ని పాఠశాలల్లో స్నాక్స్‌బెల్ అమలు చేస్తే విద్యార్థుల ఆరోగ్యం బాగుంటుంది.

**- రేణుక,** ప్రధానోపాధ్యాయురాలు

**బెల్ మోగేది స్నాక్స్ కోసం :** రోజూ ఉదయం 9:30కు పాఠశాల ప్రారంభం. 11:30 స్వల్ప విరామం. ఈ విరామ సమయంలోనే విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపించాలనుకున్నారు జ్యోత్స్న. 6-10 తరగతి బాల బాలికలకు మొలకలు, బెల్లం స్నాక్స్‌గా అందించారు. మొలకల్లో పెసలు, బబ్బెర్లు, శనగలు ఉన్నాయి. విద్యార్థులు ఇష్టంగా తిన్నారు. ఇదేదో బాగుంది అనుకున్నారు. దాన్నలా కంటిన్యూ చేశారు. ఒక్కో విద్యార్థికి రోజూ 100 గ్రాముల మొలకలు, 20 గ్రాముల బెల్లం క్రమం తప్పకుండా అందిస్తుండటంతో రక్తహీనత సమస్య తగ్గింది. విద్యార్థులకు కావాల్సిన పోషకాలు కూడా పూర్తి స్థాయిలో అందుతున్నాయి. ఈ కార్యక్రమం 2019 అక్టోబర్ నుంచి కొనసాగుతూ ఉంది. మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి.

**చాయి తాగి స్కూలుకు వచ్చేదాన్ని!**



స్కూలు టైంకి ఇంట్లో వంట పూర్తి కాకపోతే చాయి తాగి వచ్చేదాన్ని. ఫస్ట్ పీరియడ్ అయిపోగానే బాగా ఆకలివేసేది. ఇంక అలాగే మధ్యాహ్నం దాక చూస్తూ ఉండేదాన్ని. ఇప్పుడు ఇంటర్‌వెల్ టైంలో స్నాక్స్ ఇస్తున్నారు. ఆకలి బాధ తీరింది. మొలకలు, బెల్లం మంచి రుచిగా కూడా ఉన్నాయి. మా టీచర్లకు థాంక్స్.

**- వర్షిత,** పదో తరగతి

**ఆరోగ్యం-బాధ్యత :** ఇప్పుడు తంపులూర్ పాఠశాల విద్యార్థుల్లో ఎవరికీ దుకాణాల్లో దొరికేవి తినే అలవాటు లేదు. అంటే స్నాక్స్‌బెల్ బయట దొరికే నాసిరకం చిరుతిండ్లను కూడా మాన్పించిందన్నమాట. తమ ఆరోగ్యానికి తామే బాధ్యత వహిస్తాం అంటూ పిల్లలు ముందుకొచ్చారు. దుకాణాల్లో దొరికే మసాలా స్నాక్స్ పెట్టే డబ్బులనే పౌష్టికమైన ఈ స్నాక్స్ కోసం వెచ్చిస్తామని చెప్పడంతో 6-8 తరగతి పిల్లలు ఈ స్నాక్స్ కోసం వారానికి రూ.10 ఇస్తున్నారు. 9-10 తరగతుల విద్యార్థులు రూ.15 ఇస్తున్నారు. పిల్లలు ఇచ్చే ఈ డబ్బులతో తృణధాన్యాలు కొంటున్నారు. ప్రతినెలా రూ.2 వేలు సొంతంగా ఖర్చు చేసి శ్రేష్టమైన బెల్లం కొంటున్నారు జ్యోత్స్న.

**విస్తరిస్తున్న బెల్ :** స్నాక్స్ బెల్‌తో విద్యార్థులకు చక్కటి ఉపయోగం ఉండటంతో ఇతర ప్రభుత్వ పాఠశాలలు కూడా ఈకార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. పాఠాలు చెప్పడం, జీవితాల్ని నిలబెట్టడం మాత్రమే కాదు.. అంతకుమించి కూడా ఉపాధ్యాయులు ఆలోచిస్తారు అనేదానికి ఇదొక చక్కని నిదర్శనం. జ్యోత్స్న 2009లో ఉద్యోగంలో చేరారు. 2018లో బదిలీపై తంపులూర్ పాఠశాలకు వచ్చారు. ఆమె చొరవతో 141 మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందుతున్నది. 65 మంది బాలికల రక్తహీనత సమస్యకు చెక్ పడింది.

... బోయిని యాదయ్య
టేక్మాల్, నమస్తే తెలంగాణ

## డ్యాన్స్‌లోనూ ఇరగదీసింది

**క్రికెట్ మైదానంలో బ్యాట్, బాల్స్‌తో బిజీబిజీగా ఉండే టీమిండియా మహిళా క్రికెటర్ జెమీమా రోడ్రిగ్రేజ్.. విరామ సమయంలో కాసేపు సరదాగా డ్యాన్స్ చేసి అందరి చూపు తనవైపు తిప్పుకుంది. ఇప్పుడా వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.**





మొన్న న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌కు ముందు.. ఇండియన్ ఉమెన్ క్రికెటర్ జెమీమా రోడ్రిగేజ్ వేసిన డ్యాన్స్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నది. స్పోర్ట్స్ షూట్‌లో బ్యాగు వేసుకొని విధులు ముగించుకొని వెళ్తున్న ఉమెన్ సెక్యూరిటీ గార్డుతో 'లవ్ ఆజ్ కల్' చిత్రంలోని 'హా మై గలత్' పాటకు స్టెప్పులేసి అదరగొట్టేసింది రోడ్రిగేజ్. స్టైలిష్‌గా డ్యాన్స్ చేసిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఈ వీడియోను ఐసీసీ అధికారికంగా పోస్ట్ చేసింది. 'నా అభిమాన క్రికెటర్ జెమీమా రోడ్రిగేజ్ నా పాటకు స్టెప్పు లేసింది. ఓ అభిమానిగా అడుగుతున్నా.. జెమీమా వరల్డ్‌కప్ ట్రోఫీని ఇంటికి తీసుకురా' అని బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ ఆ వీడియోను ట్యాగ్ చేస్తూ రీట్వీట్ చేశాడు. కార్తీక్ ఆర్యన్, సారా అలీఖాన్ కాంబినేషన్‌లో తెరకెక్కించిన 'లవ్ ఆజ్ కల్' చిత్రం ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఇక 'గ్రూప్ ఎ'లో న్యూజిలాండ్‌పై మూడు పరుగుల తేడాతో విజయం సాధించిన మన మహిళల జట్టు సెమీస్‌లోకి ప్రవేశించిన తొలి జట్టుగా నిలిచింది. ఇవాళ చివరి గ్రూప్ మ్యాచ్‌లో భాగంగా భారత్ శ్రీలంకతో తలపడనుంది. ఈ 'ది బిగ్ డాన్స్'ను ఇండియా జట్టు మహిళా క్రికెటర్లు కూడా ఎంజాయ్ చేస్తున్నారు. హర్మన్‌ప్రీత్ కౌర్ 100వ టీ-20కి హర్లీన్ డియోల్‌తో కలిసి ఓ ర్యాప్ పాడింది రోడ్రిగ్స్. డ్యాన్స్, సంగీతం, పాటలు పాడటమంటే రోడ్రిగ్స్‌కు చాలా ఇష్టం. ముంబైకి చెందిన జెమామీ అతిచిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగ్రేటం చేసింది. హాకీలో మహారాష్ట్ర అండర్ 17, 19లో ఆడి ప్రతిభ చూపింది. పన్నెండున్నరేండ్లకే అండర్-19 క్రికెట్‌లో సత్తా చాటింది జెమామీ రోడ్రిగ్స్. 50 ఓవర్ల మ్యాచ్‌లో స్మృతి మంధనా తర్వాత డబుల్ సెంచరీ చేసింది జెమామీనే. 2018లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టింది జెమామీ.

## పాదాల పగుళ్లా.. ఎందుకు దిగులు!

**చలికి, ఎక్కువ సేపు నీటిలో గడపడం మూలంగా పాదాలు పగుళ్లు తేలుతాయి. పొడి గాలి, తేమ సరిగ్గా లేకపోవడం, పాదాలకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల పగుళ్లు వస్తుంటాయి. పరిష్కారాలు ఏంటంటే..**



- ఆలివ్ ఆయిల్, నువ్వుల నూనె, కొబ్బరి నూనెల్ని పాదాల పగుళ్లకు వాడొచ్చు. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు సబ్బుతో పాదాలను కడగాలి. ఆ తర్వాత పొడి వస్త్రంతో తుడిచి పాదాలకు విజిటేబుల్ ఆయిల్ రాయాలి. సాక్సులు ధరించి నిద్రపోవాలి. ఇలా మూడు రోజులు చేస్తే పాదాలు మృదువుగా మారుతాయి.
- పిడికెడు బియ్యం పిండి, కొన్ని చెంచాల తేనె, ఆపిల్ సీడర్ వెనిగర్ తీసుకోవాలి. ఇది మందమైన పేస్టులా అయ్యేంత వరకు మరిగించాలి. పగుళ్లు మరీ ఎక్కువగా ఉంటే టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్ లేదా స్వీట్ ఆల్మండ్ ఆయిల్ జత చేయవచ్చు. పాదాల్ని పదినిమిషాల పాటు వెచ్చటి నీటిలో ఉంచి బియ్యం పిండి పేస్టుతో మృదువుగా రుద్దాలి. ఇలా రోజూ చేస్తే వారంలో పగుళ్లు మాయమవుతాయి.
- గుప్పెడు వేపాకులను తీసుకొని పేస్టులా చేసుకోవాలి. దీనికి మూడు టీ స్పూన్ల పసుపు జత చేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పగుళ్లపై రాసి గంటపాటు ఉంచాలి. తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.
- వెచ్చటి నీటిలో నిమ్మరసం కలిపి పాదాలను పావు గంటపాటు అందులో ఉంచాలి. తర్వాత మడమల్ని రుద్దేసి కడగాలి. పొడి వస్త్రంతో తుడవాలి. పగుళ్లు తగ్గేవరకూ ఈ చిట్కాను పాటించవచ్చు. గోరువెచ్చని నీటిలో చెంచా ఉప్పు, చిటికెడు పసుపు వేసి అందులో పాదాలను పదినిమిషాలు ఉంచి కడగాలి.
- పాదాల పగుళ్లు త్వరగా మానకపోవడానికి, పాదాలు తరచూ పగిలిపోవడానికి కారణం పాదాలకు ఎక్కువ తడి, దుమ్ము తగలడం. బయటికి వెళ్లిన ప్రతిసారీ సాక్సులు ధరిస్తే కొంతమేర పాదాలు పగులకుండా చూసుకోవచ్చు.

ఒక గిన్నెలో రోజ్‌వాటర్, గ్లిజరిన్‌ను తీసుకొని బాగా కలపాలి. ఈ రెండింటినీ సమపాళ్లలో కలిపి రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు మడమలు పాదాలకు రాయాలి. రోజూ ఇలా చేయడం వల్ల పగుళ్లు తగ్గిపోతాయి.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శనివారం 29 ఫిబ్రవరి 2020

# డిఫరెంట్ లైఫ్స్ డిఫరెంట్ వరల్డ్స్



'రెడ్' చిత్రంలో రామ్

'క్రైమ్ హిస్టరీలో ఇలాంటి కేసు చూడటం ఇదే ఫస్ట్‌టైమ్. సిద్ధార్థ్, ఆదిత్య ఇద్దరికి ఎటువంటి సంబంధం లేదు. డిఫరెంట్ లైఫ్స్. డిఫరెంట్ వరల్డ్స్' అనే డైలాగ్స్‌తో రామ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'రెడ్' టీజర్ శుక్రవారం విడుదలైంది. కిషోర్ తిరుమల దర్శకుడు. శ్రీ స్రవంతి మూవీస్ పతాకంపై రవికిషోర్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 9న విడుదలకానుంది. 'వాంటెడ్‌గా నన్ను ఇందులో ఇరికించాలని చూస్తున్నారు. ఎందుకంటే లైఫ్‌లో వాడికున్న వన్ అండ్ ఓన్లీ అబ్సెషన్ నేనే' అంటూ రామ్ చెప్పే డైలాగ్‌తో టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. 'రామ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. క్రైమ్ ఎలిమెంట్‌తో పాటు ఇందులో చక్కటి ప్రేమకథ ఉంటుంది. తల్లి సెంటిమెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానాకర్షణగా నిలుస్తాయి. ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తయింది' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి, సంగీతం: మణిశర్మ.

# నాగశౌర్య ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



మహేష్ కోనేరు, రాజేంద్ర, నాగశౌర్య, దిల్‌రాజు

**యు**వ హీరో నాగశౌర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కె.పి.రాజేంద్ర దర్శకుడు. ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ ఎస్.కోనేరు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత దిల్‌రాజు క్లాప్‌నివ్వగా, కల్యాణ్‌రామ్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకులు హరీష్‌శంకర్, వి.ఐ.ఆనంద్ గౌరవ దర్శకత్వం వహించారు. 'చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఇందులో నాగశౌర్యను కొత్త పంథాలో చూస్తారు' అని దర్శకుడు చెప్పారు. మహేష్ కోనేరు మాట్లాడుతూ 'మార్చిలో చిత్రీకరణ ప్రారంభించి ఈ ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, ఎడిటింగ్: ఛోటా కె. ప్రసాద్, ఆర్ట్: కిరణ్‌కుమార్, సంగీతం: సాగర్ మహతి.

# భక్త వత్సలం..



మోహన్‌బాబు

**నా**లుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రల్లో నటించిన మోహన్‌బాబు అసలు పేరు భక్తవత్సలం నాయుడు. నిజమైన పేరుతోనే ఆయన వెండితెరపై కనిపించబోతున్నారు. సూర్య ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'ఆకాశం నీ హద్దురా'. సుధా కొంగర దర్శకురాలు. అపర్ణ బాలమురళి కథానాయిక. ఈ సినిమాలో మోహన్‌బాబు కీలక పాత్రను పోషిస్తున్నారు. ఆయన ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం చిత్ర బృందం విడుదలచేసింది. భక్తవత్సలం నాయుడు అనే తెలుగు ప్రాంతానికి చెందిన సీనియర్ ఎయిర్‌ఫోర్స్ అధికారిగా విభిన్నమైన లుక్‌లో ఆయన కనిపిస్తున్నారు. సూర్య మార్గనిర్దేశకుడిగా మోహన్‌బాబు పాత్ర శక్తివంతంగా ఉంటుందని చిత్రబృందం చెబుతున్నది. 'మహానటి' తర్వాత ఆయన నటిస్తున్న సినిమా ఇది. సామాన్యులకు సైతం విమానయానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ఎయిర్ దక్కన్ వ్యవస్థాపకుడు జీఆర్ గోపీనాథ్ జీవితం ఆధారంగా రూపొందిస్తున్న చిత్రమిది. ఏప్రిల్ 9న విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

# ప్లాస్టిక్ సర్జరీ జరిగింది!



శృతిహాసన్

**శృ**తిహాసన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన తాజా ఫొటోలను చూసి నెటిజన్లు అవాక్కయ్యారు. వాటిలో సన్నగా, కాస్త పీలగా కనిపిస్తోందామె. ఈ ఫొటోలను చూసిన కొందరు...ఏమైంది నీకు? ఒక్కసారిగా ఇలా అయిపోయావ్? అని కామెంట్స్ చేయడం మొదలుపెట్టారు. దీంతో చిర్రెత్తిపోయిన శృతిహాసన్ సదరు విమర్శకులకు కౌంటర్ ఇస్తూ ఓ సుదీర్ఘమైన పోస్ట్ పెట్టింది. తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నానని, ఈ విషయాన్ని చెప్పుకోవడానికి మోహమాటం ఏమీ లేదని పేర్కొంది. 'నేను సాధారణంగా ఇతరులు నాపై వెల్లడించే అభిప్రాయాల గురించి పెద్దగా పట్టించుకోను. అయితే నా రూపురేఖలపై తరచుగా వస్తున్న విమర్శల్ని ఖండించడానికే ఈ పోస్ట్ పెట్టాను. చాలా ఏళ్ల నుంచి నా శరీరం తాలూకు హార్మోన్లతో సఖ్యత కుదుర్చుకోవడానికి నేను నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నా. కానీ కొన్ని సందర్భాల్లో అది కష్టమైపోతోంది. నొప్పిని భరించడం, శారీరక మార్పుల్ని స్వీకరించడం అంత ఈజీ కాదు. నా ప్రయాణం గురించి అందరికి తెలియాల్సి ఉందనిపించింది. అందుకే చెబుతున్నా. ఇది నా జీవితం, నా ముఖం...నేను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నా. ఇది చెప్పడానికి సిగ్గుపడటం లేదు. అదే సమయంలో ప్లాస్టిక్ సర్జరీలకు ప్రచారం కల్పించాలనుకోవడం లేదు. మన శారీరక, మానసిక పరిస్థితుల్ని అర్థం చేసుకొని అందుకు అనుగుణంగా ప్రవర్తించడం ప్రతి ఒక్కరికి అవశ్యకం. ప్రతి రోజు నన్ను నేను ఎక్కువగా ప్రేమించుకోవాలని ప్రయత్నిస్తున్నా. నా జీవితంలో గొప్ప ప్రేమకథ నన్ను నేను ప్రేమించుకోవడమే అనుకుంటున్నా. మీరందరూ ప్రేమను పంచండి...ప్రశాంతగా ఉండండి' అంటూ శృతిహాసన్ తాత్వికధోరణిలో వ్యాఖ్యానించింది.

# కార్తికేయ-2



నిఖిల్

**హీ**రో నిఖిల్, దర్శకుడు చందు మొండేటి కలయికలో థ్రిల్లర్ కథాంశంతో 2014లో రూపొందిన 'కార్తికేయ' చిత్రం కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సాధించింది. ఆరేళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్ రూపొందనున్నది. 'కార్తికేయ-2' పేరుతో రూపొందనున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థలు నిర్మించనున్నాయి. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మాతలు. మార్చి 2న తిరుపతిలో ఈ చిత్ర పూజా కార్యక్రమాల్ని నిర్వహించనున్నారు. 'సినిమాకు గొప్ప కథ కుదిరింది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం. ఈ ఏడాది చివరలో సినిమాను విడుదలచేస్తాం' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



నిత్యాశెట్టి, విశ్వాంత్, బ్రహ్మాజీ, సంజయ్

# గౌరవాన్ని నిలబెట్టుకుంటాం

'**అ**ద్భుతమైన కథ, అందమైన సంభాషణలతో సాగే చక్కటి చిత్రమిది. ఈ సినిమా ప్రచారంలో మహేష్‌బాబు, త్రివిక్రమ్, రానా చక్కటి సహాయం చేశారు. అందరి గౌరవాన్ని నిలబెట్టుకుంటామనే నమ్మకముంది' అని అన్నారు బ్రహ్మాజీ. ఆయన తనయుడు సంజయ్‌రావుతో పాటు విశ్వాంత్ దుద్దుంపూడి, నిత్యాశెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఓ పిట్ట కథ'. 'ఇట్స్ ఎ లాంగ్ స్టోరీ' ఉపశీర్షిక. చెందు ముద్దు దర్శకుడు. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి. ఆనందప్రసాద్ నిర్మిస్తున్నారు. మార్చి 6న విడుదలకానుంది. మార్చి 1న హైదరాబాద్‌లో జరగనున్న ప్రీ రిలీజ్ వేడుకకు అగ్ర హీరో చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇటీవల చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'ముక్కోణపు ప్రేమకథ ఇది. వెంకటలక్ష్మి అనే యువతి చుట్టూ సాగుతుంది. ఆమె అదృశ్యానికి కారణమేమిటన్నది నవ్విస్తూనే థ్రిల్‌ను పంచుతుంది. సెన్సార్ పూర్తయింది. క్లీన్ 'యు' సర్టిఫికెట్ లభించింది' అని తెలిపారు. కొత్తవాళ్లమైన మమ్మల్ని నమ్మి ఆనందప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించడం ఆనందంగా ఉందని, స్నేహితుల్లా అందరం కలిసిపోయి ఈ సినిమా చేశామని సంజయ్‌రావు పేర్కొన్నారు. తన కెరీర్‌కు టర్నింగ్‌పాయింట్‌గా నిలిచే చిత్రమిదని నిత్యాశెట్టి చెప్పింది. విశ్వాంత్ మాట్లాడుతూ ''కేరింత' నుంచి ఇప్పటివరకు చేసిన ప్రతి సినిమా నటుడిగా నాకు గౌరవాన్ని తీసుకొచ్చింది. ఆ కోవలోనే ఈ సినిమా నన్ను మరో మెట్టు ఎక్కిస్తుందనే విశ్వాసముంది' అని చెప్పారు. బ్రహ్మాజీ మాట్లాడుతూ 'మా అబ్బాయితో పాటు దర్శకుడి ప్రతిభను నమ్మి ఈ సినిమాకు అండగా నిలిచాను. ఇప్పటివరకు తెలుగు తెరపై రాని కథ ఇది. తర్వాత ఏం జరుగుతుందోననే ఉత్కంఠను ప్రతిక్షణం పంచుతుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆనందప్రసాద్, బాలరాజు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.













నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 29 ఫిబ్రవరి 2020



# 50 లక్షల్లోపు ఫ్లాట్లు కావాలి

**హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని చాలామంది కలలు కంటున్నారు. వీరు ఆశించినట్లుగా డెవలపర్లు నిర్మాణాలు చేపడితే.. మన నిర్మాణ రంగానికి మరో పది, పదిహేనేండ్ల దాకా ఢోకా ఉండదు. దాదాపు డెబ్బయ్ శాతం మంది కొనుగోలుదారులు రూ.50 లక్షల్లోపు ఫ్లాట్లు లభిస్తే తక్షణమే కొంటామని అంటున్నారు. కానీ, వీరికోసం ఎంత మంది డెవలపర్లు ఫ్లాట్లను నిర్మిస్తారు? మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేసే బిల్డర్లు ఎందరున్నారు?**

భారతదేశంలో ఇండ్ల కొనుగోలుదారులు ఎంత ధర గల ఇండ్లను కొనడానికి మక్కువ చూపిస్తున్నారు? అసలు వీరికి ఎంత రేటులో ఫ్లాట్లు కావాలి? అనే అంశంలో మ్యాజిక్ బ్రిక్స్ నిర్వహించిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దాదాపు డెబ్బయ్ శాతం మంది కొనుగోలుదారులు రూ.50 లక్షల్లోపు ధర గల ఫ్లాట్లను తీసుకోవడానికి ఆసక్తి చూపించడం విశేషం. ఫ్లాట్ల ధర 15– 20 లక్షలుంటే 28 శాతం మంది కొనడానికి సిద్ధంగా ఉన్నారు. రూ.20 నుంచి 30 లక్షలైతే 23 శాతం, 30 నుంచి 50 లక్షలుంటే 25 శాతం,

## 70% బయ్యర్ల మాట ఇదే

సుమారు 22 శాతం మంది రూ.50 లక్షలు పైబడి ఫ్లాట్లను కొనడానికి ఆసక్తి చూపెట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ ఆవాస్ యోజన ద్వారా క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీము కింద సుమారు రూ.2.30 లక్షలకు పైగా రాయితీని అందజేయడంతో.. రూ.50 లక్షల్లోపు ఇండ్లను కొనడానికి అధిక శాతం మంది ముందుకొస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఫ్లాట్ల ధర చదరపు అడుక్కీ రూ.4,000 నుంచి రూ.5,000 పలుకుతున్నది.

## కానీ, ఈ రేటులో ఫ్లాట్లు ఎక్కడ దొరుకుతాయ్?

■ 2022 నాటికి భారతదేశంలోని పట్టణాల్లో నివసించే వారందరూ సొంతిల్లు కొనుక్కోవడానికి కేంద్రం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన స్కీమును ప్రవేశపెట్టింది. రూ.45 లక్షల్లోపు విలువ గల ఫ్లాట్లను కొంటే జీఎస్టీ కేవలం ఒక శాతమే కట్టాల్సి ఉంటుంది. పైగా, వీటిని కొంటే నగదు రాయితీ పథకాన్ని వర్తింపజేస్తుంది. దీంతో, దేశవ్యాప్తంగా డెవలపర్లు ఈ తరహా కట్టడాల్ని నిర్మించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. వీరు కడితే ఫ్లాట్లను కొనుక్కోవడానికి ప్రజలు ముందుకొస్తారు.

## వీటిని కట్టే డెవలపర్ల శాతమెంత?

### రెరా ఉందా? లేదా?

అందుబాటు గృహాల్లో ప్రాజెక్టులను కొనుగోలు చేసేటప్పుడు రెరా అనుమతి ఉందా? లేదా? అనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకోవాలి. కేవలం ప్రభుత్వ అనుమతులున్న ప్రాజెక్టుల్లోనే తీసుకోవాలి. పైగా, ఫ్లాట్ ఎంచుకునేటప్పుడు డెవలపర్ గత చరిత్ర గురించి ఆరా తీయాలి. తను కట్టిన గత ప్రాజెక్టులను సకాలంలోనే ఫ్లాట్లను అప్పగించాడా అనే విషయాన్ని కనుక్కోవాలి. నాణ్యతలో సంస్థ ఎలాంటి నిబంధనల్ని పాటిస్తుందో కనుక్కోవాలి.

### హైదరాబాద్‌లో ఎక్కడ?

రూ.50 లక్షల్లోపు ఫ్లాట్లను కొనుగోలు చేయాలని అందరికీ కోరికగానే ఉంటుంది. కాకపోతే, కేవలం కొద్దిమంది మాత్రమే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోగల్గుతున్నారు. పశ్చిమ హైదరాబాద్‌లో ఈ రేటుకు ఫ్లాటు కొనాలంటే, కనీసం కొల్లూరు, మోకిలా, బీరంగూడ వరకూ వెళ్లాలి. రేటు తక్కువని ఫ్లాటు కొన్నా.. అక్కడ్నుంచి ప్రతిరోజూ మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలిలకు సులువుగా రాకపోకలు సాగించలేని దుస్థితి. మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లలో రెండు పడక గదుల ఫ్లాట్ కోసం ఎంతలేదన్నా రూ.75 నుంచి రూ.90 లక్షలు దాకా పెట్టాలి. అదే, ఈస్ట్ హైదరాబాద్‌లో అయితే ఉప్పల్ దాటిన తర్వాత బోడుప్పల్, పీర్జాదిగూడ వంటి ప్రాంతాల్లో తప్ప రూ.50 లక్షల్లోపు ఫ్లాటు దొరికే పరిస్థితి లేదు. విజయవాడ హైవే విషయానికొస్తే.. ప్రస్తుతం హయత్ నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని చిన్న సైజు అపార్టుమెంట్లలో ఈ రేటుకు ఫ్లాట్లు లభిస్తున్నాయి. ప్రస్తుతం కాస్తోకూస్తో అందుబాటులో ఉన్న ప్రాంతం అంటే, నార్త్ హైదరాబాద్ అని చెప్పొచ్చు. కొంపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో రెండు పడక గదుల ఫ్లాట్లు రూ.50 లక్షల్లోపు లభిస్తున్నాయి.

### ఎందుకు నిర్మించడం లేదు?

సొంతంగా భూమిని కొని అపార్టుమెంట్లను నిర్మించే డెవలపర్ల శాతం తక్కువే. దేశ, విదేశీ పెట్టుబడి సంస్థలు లేదా ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులొస్తే తప్ప కొన్ని కంపెనీలు సొమ్ము పెట్టి భూమిని కొనట్లేదు. జాయింట్ డెవలప్‌మెంట్ మీద స్థలం తీసుకున్నవారు అధిక విస్తీర్ణం గల ఫ్లాట్లను డిజైన్ చేస్తున్నారే తప్ప, తక్కువలో కట్టడానికి ఆసక్తి చూపించట్లేదు. చాలామంది ఇంకా, 2006–08 మార్కెట్ నుంచి బయటికి రావట్లేదు. నవ కొనుగోలుదారులు ఫ్లాట్లను కొనడానికి ఆసక్తి చూపించడం లేదనే విషయాన్ని విస్మరిస్తున్నారు.''ఎవరైతే నాకేంటి.. నాకిష్టం వచ్చినట్లు ఫ్లాట్లు కడతా' అని అనుకుంటున్నారే తప్ప.. బయ్యర్లు ఎలాంటి ఫ్లాట్లను కోరుకుంటున్నారనే విషయాన్ని నగర నిర్మాణ సంస్థలు పట్టించుకోవడం లేదు. మార్కెట్‌ను అంచనా వేసి.. కొనుగోలుదారుల కొనుగోలు శక్తిని గుర్తించి.. ప్రాజెక్టులను డిజైన్ చేయాలి.

# ట్రంపు టవర్లు వెలవెల

అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరిట పుణెలో నిర్మితమవుతున్న ట్రంప్ టవర్లకు ఆర్థిక మాంద్యం సెగ తప్పడం లేదు. సుమారు 23 అంతస్తుల ఎత్తులో ఆకాశాన్నంటేలా సిద్ధమైన ట్రంప్ టవర్లలో సుమారు రెండు మిలియన్ డాలర్ల విలువ గల ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయి. అందులో తీసుకోవడానికి కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో స్విమ్మింగ్ పూల్ వెలవెలపోతున్నది. అమ్మకాలు తగ్గడంతో ఆయా




ప్రాజెక్టును సందర్శించడానికి బయ్యర్లు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ట్రంప్ బ్రాండ్‌కు మస్తు గిరాకీ ఉండేది. కానీ, గత కొంతకాలం నుంచి ఆర్థిక సంక్షోభం కారణంగా.. మహారాష్ట్రలో రియల్ రంగం దారుణంగా దెబ్బతిన్నది. ట్రంప్ పేరు చెప్పగానే కొనుగోలుదారులు ఎగబడి కొనేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లేవని రియల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

■ ఒకప్పుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా పోటీ చేస్తున్నాడని తెలియగానే.. పలు నిర్మాణ సంస్థలు ఆయన బ్రాండ్ పేరును వాడుకునేందుకు లైసెన్సు తీసుకుని అపార్టుమెంట్లు విక్రయించడానికి పోటీ పడ్డాయి. దీంతో, భారతదేశంలో దాదాపు నాలుగు ప్రాంతాల్లో ఆరు ట్రంప్ టవర్లు ప్రారంభం అయ్యాయి. ఇందులో ముప్పయ్ లక్షలకు జనాభా గల పుణె నగరమూ ఉండటం గమనార్హం. అయితే, అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత డొనాల్డ్ ట్రంప్ ప్రప్రథమంగా భారతదేశానికి విచ్చేసినప్పటికీ, ట్రంప్ టవర్లకు పెద్దగా గిరాకీ లేకుండా పోయింది. వివిధ నగరాల్లో ఆర్థిక మాంద్యం కారణంగా, పలువురు డెవలపర్లు ధరలను తగ్గించి ఫ్లాట్లను విక్రయిస్తున్నారు. ఇతర ప్రాజెక్టుతో సహా ట్రంప్ టవర్లలో ఫ్లాట్లను కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ట్రంప్ పేరుతో 46 ఫ్లాట్లను నిర్మించగా.. కేవలం ఏడింట్లో కొనుగోలుదారులు నివసిస్తున్నారు.






## ప్రాజెక్టు పరిచయం

# 70 లక్షలకే ట్రిపుల్ బెడ్‌రూం ఫ్లాట్

| | |
|---|---|
| **ప్రాజెక్టు పేరు :** | ప్రణీత్ జాగృతి ఎలైట్ |
| **ఎక్కడ :** | కొల్లూరు (తెల్లాపూర్ చేరువలో) |
| **విస్తీర్ణం :** | 2 ఎకరాలకు పైగా |
| **ఫ్లాట్ల సంఖ్య :** | 144 |
| **ఎప్పుడు పూర్తి? :** | రెండున్నరేండ్లు |

నగరానికి చెందిన ప్రణీత్ గ్రూప్ తాజాగా కొల్లూరులో ప్రణీత్ జాగృతి ఎలైట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. హెచ్ఎండీఏ అనుమతి తీసుకుని, రెరా ఆమోదం పొందాకే ప్రణీత్ సంస్థ సుమారు రెండుకి పైగా ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నది. రెండు టవర్లలో.. ఎనిమిది అంతస్తుల ఎత్తులో 144 ఫ్లాట్లు వస్తాయి. ఇందులో వచ్చేవన్నీ ట్రిపుల్ బెడ్‌రూం ఫ్లాట్లే. విస్తీర్ణం 1617 చదరపు అడుగుల నుంచి 2287 చ.అ.ల్లో ఉంటాయి. విశాలమైన ఫ్లోర్ ప్లాన్లు, చక్కటి గాలీవెలుతురు వచ్చేలా వాస్తు సూత్రాలకు అనుగుణంగా ప్రాజెక్టును తీర్చిదిద్దింది. 'ప్రణీత్ ఎలైట్'ను తివాచీ పర్చిన పచ్చదనంతో దర్శనమిచ్చేలా ముస్తాబు చేస్తున్నది. హరిత సూత్రాలకు అనుగుణంగా డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి.

■ ప్రణీత్ గ్రూప్ ఎప్పటిలాగే ఈ ప్రాజెక్టులో ఆధునిక సదుపాయాలకు పెద్దపీట వేసింది. ఆకట్టుకునే రీతిలో క్లబ్‌హాజును తీర్చిదిద్దుతున్నది. ఏసీ జిమ్, స్విమ్మింగ్ పూల్, ఇండోర్ గేమ్స్, బ్యాంకెట్ హాల్, ఆహ్లాదకరమైన గార్డెన్లకు అభివృద్ధి చేస్తున్నది. చిన్నారులకు ప్రత్యేక ఆటస్థలాలు, జాగింగ్ ట్రాక్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్, మల్టీపర్పస్ రూములు, యోగా, మెడిటేషన్ హాల్, సూట్ రూములు వంటివి ఏర్పాటు చేస్తున్నది. 'రెరా అనుమతి తీసుకున్నాక ప్రకటించిన ఈ ప్రాజెక్టులో శ్లాబుల స్థాయిలో పని జోరుగా జరుగుతున్నది. రెండున్నరేండ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. మేం ఊహించిన దానికంటే అధిక ఆదరణ లభిస్తున్నద'ని సంస్థ ఎండీ నరేంద్ర కామరాజు తెలిపారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూ.. నిర్ణీత గడువులోపు ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్న పేరు తమ సంస్థకు కొనుగోలుదారుల్లో ఉన్నదన్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు మరికొన్ని నిర్మాణాల్ని నగరంలో చేపడుతున్నామని ఆయన చెప్పారు. ఆరంభం నుంచి తమ ప్రాజెక్టుల్లో కొన్నవారు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

# గృహరుణంపై వడ్డీ రేటెంత?

| బ్యాంకు | వడ్డీ రేటు(%) | ప్రాసెసింగ్ ఫీజు (రూ./శాతాల్లో) |
|---|---|---|
| స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా | 7.90–8.55 | 2000–10,000 |
| హెచ్‌డీఎఫ్‌సీ | 8–8.30 | 0.50 % వరకు |
| ఐసీఐసీఐ బ్యాంకు | 8.60–9.40 | 0.50–1 % |
| యాక్సిక్ బ్యాంకు | 8.55–9.40 | 1 % వరకు |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 8.15–9.15 | 0.25–0.50 % |
| పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ | 7.95–8.70 | 1 % వరకు |
| ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ | 8.40–8.50 | 10,000–15,000(+ట్యాక్స్) |
| కర్ణాటక బ్యాంకు | 8.65–10.25 | 0.50–2 % |
| యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 8.00–8.15 | రూ.1000/ఆపై |
| విజయా బ్యాంకు | 8.10–9.10 | 0.50 శాతం/రూ.20,000 |
| స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంకు | 9.26 ఆపై | 1 % వరకు |
| యూకో బ్యాంకు | 8.05–8.60 | 0.50 % |
| సిటీబ్యాంకు | 8.05–9.60 | రూ.10,000 |
| హెచ్ఎస్‌బీసీ బ్యాంకు | 8.55–8.65 | రూ.10,000 లేదా 1% |
| ఓరియంటల్ బ్యాంకు | 8.25–8.80 | 0.50 % |
| కోటక్ మహీంద్రా బ్యాంకు | 8.60–9.40 | రూ.10,000 వరకు |
| ఇండియా బుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ | 8.99 | గరిష్టంగా 1 % |
| ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు | 8.00–14.00 | రూ.10,000 |
| కెనరా బ్యాంకు | 8.05–10.05 | 0.50 %(గరిష్టంగా రూ.10 వేలు) |
| ఫెడరల్ బ్యాంకు | 8.55–8.70 | 0.50 %(గరిష్టంగా రూ.7500) |
| ఆంధ్రాబ్యాంకు | 8.15–9.20 | 0.50 %(గరిష్టంగా రూ.10 వేలు) |
| ధనలక్ష్మి బ్యాంకు | 9.55–10.25 | 1 % |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 8.10–8.40 | 0.25 %(గరిష్టంగా రూ.20వేలు) |
| బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర | 8.55–9.00 | 0.25 % |
| ఐడీబీఐ బ్యాంకు | 8.25–8.80 | 0.50 % |
| ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు | 8.20–10.95 | 0.50 % |
| కరూర్ వైశ్య బ్యాంకు | 8.65–12.50 | రూ.2500–7500 |
| సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా | 8.00–8.55 | 1 % / కనీసం రూ.10వేలు |

**గమనిక :** అవగాహన కోసమే ఈ పట్టిక. తుది రేటు కోసం బ్యాంకును సంప్రదించాలి.










## ఆపన్నహస్తం అందేనా?

నిలిచిపోయిన గృహనిర్మాణ ప్రాజెక్టులకు కేంద్రం రూ.12,500 కోట్ల ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధిని ప్రకటించింది. దీంతో, రూ.26 వేల కోట్లు పెట్టుబడి సహాయం లభిస్తుందని డెవలపర్లు భావిస్తున్నారు. గత ఏడాది నవంబర్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించిన ఈ ప్రత్యేక నిధులతో.. ఇప్పటివరకు రూ.540 కోట్లకు పైగా ప్రాజెక్టులను పూర్తి చేసింది. దీంతో, నిలిచిపోయిన ప్రాజెక్టుల్లో ఫ్లాట్లను కొనుక్కున్న 1800 మందికి పైగా కొనుగోలుదారులకు ఉపశమనం కలిగింది. రూ. 26 వేల కోట్ల ప్రత్యామ్నాయ పెట్టుబడితో 50 వేల యూనిట్లకు మోక్షం లభిస్తుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా, స్థిర నివాసం పొందాలన్న 2,40,000 మంది కల నెరవేరుతుంది. ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధుల ద్వారా పంపిణీపై పూర్తి నియంత్రణ ఉండటంతో పాటు పూర్తి స్థాయిలో ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే అప్పటికే ఉన్న రుణదాతలకు కొద్ది మొత్తంలో నగదు అందుతుంది. దీంతో ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధి తిరిగి రాబడిని పొందుతుంది. దేశవ్యాప్తంగా 1,509 నిలిచిన నివాస ప్రాజెక్టుల్లో 4.58 లక్షల యూనిట్లు ఉన్నాయి. వీటిని పూర్తి చేయడానికి రూ.55 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా.

# ఈ–వేస్ట్ పెద్ద ముప్పు




మనిషి జీవితంలో ఎలక్ట్రానిక్ పరికరాలూ ఒక భాగమైపోయాయి. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, టీవీల వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకంతో వ్యర్థాల ఉత్పత్తి ప్రమాదకరస్థాయి చేరుకుంటున్నాయి. ఫలితంగా, పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతున్నది. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే ముప్పుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని ఇటీవల నగరంలో జరిగిన ఓ సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు.

2001లో 310 మిలియన్ల మంది మొబైల్ ఫోన్ల వినియోగదారులుంటే, 2019 నాటికి 1.16 బిలియన్లకు చేరుకున్నది. భారతదేశంలో మొబైల్ ఫోన్ల వినియోగదారుల సంఖ్య అమెరికా కంటే దాదాపు 4 రెట్లు ఎక్కువైంది. మొబైల్ ఫోన్ల వినియోగదారుల్లో 1.3 బిలియన్లతో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారతదేశం రెండో స్థానంలో నిలిచింది. దేశంలో 57 మిలియన్ల మంది కంప్యూటర్లతో పాటు ఇతర గాడ్జెట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను వాడుతున్నారు. ఈ–వేస్ట్ వల్ల కలిగే దుష్పరిణామాలు, కాలుష్యం, ఈ–వ్యర్థాల రీసైక్లింగ్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

■ గత పదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా ఈ–వేస్ట్ సమస్యగా మారింది. మన వద్ద 4 మిలియన్ టన్నులతో అధిక శాతం అసంఘటిత రంగమే ఉత్పత్తి చేస్తున్నది. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లే ప్రధాన ఎలక్ట్రానిక్ వ్యర్థాలకు కారకాలని ఎలక్ట్రానిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇండియా గుర్తించింది. ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో 70 శాతం కంప్యూటర్లు కారణంగా కాగా, 12 శాతం టెలీకమ్యూనికేషన్ పరికరాలు కారణమవుతున్నాయి. ముంబైలో ఏటా 1,20,000 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఢిల్లీ 98,000 టన్నులు, బెంగళూరు 92,000 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి చేస్తున్నాయి. హైదరాబాద్ వార్షికంగా 50 వేల టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తున్నది.

## పెట్టుబడుల్లో పెరుగుదల



భారతదేశంలో ప్రాపర్టీ టెక్నాలజీపై పెట్టుబడి రోజురోజుకూ పెరుగుతున్నది. 2018లో 3.4 మిలియన్ డాలర్ల మేరకు ప్రాప్‌టెక్‌లో పెట్టుబడి పెట్టగా 2019 నాటికి 56.8 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఒక ఏడాదిలోనే ప్రాప్‌టెక్ పెట్టుబడులు 17 రెట్లు పెరగడం విశేషం. 2019లో ఆసియా పసిఫిక్‌లో ప్రాప్‌టెక్ స్టార్టప్‌లు వారి నిధుల క్షీణతను 38.4 శాతం తగ్గించాయి. జేఎల్ఎల్, టెక్ మీడియా సంస్థ నిర్వహించిన టెక్ ఇన్ ఆసియా పరిశోధనల ప్రకారం.. గత సంవత్సరం ఆసియా పసిఫిక్‌లో ప్రాప్‌టెక్ స్టార్టప్‌లు 625.9 మిలియన్ డాలర్లను సేకరించాయని తేలింది. డీల్ కౌంట్‌లో 2018లో జరిగిన 50 ఒప్పందాలతో పోలిస్తే 2019లో 38 ఒప్పందాలకు పడిపోయింది. భారతదేశంలో ప్రాప్‌టెక్ స్టార్టప్‌ల నిధులు 12 మిలియన్ డాలర్ల నుంచి 26.1 మిలియన్ డాలర్లకు పెరిగాయి. దీంతో సంవత్సరానికి 117.5 శాతం పెరిగినట్టు తేలింది.



# పృథ్వీ ఫిట్.. ఇషాంత్ డౌట్

## నేటి నుంచి కివీస్‌తో భారత్ రెండో టెస్టు

### జోరుమీదున్న బ్లాక్‌క్యాప్స్.. ఒత్తిడిలో కోహ్లీసేన



తెల్లవారుజామున 4.00 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

**క్రైస్ట్‌చర్చ్:** ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో అప్రతిహతంగా దూసుకెళ్తున్న టీమ్‌ఇండియాకు న్యూజిలాండ్‌తో మొదటి టెస్టులో భారీ షాక్ తగిలింది. పరీక్ష పెట్టిన పచ్చిక పిచ్‌పై మన బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమవడంతో.. కోహ్లీసేన అనూహ్య పరాజయం చవి చూసింది. దీంతో 0-1తో వెనుకబడ్డ భారత్ శనివారం నుంచి ప్రారంభం కానున్న రెండో టెస్టులోనైనా నెగ్గి సిరీస్ సమం చేయాలని భావిస్తున్నది. ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడ్డ యువ ఓపెనర్ పృథ్వీ షా ఫిట్‌నెస్ సాధించగా.. జోరుమీదున్న ఇషాంత్ శర్మ మ్యాచ్ ఆడటం అనుమానంగా మారింది. పాత గాయం తిరగబెట్టడంతో శుక్రవారం ప్రాక్టీస్ సెషన్ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్న లంబూ బరిలో దిగడం డౌటే. ఉమేశ్, సైనీల్లో ఒకరు అతడి స్థానాన్ని భర్తీ చేయొచ్చు. గత మ్యాచ్‌తో పోల్చుకుంటే హెగ్లే ఓవల్‌లో మరింత పచ్చికతో కూడిన పిచ్ టీమ్‌ఇండియాకు స్వాగతం పలుకనుండటం కలవరపెట్టే అంశం. మరి స్వింగ్, బౌన్స్‌కు సహకరించే వికెట్‌పై మన వాళ్ల బ్యాటింగ్ ఎలా సాగుతుందనేదానిపైనే ఈ మ్యాచ్‌లో భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ పర్యటనలో పెద్దగా రాణించలేకపోయిన కోహ్లీ చెలరేగాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. శుక్రవారం శిక్షణలో భాగంగా స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్ నిక్ వెబ్ పర్యవేక్షణలో మనవాళ్లు 'టర్బో టచ్' అనే కొత్త పద్ధతిలో ప్రాక్టీస్ చేశారు.

# దుబాయ్‌లో ఆసియా కప్

**కోల్‌కతా:** ప్రపంచ క్రికెట్‌లో పెద్దన్న పాత్ర పోషించే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మరోసారి తన మాట చెల్లుబాటయ్యేలా చేసుకుంది. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది చివర్లో పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన ఆసియాకప్‌లో పాల్గొనేది లేదని భారత్ పట్టుబట్టడంతో.. తప్పని పరిస్థితుల్లో టోర్నమెంట్‌ను తటస్థ వేదిక (దుబాయ్)కు మార్చారు. ఈ మేరకు బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ శుక్రవారం వివరాలు తెలిపాడు. 'దుబాయ్ వేదికగా ఆసియాకప్ జరుగుతుంది. ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్ జట్లు పాల్గొంటాయి'అని దాదా స్పష్టం చేశాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సమావేశానికి బయలుదేరేముందు మీడియాతో మాట్లాడిన దాదా.. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో భారత ప్రదర్శనను కొనియాడాడు. 'హర్మన్ బృందం చక్కటి ప్రదర్శనతో సెమీ ఫైనల్‌కు చేరింది. ప్రపంచకప్‌లాంటి టోర్నీల్లో ఫేవరెట్లంటూ ఎవరూ ఉండరు. మన జట్టు బాగా ఆడుతున్నది'అని దాదా పేర్కొన్నాడు. న్యూజిలాండ్ పర్యటనలో కోహ్లీసేన తిరిగి పుంజుకుంటుందని గంగూలీ విశ్వాసం వ్యక్తంచేశాడు.

# యాంగ్‌పై ఎనిమిదేండ్ల బ్యాన్



**లుసానె:** డోప్ శాంపిల్స్ ఇచ్చేందుకు నిరాకరించిన ఒలింపిక్ పసిడి పతక విజేతపై ఎనిమిదేండ్ల నిషేధం పడింది. చైనాకు చెందిన స్టార్ స్విమ్మర్, ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాలు కైవసం చేసుకున్న 28 ఏండ్ల సున్ యాంగ్‌పై బ్యాన్ విధిస్తున్నట్లు కోర్ట్ ఆఫ్ ఆర్బిటరేషన్ ఫర్ స్పోర్ట్ (సీఏఎస్) శుక్రవారం స్పష్టం చేసింది. దీంతో అతడు టోక్యో ఒలింపిక్స్ (2020)లో పాల్గొనే అర్హత కోల్పోయాడు. 2018లో రక్త నమూనాలు ఇచ్చేందుకు సున్ యాంగ్ నిరాకరించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు సీఏఎస్ పేర్కొంది. అయితే తానేమి తప్పు చేయలేదని.. ఈ అంశంపై న్యాయపోరాటానికి సిద్ధమని యాంగ్ తెలిపాడు.

# నేటి నుంచి రంజీ సెమీఫైనల్స్



**కోల్‌కతా:** దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ సెమీఫైనల్స్‌కు వేళైంది. శనివారం నుంచి ప్రారంభం కానున్న సెమీఫైనల్స్‌లో బెంగాల్‌తో కర్ణాటక.. గుజరాత్‌తో సౌరాష్ట్ర తలపడనున్నాయి. టోర్నీ ఆరంభం నుంచి నిలకడైన ప్రదర్శన కొనసాగించిన ఈ నాలుగు జట్లు తుదిపోరుకు చేరేందుకు అడుగుదూరంలో నిలిచాయి. గత పదమూడేండ్లలో ఒక్కసారి కూడా ఫైనల్ చేరలేకపోయిన బెంగాల్ జట్టు.. సెమీస్‌లో పటిష్ఠ కర్ణాటకతో తలపడనుంది. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దుమ్మురేపిన లోకేశ్ రాహుల్.. అందుబాటులో ఉండటం కర్ణాటక బలాన్ని రెట్టింపు చేస్తున్నది.



# సెమీస్ సన్నాహం

## నేడు శ్రీలంకతో తలపడనున్న భారత్.. మహిళల టీ20 ప్రపంచకప్

**విశ్వసమరంలో సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న భారత మహిళల జట్టు.. చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ, బౌలింగ్‌లో పూనమ్ యాదవ్ వీర విజృంభణతో అజేయంగా సాగుతున్న హర్మన్ గ్యాంగ్‌కు ఈ మ్యాచ్‌లోనూ పెద్దగా ప్రతిఘటన ఎదురుకాకపోవచ్చు. అయితే నాకౌట్‌కు ముందు మిడిలార్డర్ లోపాలు సరిదిద్దుకునేందుకు మనవాళ్లకు ఇది చక్కటి అవకాశం. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ బ్యాట్‌తో మెరిస్తే.. టీమ్‌ఇండియా రెట్టించిన ఆత్మ విశ్వాసంతో సెమీస్‌లో అడుగుపెడుతుంది!**

**మెల్‌బోర్న్:** పొట్టి ప్రపంచకప్‌లో ఎదురులేకుండా దూసుకెళ్తున్న భారత్.. ఆఖరి లీగ్ మ్యాచ్‌కు రెడీ అయింది. ఈ ఫార్మాట్‌లో ప్రపంచకప్ ప్రారంభమైనప్పటి నుంచి మూడుసార్లు సెమీస్‌లో అడుగుపెట్టినా.. ఒక్కసారి కూడా తుది పోరుకు అర్హత సాధించలేకపోయిన భారత అమ్మాయిలు ఈసారి వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు. గ్రూప్-ఏలో భాగంగా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన హర్మన్ బృందం నాకౌట్‌కు ముందు ఆఖరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక మహిళలతో తలపడనుంది. ఇరు జట్ల మధ్య శనివారం ఇక్కడి జంక్షన్ ఓవెల్ మైదానంలో మ్యాచ్ జరుగనుంది. సెమీఫైనల్‌కు ముందు జట్టులోని లోటుపాట్లను సరిదిద్దుకునేందుకు భారత జట్టుకు ఇది చక్కటి అవకాశం కాగా.. ఇప్పటి వరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడి సెమీస్ రేసు నుంచి నిష్క్రమించిన లంక.. టోర్నీలో బోణీ కొట్టాలని తహతహలాడుతున్నది.

### షఫాలీపై అందరి దృష్టి

మెగాటోర్నీలో ఆజేయంగా సెమీస్ చేరిన భారత్‌ను మిడిలార్డర్ వైఫల్యం కలవరపెడుతున్నది. భీకర ఫామ్‌లో ఉన్న 'లేడీ సెహ్వాగ్' షఫాలీ వర్మ జట్టుకు మెరుగైన ఆరంభాలను ఇస్తున్నా తక్కినవారి నుంచి ఆమెకు సహకారం కరువైంది. ముంబైకర్ జెమీమా రోడ్రిగ్స్ ఫర్వాలేదనిపిస్తుండగా.. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ ఆడలేకపోతున్నది. ఇక మిడిలార్డర్ భారం మోయాల్సిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్.. వైఫల్యాల బాట వీడటం లేదు. ఫలితంగా ఈ విశ్వసమరంలో భారత్ ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారీ స్కోరు నమోదు చేయలేకపోయింది. సెమీస్‌కు ముందు హర్మన్ లయ దొరకబుచ్చుకుంటే.. మనవాళ్లకు తిరుగుండదు. బౌలర్లు సమిష్టిగా కదంతొక్కుతుండటంతో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌లను ఓడించిన టీమ్‌ఇండియా.. లంకతో మ్యాచ్‌లో భారీ స్కోరుపై కన్నేసింది. చేసిన తప్పులనే తిరిగి పునరావృతం చేస్తున్నామని ఒప్పుకున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్.. ఈ సారి ఎలాంటి పొరపాట్లకు అవకాశమివ్వబోమని నమ్మకంగా చెబుతున్నది. బౌలింగ్ విషయానికొస్తే.. అంతుచిక్కని బంతులతో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెడుతున్న లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ ఇదే జోరు కొనసాగించాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటున్నది. టోర్నీలో ఇప్పటి వరకు ఎనిమిది వికెట్లు పడగొట్టిన పూనమ్‌కు మిగిలిన బౌలర్లు సహకరిస్తే.. భారత్ అజేయంగా సెమీస్ చేరడం పెద్ద కష్టమేం కాదు. అయితే నాకౌట్‌కు ముందు ఈ మ్యాచ్‌ను రిహార్సల్స్‌గా భావిస్తున్న టీమ్‌ఇండియా.. లోపాలను సరిచేసుకుంటుందా లేక పాత పాటే పాడుతుందా చూడాలి. మరోవైపు వరుస పరాజయాలతో సతమతమవుతున్న లంక ఈ మ్యాచ్‌లోనైనా నెగ్గి పరువు దక్కించుకోవాలని భావిస్తున్నది. శనివారం గ్రూప్-బిలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 113 పరుగుల తేడాతో థాయ్‌లాండ్‌పై విజయం సాధించగా.. ఇంగ్లండ్ 42 రన్స్ తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది.

> సెమీస్‌కు అర్హత సాధించినా.. లంకతో మ్యాచ్‌లో తీవ్రత తగ్గించం. ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయడం లేదు. మా ప్రణాళికలను అమలు చేయడంపైనే దృష్టిపెడతాం. సెమీఫైనల్ గురించి ఇప్పుడే చర్చించడం తొందరపాటవుతుంది. లంక కెప్టెన్ వికెట్ పడగొట్టడం ముఖ్యమే కానీ, ప్రతీ మ్యాచ్‌లో ప్రత్యర్థిని ఆలౌట్ చేయాలనేదే మా ఆలోచన.
>
> **- హర్మన్‌ప్రీత్ కౌర్, భారత్ కెప్టెన్**

### తుది జట్లు (అంచనా)

**భారత్:** హర్మన్‌ప్రీత్ (కెప్టెన్) షఫాలీ వర్మ, స్మృతి, తానియా, జెమీమా, దీప్తి, వేద, శిఖ, రాధ, పూనమ్, రాజేశ్వరి.

**శ్రీలంక:** జయంగని (కెప్టెన్), హాసిని, తిమాషిని, సంజీవనీ, నీలాక్షి, కాంచన, శశికళ, మాధవి, దిల్హారి, కుమారి, ప్రబోధిని.

| నేటి మ్యాచ్‌లు | |
|---|---|
| న్యూజిలాండ్ X బంగ్లాదేశ్ | |
| వేదిక: మెల్‌బోర్న్ | ఉ. 5.30 |
| భారత్ X శ్రీలంక | |
| వేదిక: మెల్‌బోర్న్ | మ. 1.30 |
| స్టార్ స్పోర్ట్స్‌లో | |





**Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office:** Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

*₹10000 ఆదా సాధారణ ఫైనాన్స్ స్కీంపై లెక్కించబడింది మరియు నిర్దేశిత లోన్ మొత్తం మరియు వ్యవధి పై ఆధారపడింది. ఎంపిక చేయబడిన ఫైనాన్షియర్‌తో తమ స్వంత నిర్ణయాధికారం మేరకు ఫైనాన్స్ లభిస్తుంది. చిత్రంలో చూపించబడిన ఉత్పత్తి మార్కెట్‌లో లభించే అసలు ఉత్పత్తి కంటే వేరుగా ఉండవచ్చు. చిత్రంలో చూపించిన యాక్సెసరీస్ ప్రామాణిక ఫిట్మెంట్‌లో భాగం కాదు. **షరతులు వర్తిస్తాయి.

**Honda Exclusive Authorized Dealerships: KARIMNAGAR:** Samrat Honda - 0878-2277299; 9441333665; Srikanth Honda - 0878-2224555, 7799946632; **KARIMNAGAR INTERCITY BRANCH, VAVILALA RAMREDDY NAGAR:** Samrat Honda - 0878 2954514; 9849252091; **JAGATIAL:** Samrat Honda - 9701200045, 9704500045; Vennela Honda - 9618416377; **HUZURABAD:** Samrat Honda - 8099979050; **SIRCILLA:** Srikanth Honda - 08723-233336, 7799700245; **VEMULAWADA:** Srikanth Honda - 9177662757; **METPALLY:** Saanvi Honda - 9581295818; **JAMMIKUNTA:** Srikanth Honda - 7799700263; **HUSANABAD:** Laxmi Honda - 08019138142; **RAMAGUNDAM:** Sai Ram Krishna Honda - 8100779999; **PEDDAPALLY:** Sairam Krishna Honda - 9100044414; **SULTANABAD:** Aradhana Honda - 9849885862; **DHARMARAM:** Sairam Honda - 7799146669; 08728-270950; **MANCHERIAL:** Jagadamba Honda - 08736-259303, 9849113133; **BELLAMPALLY:** Thirumala Honda - 08735225975; 9059979909; **ASIFABAD:** Jagadamba Honda - 9849113133; **KAGAZNAGAR:** Jagadamba Honda - 9849113133; **ADILABAD:** Sree Mahalakshmi Honda - 9010977757; **NIRMAL:** Sree Mahalakshmi Honda - 9010977757; **KHANAPUR:** Sri Ganesh Honda - 9010977757; **BHAINSA:** Sree Mahalakshmi Honda - 9010977757; **ICHODA:** Sree Mahalakshmi Honda - 9010977757; **UTNOOR:** Mahalakshmi Motors - 901097757; **BOATH:** Ajay Motors - 9010977757; **ADILABAD INTERCITY NEAR BUSSTAND:** Sree Mahalakshmi Honda - 9010977757.

**For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com**